చిక్కనవ్వుతున్న పాట



3062

సంపాదకులు : జి. లక్ష్మీనరసయ్య, త్రిపురనేని శ్రీనివాస్

SHOUT
SHARE
IT

చిక్కనవుతున్న పాట

దళిత కవిత్వం

సంపాదకులు

జి. లక్ష్మీ నరసయ్య

త్రిపురనేని శ్రీనివాస్

కవిత్వం ప్రచురణలు

చిక్కనవ్వుతున్న పాట

దళిత కవిత్వం

కవిత్వం ప్రచురణలు-14
ప్రథమ ముద్రణ: జనవరి, 1995

808.818
చిక్కనవ్వుతున్న -- చిక్క

వెల: రూ. 30/-

ముఖచిత్రాక్షరాలు : శ్యామోహన్

లేజర్ టైప్ సెట్టింగ్ : ప్రింటికా, విజయవాడ
ముద్రణ: మోహన్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్

సోల్ డిస్ట్రిబ్యూటర్స్ :
పల్లవి పబ్లికేషన్స్
ఏలూరు రోడ్డు
విజయవాడ - 2

Acc. No. 6156

A.C. No. 3062



దేశీయ మార్క్సిజమే దళిత కవిత్వం ఎజెండా

సాహిత్యంలో కులమతాల అభివ్యక్తి ఉండటం సబబేనా? అనే ప్రశ్న ఇప్పటికీ చాలామందిని వేధిస్తున్న విషయం. సాహిత్యంలో ఏది ఉండాలి? ఏది ఉండకూడదు? అనే సమస్య జీవితంలో ఏముంది? ఏమిలేదు? ఏది ఏ పాత్రను నిర్వర్తిస్తుంది? అనే విషయంతో ముడిపడి ఉంటుంది. కుల మతాలు ఒకరి అభివృద్ధికీ, సౌకర్యానికీ మరొకరి అణచివేతకూ, అభద్రతకూ సాధనాలుగా కొనసాగుతున్న సమాజంలో రచయితలు ఇతర సమస్యలతో పాటు కులమతాల సమస్యను పట్టించుకోనప్పుడు ఈ దేశంలోని ఒక ముఖ్య వాస్తవాన్ని నిర్లక్ష్యం చేస్తున్న బాధ్యతా రహితులవుతారు. భారతదేశంలో అధికసంఖ్యాకులయిన పీడితకులాల ప్రజల్లోనే ఎక్కువశాతం పేదవాళ్లుగా, నిరుద్యోగులుగా, నిరక్షరాస్యులుగా ఉండటానికి కారణాలేంటో తెలుసుకోవాలంటే కులవ్యవస్థని మొత్తంగా పట్టించుకోవాల్సిన అవసరం ఉంటుంది. కులవ్యవస్థను పట్టించుకున్నప్పుడు దానికి కారణమయిన హిందూ మత వ్యవస్థమీదికి దృష్టి సారించాల్సి ఉంటుంది. ఈ పరిస్థితిని గుర్తించిన ఏ రచయితయినా, కవి అయినా కులమతాల అభివ్యక్తితో రాయకుండా ఉండలేరు. అట్లా రాసినప్పుడే ప్రజాసాహిత్యం సృష్టిఅవుతుంది.

చరిత్ర నిండా సత్యాలను మింగిన కొండచిలువలు తారసపడతాయి. తెలుగు సాహిత్య చరిత్ర ఇందుకు అతీతం కాదు. 1985 తరవాత ఉధృతంగా ముందుకు వచ్చిన దళిత కవిత్వం తెలుగు సాహిత్య చరిత్రలో మరుగున పడిన కొన్ని సత్యాలను బయటపెట్టింది. ఇప్పటి దాకా ప్రగతివాద సాహిత్యంగా ప్రజాసాహిత్యంగా చలామణి అయిన రచనలు ప్రతిపాదించిన అభ్యుదయం మన ప్రధాన సామాజిక వాస్తవాన్ని, అధికశాతం ప్రజానీకపు

ప్రత్యేక సమస్యల్ని గుర్తించకుండా అందుకు అతీతంగా వచ్చిన అభ్యుదయమే అనేది ఒక సత్యం. మేటి రచయితలుగా పేరుపడిన వారంతా అమూర్తపీడితుల్ని చిత్రించి ఊరుకున్నట్లే అమూర్త అభ్యుదయాన్ని ప్రతిపాదించి తృప్తి పడ్డారని చెప్పవచ్చు. నిర్దిష్ట రూపురేఖలు లేని అభ్యుదయం నిర్దిష్టపరిస్థితుల అవగాహనలేకుండా వచ్చిందే అవుతుంది. అమూర్త అభ్యుదయం ప్రకారం పీడితులంటే ఆర్థికంగా అణచివేతకీ అసమానతకీ హక్కుల రాహిత్యానికీ గురయ్యేవాళ్ళు. అందుకే ఆర్థిక పీడితుల పురోగతికి తప్ప ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక పీడనకు గురవుతున్న దళితుల అభ్యుదయాన్ని గురించి ప్రత్యేకంగా మాట్లాడుతూ వచ్చిన సాహిత్యం మనకు చాలా తక్కువ. దేశవిముక్తి భూవిముక్తికి సంబంధించిందని చెప్పిన రచయితలూ, కవులూ దేశవిముక్తి అటు ఆర్థికంగా ఇటుసాంఘికంగా పీడనకు గురవుతున్న దళితుల విముక్తితో ముడిపడి ఉందని గుర్తించలేకపోయారు.

కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావంతో దళితులు బయట సమాజంలోకి అడుగుబెట్టినమాట నిజమేకానీ వాళ్ళు దళితులుగా కాకుండా, కింది కులస్తులుగా తమ ప్రత్యేక సమస్యలను దృష్టిలో ఉంచుకొని కాకుండా, కేవలం శ్రామికులుగా, విశ్వమానవులుగా తమను తాము ఊహించుకొని బయటికి వచ్చారు. ఆర్థిక, సాంఘిక దోపిడీలకు గురవుతున్న దళితులు కమ్యూనిస్టుల ప్రభావంతో కేవలం ఆర్థిక పీడితులుగా మాత్రమే తమను తాము అర్థంచేసుకోవడం వల్ల తమ ప్రత్యేక సమస్యలకోసం నిలబడి కలబడటానికి కొంత జాప్యం జరిగింది. తమ అవగాహనాలోపం వల్ల కమ్యూనిస్టులూ, ఆ తరవాత విప్లవకారులూ దించిన కేవల ఆర్థికవాద, కేవల వర్గవాద తెరల్ని చేదిస్తూ దేశవిముక్తి సాంఘిక, సాంస్కృతిక విముక్తితో నిమిత్తంలేకుండా జరగడం అసాధ్యమనీ, కులమత వివక్ష ఒకోసారి ఆర్థిక సమస్యలకూ కారణమవుతుందనీ, శ్రమజీవుల్ని విభజించి శ్రామిక వర్గ ఐక్యతను దెబ్బతీస్తుందనీ, అందుకే కులమత వివక్షను కూల్చేపోరాటాలు ప్రత్యేకంగా జరగాలనీ, దేశంలో అధిక సంఖ్యాకులై, అధికంగా అన్నిరకాల దోపిడీలకు గురవుతున్న దళితుల బాగే ఈ దేశం బాగనే అవగాహన ఇటీవల ముందుకొచ్చింది. అయితే ప్రస్తుత దళిత ఉద్యమాలలో చాలా వాటికి ఈ అవగాహనలేదు. ఇంత స్పష్టమయిన అవగాహన లేకున్నా ప్రస్తుత దళిత ఉద్యమాల కార్యాచరణ అంతిమంగా ఈ దేశవిముక్తి క్రమాన్ని ముందుకు నెడుతుందని చెప్పవచ్చు.

ఎక్కువ దళిత ఉద్యమాలలో లేని పై అవగాహన దళిత కవిత్వంలో కనబడుతుంది. తెలుగు కవిత్వంలోకి దళితగాలులు వీచడం మొదలై ముందుకు పోతున్న వాస్తవం ఈనాడు చూస్తున్నాం. పశువుల మూగతనంలోంచీ ఊరిబయటి మూలుగుల్లోంచీ, దూడచర్మం ఎద్దుకొమ్ము సంస్కృతిలోంచీ అక్షరాలు వెచ్చగా బయటికొస్తున్న చప్పుడు వింటున్నాం. కేవల అర్థికవాద సంకెళ్లను చీల్చుకుంటూ దళితుల సొంతనెత్తురుగుండా ఒలుకుతున్న పలుకుల సముదాయమే దళితకవిత్వం. తాతముత్తాతలనాటి అంటరానితనపు దస్తావేజుల్లుంచీ, తరతరాల ఆక్రోశపు కన్నీటి కైఫీయతుల్నుంచీ, దరిద్రపు చీకటి చరిత్రల్ని నడిరోడ్డుమీద దహనం చేస్తున్న హస్తాలనుంచీ, స్వేచ్ఛగా దూసుకువస్తోంది నేటి దళిత కవిత్వం. గత చరిత్ర గొంతుమీద కాలుపెట్టి వర్తమాన చరిత్ర గుండెల్లో నిర్భయ సంతకాలు చేస్తున్న కవులు ఈ పుస్తకంలో ఉన్నారు. కులంపేరుతో, మతంపేరుతో పీడనకూ అణచివేతకూ అవమానాలకూ గురవుతూ నిద్రలేచిన పులుల్లా కదులుతున్న నిషిద్ధ మానవుల అన్వేషణా, ఆగ్రహం ఈ కవిత్వంలో కనబడతాయి. కులవ్యవస్థా, దానికి ఆలంబన అయిన హిందూయిజం, వీటివల్ల రోజువారీ జీవితంలో పీడననీ అనిశ్చితత్వాన్నీ అభద్రతనూ అవమానాల్నీ ఎదుర్కొంటున్న పీడితకులస్తులనుంచీ, మైనారిటీలనుంచీ వచ్చిన కవులు రాసిన కవిత్వమే దళిత కవిత్వం. దళిత దృక్పథంనుంచి అగ్రకుల హిందూ ప్రగతివాదులు రాసిన కవిత్వం ఇంకా తెలుగులో రావాల్సి ఉంది. అట్లా వచ్చినప్పుడు ఆ కవిత్వమూ దళిత కవిత్వంలో భాగమవుతుంది. తమకులాన్నీ మతాన్నీ disown చేసుకుంటూ దళితుల పక్షాన నిలబడి అగ్రకుల ప్రగతివాద కవులు రాసిన కవిత్వం స్వల్పంగా వచ్చింది. అయితే ఈ కవిత్వం దళితులపట్ల జార్జ్‌లూకాచ్ చెప్పిన 'మీడియేషన్ రోల్' ని నిర్వహించే కవిత్వమే కానీ దళిత కవిత్వం కాదు. కనుక ఈ సంకలనంలో ఎస్. సి., ఎస్. టి., బి. సి. కులాలకు సంబంధించిన కవులూ, ముస్లిం కవులూ మాత్రమే చోటు చేసుకున్నారు.. విశాల అర్థంలో కులవ్యవస్థనీ, హిందూతత్వాన్నీ వ్యతిరేకిస్తూ ఈ కవులు తమ సొంత అనుభవాల మాలల్ని కూర్చుకుంటూ సొంత కన్నీటి పాళీలను సానబెడుతూ రాసిన కవిత్వమే దళితకవిత్వం. కులమతాలు పేర్చిన చితిమంటల వేడిలో మగ్గుతూ పయనిస్తున్న చిరకాలపు బాటసారులు తమ గొంతుల్ని గాయాలుగా, మాటల్ని ధిక్కరించే స్వరాలుగా, చేసి ఒక బిగ్‌బాంగ్‌తో నోళ్ళు తెరుస్తున్న వర్తమానవాస్తవమే దళితకవిత్వం. అరికాలులో ముల్లు విరిగితే కలిగే నొప్పి తడిమెరుపు ఈ కవిత్వంలో మనకు ఎదురవుతుంది.

దళితులు కులపరంగా ఆర్థికపరంగా అమానవీకరణకు గురయిన చరిత్ర క్రమాన్ని ధ్వనించటమేకాక ఈ దేశంలో నిజమయిన శ్రామికులు దళితులే అని ప్రకటిస్తూ రాసిన కవితలు కొన్ని ఈ సంకలనంలో ఉన్నాయి. దళితస్త్రీలు, ముస్లింస్త్రీలు ప్రత్యేకంగా ఎదుర్కొంటున్న సమస్యల్ని కదిలించేరీతిలో కవిత్వీకరించిన కవితలూ ఉన్నాయి. కారంచేడు, చుండూరు, అయోధ్య ఘటనలకి స్పందిస్తూ ఉద్రేకంతో రాసిన కవిత్వమూ ఉంది. దేశవ్యాపితంగా తలెత్తుతున్న నూతన దళిత చైతన్యాన్నీ, తిరుగుబాటు ధోరణినీ పట్టుకున్న కవితల్ని కూడా ఇక్కడ గమనించొచ్చు. దళితుడు తన స్వీయత్వం కోసం చేస్తున్న అన్వేషణను రికార్డు చేస్తూ కవులురాసారు. ఇందులో భాగంగానే బూటకపు ప్రతిభావాదాన్ని ఎండగడుతూ నిజమయిన ప్రతిభ శ్రమించి దేశానికి కూడుబెట్టి సౌకర్యాన్నిచ్చే దళితుల చమటలోనూ నిరంతర శ్రమలోనూ ఉందని చాటి చెప్పే కవితలూ ఉన్నాయి. ఏకలవ్యుణ్ణీ, శంభూకుణ్ణీ, వాలినీ ఇంకా ఇతర పురాణ పాత్రల్నీ తమపూర్వీకులుగా అర్థంచేసుకుంటూ అప్పుడు వాళ్ళకు జరిగిన అన్యాయమే ఇప్పుడు హిందూయిజం ముసుగులో తమకు జరుగుతున్నదనే దళితస్పృహను ప్రకటిస్తూ హిందూతత్వం మీద అందినరాయిని అందినట్లు విసురుతూ రాసిన పదునైన కవితలూ ఈ పుస్తకంలో కనిపిస్తాయి. అందుకనే రాముడితో సహా హిందూ దేవుళ్లనందరినీ తూర్పారబడుతూ, తిరస్కరిస్తూ కొన్ని కవితలు వచ్చాయి. దళితుల జ్ఞాన నేత్రాలు వాళ్ళదేహాలగుండా చూడటం మొదలుబెట్టిన వైనం కొత్త కొత్త ప్రతిమల ద్వారా కవిత్వమవ్వటాన్ని మనం చూస్తాం. మా వాకిట్లో మేమే కళ్ళాపి జల్లుకుంటాం, చేతకాకపోతే అనుభవం ద్వారా నేర్చుకుంటామంటూ తమవిముక్తికోసం జరిగే ఉద్యమాలలో తామే నాయకులుగా ఉంటామనీ ఎవరూ తమ ఎంగిలి కంచాల్ని కడగాల్సిన పనిలేదని అంటూ తమమీద ప్రేమని చూపిస్తూ, తమకు రక్షకులుగా వ్యవహరిస్తూ పెత్తనాలు చేయాలనుకుంటున్న నానా రకాల రాజకీయ నాయకుల్ని విమర్శిస్తూ దళితులు రాసిన మంచి మంచి కవితలూ ఇక్కడ తారసపడతాయి. తమరక్తంలో వినిపిస్తున్న పరాయిశ్వాసను తరిమికొడుతూ, అనుభవం సాక్షిగా చెమర్చేకళ్ళతో గుండెల్ని పిడికిళ్లలో పట్టుకుని దళితులు చేస్తున్న సొంత యుద్ధారావాన్ని ప్రతిభావంతంగా పట్టుకున్న కవులుకూడా ఈ పుస్తకంలో ఉన్నారు. సంప్రదాయ మార్క్సిస్టుల్నీ, దొంగ మార్క్సిస్టుల్నీ విమర్శిస్తూ వాళ్ళ చేతుల్లో దళితులు మోసపోయిన ఉదంతాల్ని ఏకరువు పెడుతూ వచ్చిన కవిత్వం మరో ధోరణి. అగ్రకుల ప్రగతివాదుల్నీ, నిజమయిన

మార్క్సిస్టుల్నీ, విప్లవోద్యమాలనీ తమపక్కన నిలబడి వ్యవస్థమీద పోరాడమని అహ్వానిస్తూ రాసిన కవితలూ ఉన్నాయి. 'నాలుగు వంకర కూతల తరవాతేకదా పాట చిక్కనయ్యేది,' నౌకాభంగం తరవాతేకదా నావికుడి గుండె గట్టిపడేది అంటూ తమ ప్రయత్నాన్ని డిఫెండ్ చేసుకునే దళితుడి వైఖరీ, ఆత్మవిశ్వాసం వ్యక్తమయిన కవిత్వంతో సహా దళిత విముక్తి మొత్తం భారతవిముక్తిలో భాగం అనే అవగాహనతో కూడిన వ్యక్తీకరణ ఈ కవిత్వంలో ఉంది. కుల నిర్మూలనతో సహా సకల దోపిడీల నిర్మూలనను కాంక్షిస్తూ, 'ఈ వ్యవస్థ శవపేటికను మోసుకుపోవాలి' అనే అవగాహనను వ్యక్తం చేస్తుంది ఈ కవిత్వం.

ఇట్లా ఒక క్రమపద్ధతిలో ఇతివృత్తపరంగా ఎదురయ్యే నలభై అరుగురు కవులు రాసిన దాదాపు వందకు పై కవితల్లో మొత్తం దళిత కవిత్వంలోని వైవిధ్యం, విస్తృతి బయట పడతాయి. భిన్నధోరణులూ భిన్న స్వరాలూ వ్యక్తమయిన ఈ కవిత్వంలో మార్క్సిజం - అంబేడ్కరిజంలకు సంబంధించిన ఒక సాధారణ తాత్విక భూమిక కనబడుతుంది. జాషువా నుంచి సి. వి. వరకూ తెలుగు కవిత్వంలో వ్యక్తమయిన కులమతాల అభివ్యక్తి వారసత్వానికి కొనసాగింపు కనబడుతుంది. అభ్యుదయ, విప్లవ కవిత్వాల ప్రభావమూ కనబడుతుంది. మహారాష్ట్రలో ప్రభంజించిన దళిత పాంథర్స్ సాహిత్య ఉద్యమం, అమెరికన్ నల్లజాతి సాహిత్యం ఇంకా దక్షిణాఫ్రికా సాహిత్యం ప్రభావమూ ఈ కవిత్వంపైన ఉన్నదని చెప్పవచ్చు.

దళితకవిత్వంలో దళితపలుకునీ, నుడికారాన్నీ, మాట్లాడే అలవాట్లనీ (speaking manners ని) పట్టుకునే ప్రయత్నం కొంతమేరకు జరిగింది. ఈ కవిత్వం చాలావరకు వాదనతోనూ ప్రశ్నలతోనూ కూడుకున్న కవిత్వం. అట్లాఅని ఇందులో ఉన్నది శుద్ధవాదన కాదు. అనేక విషయాల గురించి ప్రత్యర్థులతో వాదిస్తూనే ఆ వాదనని ఒక అనుభవ ప్రకంపనగా మార్చినప్పుడే వీరు రాసింది కవిత్వమయ్యింది. ఇంకా కొంతమంది కవులు సంస్కృత పదాల వాడకంనుంచి బయటపడాల్సి ఉంది. దళిత పలుకులో రాసినా దళితేతర పలుకులో రాసినా ఎక్కువమంది కవులు వారి వారి సొంత బాణీలనీ, గొంతుల్నీ కలిగి ఉన్నారని అర్థమవుతుంది. అయా కవులు తమసొంత మనోవైఖరి రూపంలోనే తమ భావాల్ని కవిత్వం చేశారు. అనుకరణ చాలా తక్కువ. చాలా తాజాగా సూటిగా, శుభ్రంగా ఈ కవులు మాట్లాడుతారు. చిక్కని కవితా

వాతావరణంలోకి పాఠకులను తీసుకుపోతారు. పురాణ ప్రతీకలు(Mythopoei) విరోధాభాసప్రయోగం, వస్తుసత్సంబంధి (Objective Correlative) మొదలయిన కవితానిర్మాణాలు ఈ కవిత్వంలో కనబడుతున్నాయి. ప్రోజ్ పొయమ్‌నీ, ఇంకా సంక్లిష్ట నిర్మాణాల్నీ కూడా వాడిన ఉదాహరణలు ఉన్నాయి. తక్కువ మంది కవులు తమ భావాల్ని కవిత్వమాధ్యమంలోకి ప్రవేశపెట్టడంలో విఫలమయ్యారు. కానీ వారు వ్యక్తంచేసిన విషయప్రాముఖ్యతరీత్యా వారి కవితల్ని ఇందులో చేర్చడం జరిగింది.

చివరిగా అటు మార్క్సిస్టులూ ఇటు దళితవాదులూ పట్టించుకోని విషయాల్ని దళితకవులు పట్టించుకున్నారు. ఆర్థికేతర, వర్గేతర అంశాల్ని మన మార్క్సిస్టులు ఖాతరు చేయనట్లే కులమతేతర అంశాల్ని దళితవాదులు ఖాతరు చేయడంలేదు. కానీ దళితకవులు మాత్రం ఈ వ్యవస్థ వర్గ, కుల స్వభావాన్ని అర్థంచేసుకోగలిగారు. దళితవాదమంటే దేశీయ మార్క్సిజం అనీ, అంటే దేశీయంగా అభివృద్ధి అయిన పూలే అంబేడ్కర్‌ల సిద్ధాంతాల్ని assimilate చేసుకున్న మార్క్సిజమనీ, అదేసరయిన మార్క్సిజమనీ ఎక్కువ మంది దళితకవులు అర్థంచేసుకున్నారనేదానికి ఈ పుస్తకం మంచి ఉదాహరణ. దీనికి కారణం మార్క్సిజం - అంబేడ్కరిజంలు పునాదిగా గల తాత్విక అవగాహనే అని అర్థమవుతుంది. ఈ అవగాహనే ఆరోగ్యకరమయినదవుతుంది. ఈ దేశాన్ని ముందుకు నడిపించేదవుతుంది. అందుకే దళితకవిత్వం ఇప్పుడు వస్తున్న అన్ని కవితా ధోరణులకంటే ఆధునికతని కలిగి ఉందనడంలో సందేహంలేదు. స్థానీకీకరించిన సమస్య ద్వారా సాధారణ స్ఫూర్తిని వ్యక్తంచేస్తున్న కవిత్వం దళిత కవిత్వం. దళితుల్లో సగభాగమయిన దళిత స్త్రీలు తమ కోణం నుంచి రాసిన కవితలు ఈ సంకలనంలో లేవు. దానికి కారణం వారి నుంచి ఇప్పటి వరకూ ఈ తరహా కవిత్వం రాకపోవడమే. ముందు ముందు దళిత స్త్రీలు అటు కులపరంగా ఇటు లింగపరంగా తాము ఎదుర్కొంటున్న సమస్యల్ని కవిత్వంగా మలిచినప్పుడు ఇంకా మంచి దళిత కవిత్వం వచ్చే అవకాశం ఉంది. దళిత కవిత్వంలో దళిత స్త్రీ దృక్కోణం ఎంతగా బలపడితే అంత సమగ్రత చేకూరుతుంది.

1 జనవరి 1995

- జి. లక్ష్మీనరసయ్య



చూపుడువేలు

నెత్తుటి ప్రశ్న	1	ఎండ్లూరి సుధాకర్
ఒక జననం వాయిదా	2ఎ	సతీష్ చందర్
మర్రి కింద మల్లె తీగ	3	అడిగోపుల వెంకట రత్నం
నిర్వీరామపాదం	4	అఫ్సర్
పుట్టుమచ్చ	6	ఖాదర్ మొహియుద్దీన్
కలోసియం	14	అబ్బాస్
కులమయ మిదం భారత్	15	శంబుక
మూడు జమానాలు జూస్తి	16	ఎస్. మొగలయ్య 'సాగర్'
నేను హత్య చేయబడ్డాను	18	జి. ఆర్. కుర్మె
అమ్మా నేనొంటరి వాన్ని	19	ఎస్. మొగలయ్య 'సాగర్'
మరో తాజ్‌మహల్	21	వడ్డెబోయిన శ్రీనివాస్
నేపథ్యశోకం	22	గుంటూరు ఏసుపాదం
యానాం వేమన ఏమనె	23	అఫ్సర్
ఆరోవర్ణం	26	ఇక్బాల్ చంద్
లౌకిక స్వప్నం గురించే మాట్లాడతాను	28	యాకూబ్
అనగా... అనగా... మెరిట్	30	చెరుకు సుధాకర్
అప్పుడుగాని...	37	మద్దూరి నాగేష్‌బాబు
నా ఇంటి పేరు చుండూరు	40	సీతారాం
కలవని కనుపాపలు	42	సతీష్ చందర్
క్రీ.పూ. 1992, డిశెంబర్ 6	45	ప్రసేన్
ఒక ఆదిమ అవశేషంలోకి...	47	అఫ్సర్
హరిజన్‌వాలాబాగ్	50	ప్రసేన్
అరచేతి రంధ్రాలు	52	సతీష్ చందర్
షరతు	56	భాజా

ఫత్వా	58	భాజా
గంగావత్‌ద్వాళి	60	దెంచనాల శ్రీనివాస్
ఐదోగోడ	61	ప్రసేన్
కాబోయే గీత	63	లింగాల రాజసమ్మయ్య
రేపటి కిరణం	65	జి.ఆర్. కుర్మె
అన్నిటికీ చెడి...	66	వరదయ్య
యుగారంభం	67	పి.సి. రాములు
పాదముద్రలు	69	ఎండ్లూరి సుధాకర్
గాయం కొత్తకాదు	71	పి.సి. రాములు
రేపటి చరిత్రకు ముందు మాటను	74	ఎండ్లూరి సుధాకర్
దారికోసం	76	అఫ్సర్
నా రెక్కల ముడి విప్ప	78	ఇక్బాల్‌చంద్
ప్రేక్షకుడు కన్నుమూశాడు	79	అఫ్సర్
ఇంద్ర ధనుస్సు ఏడో రంగు	81	అడిగోపుల వెంకటరత్నం
మొదటి ప్రేమ పాఠం	83	అఫ్సర్
కాల నాళిక	87	యాకూబ్
నెత్తుటి అంకం	89	అబ్బాస్
చాటింపు	90	టి. అంజయ్య
యాదుంచుకొండ్రి.....	92	పి.సి. రాములు
వాడే 'అశుద్ధ' మానవుడు	95	శిఖామణి
మూడో కన్ను	98	ఎన్.ఆర్. వెంకటేశం
రోడ్డు	99	కలేకూరి ప్రసాద్
ఖైదీగీతం	101	కృపా
పంచమగీతం	102	మద్దూరి నాగేష్‌బాబు
రాండి	103	మహమ్మదాలి
వృధా	104	దెంచనాల శ్రీనివాస్
అవతార పురుషులు	106	భాజా

నెత్తుటి బొట్టు	108	చెరుకు సుధాకర్
పిడికెడు ఆత్మగౌరవం కొసం	110	కలేకూరి ప్రసాద్
అల్టిమేటం	112	పి.సి.రాములు
వైతాళికుడవై రా! పద్యంలోకి	115	పగడాల నాగేందర్
డప్పు కొట్టడమే న్యాయం	116	స్కైబాబ
ఇకనైనా తప్పుకోండి...	118	పన్యాల జగన్నాధదాసు
సర్ప పంజరం	120	జూపల్లి ప్రేమ్‌చంద్
నడి వీధిలో నా జెండా	124	పి.యం. సుందర రావు
ఐదోగది	125	మద్దూరి నాగేష్‌బాబు
ఆత్మకథ	127	ఎండ్లూరి సుధాకర్
ఈ చరిత్రను తిరగ రాయాల్సిందే	129	పి.సి. రాములు
అమలిన చరిత్ర	133	చిన్న అయిలయ్య
బ్రహ్మ మొహంలోంచి పాదాలు	134	ఎం. వెంకట్
నడుస్తున్న చరిత్ర	135	శివసాగర్
పంచమ వేదం	136	సతీష్ చందర్
లాస్ట్ ఏంజెల్స్	140	సతీష్ చందర్
వృత్తాంతం	143	సతీష్ చందర్
శిశువు నేడు లేచెను	144	సతీష్ చందర్
మహా వాక్యాలు	147	దెంచనాల శ్రీనివాస్
రామా! నువ్ నా దేవుడివి కాదు	148	దెంచనాల శ్రీనివాస్
పునాదిరాయి	150	జి.ఆర్. కుర్మె
మాతృభాష మారువేషం	151	ప్రసేన్
ఊరవతలి దు:ఖం	154	అఫ్సర్
ఇక కథ చూస్తావు	157	అడిగోపుల వెంకట రత్నం
స్వదేహాలు	159	దెంచనాల శ్రీనివాస్
నా వాళ్ల మధ్య	161	జి.ఆర్. కుర్మె
కదలిక	162	పి.యం. సుందరరావు

వొక పర్సనల్ పొయెం	163	సౌదా
మాతృభాష	165	ఎన్. గోపి
వికసిత దళితం	167	కల్లూరి ఆనందరావు
నేను	170	దారా సుబ్బారావు
నీ ఉచ్ఛిష్టంలో నా దీపం వెలగదు	171	ఎ. దుర్గాప్రసాద్
వా సముద్రం నవ్వింది	172	సతీష్ చందర్
అహో కులమా	173	శంబుక
ఏకపక్ష సమాధానం	174	కో.వ్ర
దళిత భారతి	177	ఆకుల గంగాధర్
సెకండ్ కమింగ్	179	వ్రసేవ్
మమ్ముల్నాదిలేయండి	182	శంబుక
వేచి చూడండి	184	జె. గౌతమ్
దళిత గర్జన	186	శంబుక
ఇద్దరం కలిసే	191	వరదయ్య
పోయేదేమీలేని వాళ్లం	194	శంబుక
నిజాల్ని పాతరేసిన 'ఇజం'	199	ఉదయ్
ఎర్రదొంగలు	200	శంబుక
ఆహ్వానం	203	కృపా
దళిత మానిఫెస్టో	204	సలంద్ర
నల్ల నినాదం	206	అఫ్సర్
అలలు ఆగిపోయాయి	208	జె. గౌతమ్
ద్రోహాచార్యుల కుట్రని భగ్నం చేద్దాం..	209	పి.సి. రాములు
వాణ్ణి గుర్తించడం మానుకో	211	జి.ఆర్. కుర్మె
చిక్కనయ్యే పాట	213	వరదయ్య
రాచపుండు	214	కో.వ్ర.
పాదముద్ర	225	జూలూరి గౌరీ శంకర్

ఎండ్లూరి సుధాకర్

నెత్తుటి ప్రశ్న

నేనింకా నిషిద్ధ మానవుణ్ణే
నాది బహిష్కృత శ్వాస
నా మొలకు తాటాకుచుట్టి
నా నోటికి ఉమ్మి ముంతకట్టి
నన్ను నలుగురిలో
అసహ్య మానవజంతువుని చేసిన మనువు
నా నల్లని నుదుటి మీద బలవంతంగా
నిషిద్ధముద్ర వేసినప్పుడే
నా జాతంతా
క్రమక్రమంగా హత్య చేయబడింది.
ఇప్పుడు కొత్తగా చావడమేమిటి?
మా రహస్యచావుల్ని అక్షరీకరిస్తే
పత్రికలనిండా మా హత్యలే పతాక శీర్షికలవుతాయి.
ఈ దేశంలోని ఏ నేలను తవ్వి చూసినా
మా అస్థిపంజరాలు మట్టిగొంతుకల్తో సాక్ష్యమిస్తాయి.
వేదంవిన్న నా చెవుల్లో సీసం పోసినప్పుడు
అదేదో భాష మాట్లాడితే నాలుక తెగ్గోసినప్పుడు
నా వీర్యం తీర్చిన దాహానికి నా తల నరికేసినప్పుడు
నన్ను చెట్టుక్కట్టి గొడ్డులా చావగొట్టినప్పుడు
నేనప్పుడే శవమైపోయాను.
మా శవాలు కనీసం వార్తలు కూడా కాలేకపోయాయి.
ఆయుధాల పేర్లు మారాయి
అంకెల సంఖ్యలూ పెరిగాయి

మారనివల్లా మా హత్యలే
ఇప్పుడు మా శవాలు మాకు సంచలన వార్తకాదు
శవాలపై హంతకులు పట్టే సానుభూతి కొత్తకాదు
ఊరేగింపులమీద రాజకీయ మేఘాల ఓట్ల కన్నీరూ కొత్తకాదు.
నిన్నటి చరిత్ర బొటనవేళ్ళనే కోసింది
వర్తమానం ఐదువేళ్ళనీ నరికేస్తుంది.
బహిరంగంగానూ
రహస్యంగానూ
ఘటసర్పం మా నీడల్ని వెంటాడుతుంది
నిలువెత్తు గొలుసుల్తో నిలబడ్డ దృశ్యం
ఈ దేశం చొరస్తా
ఇరవయ్యో శతాబ్దానికికూడా నెత్తుటిప్రశ్నే.
కాలం చాలా స్పష్టంగా మాకు శత్రువవుతూ వుంది.
పెరిగిన మా ఛాతీ మీదుగా ఖడ్గం దూసుకొస్తూ వుంది.
రాజ్యాంగం రానిన వారసత్వానికి
జైళ్ళూ, సంకెళ్ళూ, చావులూ బహుమానాలవుతున్నాయి
మా మధ్యన కలుపుమొక్కలు
మా హరితశ్వాసల్ని నొక్కుతున్నాయి.
మా చావుకి వెలకూడా నిర్ణయించబడుతూంది
మా కిప్పుడు కావలసింది నెత్తుటిరొక్కం కాదు
మాకేం కావాలో కోరుకునే నిర్భయగొంతుక.
కొత్తరాజ్యాంగం కొత్తదేశం కొత్తభూమి కొత్తఆకాశం.

('వర్తమానం' కవితా సంకలనం నుంచి)

సతీష్ చందర్

ఒక జననం కాయిదా

నా వారసుడెప్పుడూ ఒకే ఒక ప్రశ్న వేస్తాడు
"వావ్వా నేనెప్పుడు పుట్టాలి?"
నిలువుటద్దం ముందు నిల్చుంటాన్నేను.
అవయవాల దొంతర కాదు!
అవమానాల పరంపర కనిపిస్తుంది.

ఒత్తయిన ఉంగరాల జుత్తు చూసుకున్నప్పుడు
కత్తులూ, కత్తెర్లూ నిరాకరించిన
మా ముత్తాత శిరోజాలు
ముడులు ముడులుగా గుర్తుకొచ్చి
కరకు దువ్వెనతో కర్కశంగా సావుచేస్తాను.

రెండు చెవులూ రెండు ప్రమిదల్లాగ
జ్వలన సంగీతాన్ని దాచుకొంటున్నప్పుడు
వేరం చేసినట్లు నాలో నేను భావించి
ఏ సీసమూ పడకుండా
కర్ణభేరుల మీదకి తలను దువ్వుకుంటాను.

ముడుచుకుపోయిన పెదవులు
మెల్లిగా నవ్వబోయినప్పుడు
నా పూర్వీకుల భగ్నప్రేమలకు బహుమానాలుగా
సవర్ణ సుందరీ మణులిచ్చిన విషపాత్రలు జ్ఞప్తికొచ్చి
నా ప్రతిబింబం మీద నేనే ముద్దులు కక్కుకుంటాను

నిండు చేతుల చొక్కాకి గుండీలు పెట్టుకున్నప్పుడు
ఊరి వెలుపల వరకూ నా తల్లి గుండెల్ని కప్పుకున్న
వాయువస్త్రాలు స్ఫురణకొచ్చి
నా భుజాల్ని నేనే మార్చి మార్చి తడుంకుంటాను.

నాజూకైన బెల్టును నడుంకి బిగిస్తున్నప్పుడు
నా చరిత్రను నా చేతనే తుడిపించడానికి
నా వెనకెవరో చీపురుకడుతున్నట్లే భ్రమించి
నా చుట్టూ నేనే రంధ్రాన్వేషణ చేసుకుంటాను.

మెరిసే బూట్లకు లేసులు కడుతున్నప్పుడు
నేల తల్లి మాత్రమే ముద్దాడిన నాన్న నగ్న పాదాలు
అనుగాయలతో మెల్లిగా మూలిగినట్లనిపించి
నా కాళ్ళకు నేనే నమస్కరించుకొని నిలబడతాను.

చిట్టచివరిగా తలయెత్తి మీసాలు కాస్త మెలివేద్దామనుకున్నప్పుడు
"రిజర్వేషన్ గాళ్ళకి పొరుషాలు కూడానా?" అన్న
ఆఫీసులో అధికారి ప్రతిభా పాటవాలు అద్దొచ్చి
భూతకాల వర్తమానాన్ని మింగలేక గుటకలు వేస్తాను.

నా వారసుడప్పుడు ఒకే ప్రశ్న వేస్తాడు!
"నాన్నా నేనెప్పుడు పుట్టాలి?"
నిలువుటద్దం నుంచి తొలగిన నేను
గోడకి వేళ్ళాడదీసిన మా తాత డప్పుమీద
అదే పనిగా వాయిస్తాను.
శబ్దస్రావం జరిగి
ఒక జననం వాయిదా పడుతుంది.

(ఆదివారం ఆంధ్రజ్యోతి)

అడిగోపుల వెంకటరత్నం

మర్రికింద మళ్లెతీగ

మీకు అనుభవాలకేం కొదవ
మా రక్తమంతా అవమానాల వెల్లువ
వచ్చి బాలింత తల్లి నా పాల కోసం
ఇంటింటా యాచించి పెంచిన సంగతి
నిక్కరు లేక చిరిగిన చొక్కాతో
పగిలిన పలక పట్టుకొని బడికెళ్ళితే
చదువుకూ పేద్యానికీ రెంటికీ నువ్వు చెడతావు
మట్టి పిసుక్కొని బతకమన్న
బడిపంతులు అజ్ఞ సంగతి
జంగిడి గొడ్లతో పాటు
బండెల దొడ్లో రెండ్రోజులు
గొడ్డులా బంధించబడ్డ నా సంగతి
ఇంట్లో దొంగను ఈశ్వరుడెందుకు పట్టలేడని
వా యజమాని నన్ను దొంగను చేసి
పోలీసులకు పట్టిచ్చిన సంగతి
చంపిన నా తండ్రి శరీరాన్ని
శవ పంచాయితీ చేసి
సహజమైన చావని చెప్పిన సంగతి
మాకు అనుభవాలకేం కొదవ
మా రక్తమంతా అవమానాల వెల్లువ
మేము మర్రిచెట్టుకింద మళ్లె తీగలం
పెరగకుండా బ్రతకాలి చావకుండా నిలవాలి
నీడనిచ్చినా పెరగలేదని
నీతులు మీరు చెప్పుకోవాలి

('విప్లవానికి పురిటిగది' కవితా సంపుటి - మార్చి, 1990)

అఫ్సర్

నిర్వికల్పం

రోమ పాదుకల్ని మోసీ మోసీ అలసిపోయాను
నాకో కొత్త పాదం కావాలి
లాఠీలు విరిగిన చప్పుళ్ళు విన్న పాదం కావాలి

గుడ్డికళ్ళమీద తెరుచుకున్న అద్దంలో నీడల యుద్ధం
బారులు తీరిన దేహాలు శరీరాల్ని కప్పుకున్న ఆగ్రహం
గాల్లోకి ఎగిరిన రాళ్ళు గురిపెట్టిన తుపాకులు
చెదిరిన జనసమూహం
కళ్ళజోడు మీద నెత్తురు చిమ్మింది
వొక ప్రళయ ఘోష చివర నిశ్శబ్దం మిగిలింది
శాంతిభద్రతల కాపలాకి మిగిలిన వొంటరి పాదరక్షని నేను

నా కవిత్వ పాదానికి విరామం లేదు
అరుపులూ కేకలూ ఆర్తనాదాలూ మూల్గుల మధ్య
నేను అశాంతిని
నేను అభద్రతని

ఈ ఖైదుకి ఆకాశం పై కప్పు. అంతులేని భూమ్మీద అంగుళం భూమి కూడా నాది కాదు. నా జనన మరణ రహస్యాలన్నీ విన్న మట్టి నుంచి నన్ను వెలివేస్తున్నారు. ఇదొక విశాలమైన లాకప్, ఇక్కడే అన్నీ పుట్టాలి బాధపడాలి వణికిపోవాలి కత్తిగాట్ల రుచి చూడాలి ఏడ్వాలి నవ్వాలి నవ్వలేక ఏడ్వలేక చూడలేక వణికిపోలేక బాధపడలేక చివరికి చనిపోలేక బతకాలి. ఆకాశాన్ని ముక్కలుగా కత్తిరించిన ఇనపచువ్వలు అక్కర్లేదు. అన్నీ నిషిద్ధ వస్తువులే. ముఖ్యంగా నా పేరు; మరీ

ముఖ్యంగా వా దేహం. ఇవాళ్టి ఈ హింస చివర నేను
క్రూర హస్తాల క్రీడలో అలిసిపోయిన ఆటబొమ్మని.
వా కవిత్వ పాదానికి విగ్రహం లేదు.
విగ్రహం లేదు
ఆగ్రహం తప్ప
మరణం అంటే ఏమిటో ఇప్పుడు చెప్పగలను. అశాంతికీ యుద్ధానికీ బాధకీ
మరణానికీ అన్నిటికీ నిర్వచనాలు నేనివ్వగలను. అన్నీ నేనే కనుక. ఎక్కడా
ప్రవేశం లేనివాణ్ని దేశమే లేనివాణ్ని ఎవరి ఆదేశాల కోసమైనా తలవంచేవాణ్ని
కచ్చితంగా ఇన్నాళ్ళూ పాదుకలు మోస్తూవున్నవాణ్ని

ఇప్పుడేమో దేశాలూ ప్రవేశాలూ అక్కర్లేదు
ఆవేశ కావేషాలు తప్ప

నా వుద్రేకం నా వుత్వేగం వా ఆలోచన నా అనుభూతి సమస్తం నిషిద్ధం.
మరణం అంటే యేమిటో ఇప్పుడు చెప్పాలా?

నా కవిత్వ పాదానికి మరణం లేదు
జీవితం తప్ప

వొరిగిపోతున్న దేహాల మధ్య సరిహద్దు మరణం. జీవితం తెగిపోయిన చోట
మరణం. యుద్ధం ఆగిపోయిన చోట మరణం. అసలే ఆకాశమూ లేకపోవడం
భూమికి మరణం

మరణం కడుపులోంచి పుట్టిన యుద్ధం నా కవిత్వం
మరణించలేకపోవడమే కవిత్వం
మరణించలేకపోవడమే మరణానికి సమాధానం
ఇప్పుడు
భూమ్యాకాశాల మధ్య నిటారుగా నిలబడ్డ సమాధానాన్ని నేను.

(ఆదివారం ఆంధ్రజ్యోతి)

ఖాదర్ మొహియుద్దీన్

పుట్టుమచ్చ

ఒక కట్టుకథ నన్ను కాటేసింది
ఒక వక్రీకరణ నన్ను వంచించింది
ఒక అపనింద నన్ను అల్లరి పాల్జేసింది

1955 ఆగస్టు 10 నా పుట్టిన తేది
కృష్ణాజిల్లాలో ఒక మారుమూల కుగ్రామం మావూరు

నేను పుట్టకముందే
దేశద్రోహుల జాబితాలో
నమోదైవుంది నా పేరు

కన్నబిడ్డని నవతి కొడుకుగా
చిత్రించింది చరిత్ర
అన్నదమ్ముల్నించి చీల్చి
నన్ను ఒంటరివాణ్ణి చేసింది చరిత్ర

పసితనంలోనే
నన్ను పరిహసించాయి
పాఠ్యపుస్తకాలు

పోత పోసుకుంటూన్న
నా వ్యక్తిత్వం మీదికి
వింతవింత భయాల్ని ఉసిగొలిపి
నిర్దాక్షిణ్యంగా నన్ను చిత్రవధ చేసి
నుడిగాలుల పాల్జేసింది చరిత్ర

నా ప్రమేయం లేని పరిణామాలకు
నన్ను కర్తను చేస్తుంది వర్తమానం

నా అస్తిత్వం చుట్టూ
అనుమానాల వలయాల్ని విస్తరిస్తుంది వర్తమానం

నా నెత్తిమీద సదా
నిఘా నీడల్ని విసిరేస్తుంది వర్తమానం

అడవిల్ల అందాల్ని బంధించినట్టు
నా ఆకారాన్ని అంకెల్లోకి దట్టించి
నాయింట కన్ను తెరచిన
నవజాత శిశువు తెగ్గోసుకున్న
తల్లి పేగు చివర తడియారని వెత్తుటి బొట్టులో
1947 ని దర్శిస్తుంది వర్తమానం

'హిందీ-హిందూ-హిందూస్థాన్
ముస్లిం జావో పాకిస్తాన్'

'ముసల్మాన్ కే దోహీస్థాన్
పాకిస్తాన్ యా ఖబరస్తాన్'

నినాదాల నర్తనశాలలో
నన్ను నిస్సహాయుణ్ణి చేస్తుంది వర్తమానం

రాజ్యాంగం నా భుజం తట్టదు
మీసాల గుబురుల్లోంచి
ముసిముసిగా నవ్వుకుంటూన్న
మూడు సింహాల సింహాసనం
నాకేసి ముఖం తిప్పదు
ప్రథమ శ్రేణి పౌరుని మస్తిష్కంలో
పరదేశిగా తప్ప, 1947కి స్మారక స్థూపంలా తప్ప
మనిషిగా నా బొమ్మ రూపు గట్టదు

అవును, నేను కుట్రదారుణ్ణి కదూ!

అవును, ఇస్లాంకీ-ఇస్లామాబాద్‌కీ మధ్య
అభేదాన్ని పాటించడం కుట్రకాదు
నా కాళ్ల కింద వేలని
తొలిచేయాలనుకోవడం కుట్ర కాదు
పుట్టి పెరిగిన దేశంలోనే
నన్నిక కాందిశీకుణ్ణి చేయడం కుట్రకాదు
పరిసరాల్నీ, వాతావరణాన్నీ
నాచుట్టూ విషపూరితం చేయడం కుట్రకాదు
ఖండఖండాలుగా నరికి
నిలువునా నన్ను నిర్మూలించి
'అఖండ భారతం' నిర్మించాలని
కలలు గనడం కుట్రకాదు

కేవలం నా మత విశ్వాసాలు కుట్ర
నా సామూహిక ప్రార్థనా సమావేశాలు కుట్ర
నేను మత్తుగా పడివుండటం కుట్ర

నేను మేల్కొనేందుకు ప్రయత్నించడం కుట్ర
నేను నలుగురితో కలిసి వుండాలనుకోవటం కుట్ర
నేను బతికి బట్టకట్టాలనుకోవడం కుట్ర
నా అజ్ఞానం కుట్ర, నా వెనుకుబాటుతనం కుట్ర
నేను పెళ్ళాడటం కుట్ర, నేను పిల్లల్ని కనడం కుట్ర

స్థాయీభేదాల సారాంశంలో
రాజ్యాంగం నాతో ఆడిన
'పవిత్రమైన' పరాచికం నా పౌరపత్వం

పట్టెడన్నం కోసం
పేవ్‌మెంట్‌ల మీద పూలమ్ముకుంటాను

పళ్ళమ్ముకుంటాను, పల్లీలమ్ముకుంటాను
గొడుగులు బాగు చేస్తుంటాను
గడియారాలు బాగు చేస్తుంటాను
వీధరుగుల మీద దర్జీ పని చేస్తుంటాను
దూదేకుతుంటాను దినం గడుపుకుంటాను
ఏ గొడవల్లేకుండా
బతుకును వెళ్ళమార్చాలనుకుంటాను

ఉన్నట్టుండి ఎందుకోమరి
నగరాల నడివీధుల్లో నా నెత్తురు
తీర్థస్నానఘట్టమవుతుంది

ఎన్నికలకు ముందు
ఎన్నెన్నో సంఘటనలకు ముందు
దేశ చరిత్ర దిశానిర్దేశానికి
నా నెత్తురు గూడుపట్టవుతుంది

పార్లమెంటు భవనంలో వాలేందుకు
నా నెత్తురు పాదలేపనమవుతుంది

నా రక్తం రియల్ ఎస్టేట్
వ్యాపారమవుతుంది

నా రక్తం రాజ్యాధికారానికి
రక్షణ కవచమవుతుంది

నా రక్తం పదవీసోపానానికి
అభయ 'హస్త' మవుతుంది

నారక్తం 'భరతమాత' నుదుటి
తిలకమవుతుంది, పూజా 'కమల' మవుతుంది

నేను వేసిన ప్రతి ముందడుగూ
ఒక వెత్తుటి మడుగవుతుంది

నా గూడు బాణనంచా అవుతుంది
నా గూడు భోగిమంటవుతుంది
నా గూడు నరకాసురుని చితాభస్మమవుతుంది

భవిష్యత్ తరాల కోసం
ఆదిమానవుడు చరిత్ర గూట్లో భద్రపరచిన
పావురాల గుడ్లు చితికిపోతాయి

పటపటమని విరిగిపోతూన్న
నేలతల్లి పక్కటెముకల శబ్దం
నా చెవుల్లో చివరిసారిగా ప్రతిధ్వనిస్తుంది

కలలు నా మాతృభాషలో రావటం మానుకుంటాయి
నా ఆలోచనలు సయితం అధికుల భాషనే ఆశ్రయిస్తాయి

క్రికెటొమేచ్ నా దేశభక్తికి
తూనికా, కొలమానమవుతుంది
నేను నా మాతృదేశాన్ని
ఎంతగా ప్రేమిస్తున్నానన్నది కాదు
ఏయే పరాయి దేశాల్ని
ఎంతెంతగా ద్వేషిస్తున్నానన్నదే
నా దేశభక్తికి ఎంతోకొంత ఆధారమవుతుంది

వెండి తెరల మీంచీ
రంగ స్థలాల మీంచీ
కళామర్మజ్ఞుల విచిత్ర విన్యాసాల మీంచీ
నా విదూషక ఖలనాయకుని వేషం
అందరికీ వినోదాన్ని అందిస్తుంది
సాంస్కృతికంగా నన్నొక వికలాంగుణ్ణి చేస్తుంది.

క్షమించండి, నా స్నేహితుల్లారా!
వక్రీకరణకి వత్తాసుగా
పదబంధాన్ని సృష్టించి
నన్ను వెక్కిరించడానికి వెనుదీయని
[1]మహాకవినీ నేను మన్నించలేను!

మన్నించండి, నా మిత్రుల్లారా!
రాజుకీ, పేదకీ మధ్య
భేదాన్నే చూడలేని
[2]ప్రజాకవి ఉద్రేకానికి
నేను ఉద్రూత లూగలేను

హింసకి ప్రతిరూపంగా
అసహనానికి ప్రతీకగా
నా గురించి జరిగే ప్రచారాల్ని విని
నేను నవ్వుకుంటాను

నా పరిణామాల భవిష్యత్ ప్రమాదాల
భేతాళ కథల్ని విని
నేను నవ్వుకుంటాను
చరిత్రను మతంగా
మతాన్ని చరిత్రగా
చిత్రిస్తున్న పాలకుల ముంగిటి
కావలి కుక్కల మొరుగుల్ని విని
నేను నవ్వుకుంటాను

నా నవ్వులకు సమాధానంగా
నిందలు ప్రతిధ్వనిస్తుంటాయి

నిజానికి నాది నవ్వుకాదు
నేను అనునిత్యం

అతిసువాయాసంగా
దిగమింగే వా ఆర్తనాదం

అగ్రవర్ణం అన్యాయంగా
నా మెడ చుట్టూ బిగించి వెళ్లిన
పర్సనల్‌లా ముళ్లకంచె గురించి
బాధపడాల్సింది మరెవరో కాదు నేనే

ఆర్టికల్ 370 గురించి
అణగారిపోవాల్సింది ఎవరో కాదు నేనే

ఆచరణతో ప్రమేయం లేని
అక్షరాల లౌకిక భావనకి
అన్యాయమైపోయింది ఎవరోకాదు నేనే

అవును, నాది మచ్చపుటక అన్నారు కదూ!
నన్ను ఏకంగా పుట్టుమచ్చగా పునీతం చేశారు కదూ!

పెత్తందార్ల ఎత్తుగడలూ, వ్యూహాలకీ
నాచుట్టూ అల్లుకుంటూన్న ఉరితాళ్ళకీ మధ్య
ఏమిటీ అనుబంధం అని అడగలేను
వాళ్ళూ వాళ్ళూ కలిసి పంచుకున్న వూళ్ళ మధ్య
అర్ధరాత్రి సరిహద్దు రేఖలా పారిన నెత్తుటి యేరుతో
ఏమిటీ నాకున్న సంబంధం అని నిలదీయలేను
త్రిశూలాల మొనల మీదా
పి.ఏ.సి. తుపాకుల కొనల మీదా
బాలెట్ బాక్సుల కొసల మీదా
నెత్తురోడుతూన్న నా పుట్టుమచ్చను గురించి
ప్రశ్నించలేను

అవును, పుట్టుమచ్చ నా ఉనికి
పుట్టుమచ్చ నా అస్తిత్వం

పుట్టుమచ్చ వా పౌరసత్వం
నేను పూపిరి పీలుస్తూ మనలుతూన్న
నేలా గాలీ పరిసరాలూ
వాకు దళలు పరిచిన వారసత్వం పుట్టుమచ్చ
ఎప్పటికీ మానని గాయం యీ పుట్టుమచ్చ

-ఫిబ్రవరి 1991

1. మహాకవి శ్రీ శ్రీ 'కసాయి', 'సాయిబు' అనే పదాల్ని కలిపి 'కసాయిబు' అనే పదబంధాన్ని తాను సృష్టించినట్టు వ్యాసక్రీడల్లో చెప్పుకున్నాడు.
2. ప్రజాకవి సుద్దాల హనుమంతు 'వెయ్, వెయ్‌రదెబ్బ వెయ్ / తరగర, నరకర / తురకలు గుండా గొయ్యలు అంటూ ఒక పాట రాశాడు. నిజాం నవాబు ముస్లిం కాబట్టి ఏకంగా తురకల్ని తరిగేయమని పిలుపు నిచ్చాడు. తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట చరిత్రలో 'బందగీ' వంటి 'తురక' ల పాత్రను విచిత్రంగా విస్మరించాడు.

('పుట్టుమచ్చ' కవితా సంకలనం నుంచి)

అబ్బాస్

కలోసియం

జన్మభూముల్ని వెదుక్కుంటూ
జీవితాల్ని నైవేద్యం పెడదాం
సారేజహాసె అచ్ఛా అంటూనే
జాతిని చెల్లా చెదురు చేద్దాం
రండి సోదరులారా
ముసుగులో ముద్దులాడుకుందాం
ఇనుకతో ఒంటిస్తంభం కడదాం
రండమ్మా రండి
బురఖాల్ని చించి పరదాలు కుడదాం
నలుదిక్కుల నుంచీ
మళ్ళీ నాలుగ్గోడల మధ్యకు వెళదాం
మేధావులూ రండి
మహనీయులూ రండి
ముక్కులు మూసుకుందాం రండి
పురుష సూక్తానికి పూలమాలలేద్దాం రండి
భవిష్యత్తునుభూతాలకప్పగిద్దాం రండి
రండి
తలాకాస్తా బూడిద రాసుకుందాం
కాస్తంత గంజాయి నూరుకుందాం
తాడూ బొంగరంలేని తండాల వెంట
పరలోక సౌఖ్యాల్ని కలవరిద్దాం రండి
పులకరిద్దాం రండి
రండి రండి
నమ్మకాలకు నిజాల్ని బలి ఇద్దాం రండి
రక్త పిపాసుల వినోదానికి
కలోసియంలో కత్తులు కలుపుదాం రండి

(ఆగస్ట్ 1993, కంజీర పొయిట్రీబులిటెన్-6)

కంబుక

కులమయ మిదం భారత్

సమాజంలో కులం- సమాజాంతరాల్లో కులం
కులంలో కులం- మతంలో కులం
గుడిలో కులం-బడిలో కులం
పెళ్ళిలో కులం - ప్రేమలో కులం
ఉద్యోగంలో కులం-నిరుద్యోగంలో కులం
బ్రతుకులో కులం - చావులో కులం
ప్రభుత్వంలో కులం - ప్రభుత్వ యంత్రాంగంలో కులం
ఓట్లలో కులం - సీట్లలో కులం
కాలేజిల్లో కులం - కార్ఖానాల్లో కులం
ప్రొఫెసరులో కులం - పామరునిలో కులం
చెరువులో కులం - చావులో కులం
విద్యుద్దీపాలలో కులం - నీటిబోరుల్లో కులం
జైళ్ళలో కులం- నల్లకోట్ల న్యాయాల్లో కులం
నాయకత్వంలో కులం - రౌడీయిజంలో కులం
ట్రేడ్ యూనియన్లలో కులం - వ్యవసాయకూలీ సంఘాల్లో కులం
పట్నాలలో కులం - పల్లెటూళ్లో కులం
కమ్యూనిస్టుల్లో కులం - కాంగిరేసులో కులం
పత్రికల్లో కులం - పత్రికా విలేకరుల్లో కులం
పాడెకట్టటాల్లో కులం - పాతేసేదానిలో కులం
కులం - కులం - కులం - కులం
కులమయ మిదం భారత్

('పోయేదేమీ లేని వాళ్ళం' కవితా సంకలనం నుంచి)

ఎస్. మొగలయ్య 'సాగర్'

"మూడు జమానాలు జూస్తి" .....

చరిత్ర చీకొట్టినోన్ని
చీపురుకట్ట గూడ ఈసడించుకున్నోన్ని
చీము - నెత్తుటిని మరిచి .... నీకై
చెప్పులు, నా చర్మంతో కుట్టినోన్ని
నీ దర్పానికి ప్రతీకగా ...
తాజ్‌మహల్ - కుతుబ్‌మినార్
చార్‌మినార్‌లకు - పునాదినైనోన్ని

ఆ సర్కారుకు - ఈ సర్కారుకు
ఈ గల్లీల వుండే ... ఓటిచ్చినోన్ని
ఆళ్ళ .....
ఏలుబళ్ళలో .... బ్రతుక్కై
ఏలు ముద్రలేసి ..... వెగచి
చివరికి బ్రతుకునే మరిచినోన్ని
అంతెందుకు ....

* * *

నిన్న బుట్టిన మా పోరగాండ్లు
ఈయాళ .....
దష్టర్లల్ల గుమాస్తాలై .....
గుండెలు గుద్దుకుంటూ
నన్నిడ్సే గుసవెట్టి - నా పేరు సెప్పుకుంటూ
పార్టీ-సీట్లకు పొట్లాడబట్రి
గుడిసెలల్ల - సీకట్లను మరిచి

గుళ్ళకై - చుసీదులకై
గుమలాడి - పాడునుకునీ సావబట్టి
గాంధీ తాత నయం .....
ఒక్క జమాననే జూపి పోయిండు
నేను మాత్రం .....
మూడు జమావాలు సూడబట్టి
ఇంకా .....
మూలకే ..... కూసుండ బట్టి

(అముద్రితం)

జి.ఆర్.కుర్మె

నేను హత్య చేయబడ్డాను

చిట్టడవిని ఎలగడేసి నేను తగలబెట్టినపుడూ
సింధూనదికి అడ్డుకట్టలేసి మేటభూముల్ని తడిపినపుడూ
బార్లీ ధాన్యంతో మొహెంజొదారోలో భారీ ధాన్యాగారాల్ని నెలకొల్పినపుడూ
నన్ను నేను ఈ దేశ మూలవాసిగా ఆవిష్కరించుకున్నాను

బహరైన్ రేవులో నా పడవ యిదినపుడూ
మెసపొటేమియాలో నేను ముత్యాల మూటల్ని విప్పినపుడూ
ప్రపంచ వర్తకం నన్నే కానుగా నిలబెట్టినపుడూ
సింధూనాగరికతగా నా చరిత్ర రానుకున్నాను

నా చేతుల్లో ఉత్పత్తి ప్రవహించినపుడూ
రాగి తగరం నా పక్కటెముక లైనపుడూ
మూఢ నమ్మకాల దాడి నాపై జరిగినపుడూ
లూటీల లాఠీ దెబ్బల్తో తీవ్రంగా నేను గాయపడ్డాను

హరప్పా హస్తినా నా రెండు పాదాలైనపుడూ
నాగులే నా బాల్య జాగిలాలైనపుడూ
అగ్ని ప్రదక్షిణమే ఓ యజ్ఞమైనపుడూ
హిందూ మహాసంద్రంలో నేను హత్య చేయబడ్డాను.

(అముద్రితం)

ఎస్. మొగలయ్య 'సాగర్'

అమ్మా! నేనొంటరికాన్నా!!

శూన్యంలోకి మళ్ళీ ఓ మారు చూడాలనిపిస్తుంది నాకు
అమ్మ ఒడిలోకి జారి .....
గోముగా ఓ చద్దన్నపు ముద్ద తినాలనిపిస్తుంది
ప్రజాస్వామ్యాన్ని బిర్యానీ చేసి
ప్రజల ఎముకలతో కుర్మాను చేసి
ప్రగతి హోటల్లో వాటాలకై
ప్రతి వాడూ ప్రాకులాడుతూ .....
నిండు మనస్సుతో .....
నన్నెవ్వడూ ..... తమ్ముడూ అని పిలువలేదు
కంటి నీటితో .....
ఏవ్వడూ ..... ఎప్పుడూ సానుభూతిని తెలుపలేదు
అనుక్షణం .....
చేదును చవిచూస్తున్న నా .....
కళేబరంలో ..... ఎవ్వడూ
ఓ ... బుక్కెడు ఎంగిలి మెతుకులు విసర్లేదు
భయపడి ..... బయటికి రాక
పాతాళంలోకి పారిపోయిన .....
నా పాడు కళ్ళకు
కాగితాల్లో .... తప్ప
చేతుల్తో వెలుగు నివ్వలేదెవ్వడు
దళితుడు ..... పాపం! అన్నాడొకడు
దరిద్రుడన్నాడింకొకడు
దాస్యం దూరం చేస్తానని

భాష్యం చెప్పాడొకడు ..... కానీ
ఇంతవరకూ .... ఏదీ?
ఎవరి మాటల భావాలూ
- వాకర్థం కాక
నిరాశా నిస్పృహలనే చవిచూస్తున్న నాకు
శూన్యంలోకి మళ్ళీ ఓ మారు చూడాలనిపిస్తుంది
అమ్మ ఒడిలోకి జారి..... ఓ.... చద్దన్నపు ముద్ద తినాలనిపిస్తుంది
ఒక్కసారిగా తెంపు చేసి -
నిజాన్ని - బిగ్గరగా చెపుదామనుకున్నాను
మళ్ళీ ..... అదో "యిజం" గా
మారుతుందేమోనన్న భయంతో ఊరుకున్నాను
గతం నుండీ జతలేదెవ్వడు నాకు
వున్నట్టుండీ....వచ్చే వాళ్ళంతా .....
అందరు ..... అందరూ
నన్ను
తూట్లు పొడిచేవాళ్ళే!
కాట్లు వేసే వాళ్ళే!!
ఇందరున్నా ..... ఇంకా నేను
స్వాతంత్ర్యపు
ఈవలి గట్టు నుంటున్న వాన్నే!
ఇప్పటికీ ఒంటరి వాన్నే!!
అందుకే .....
శూన్యం లోకి .....
మళ్ళీ ఓ మారు చూడాలనిపిస్తుంది నాకు
అమ్మ ఒడిలోకి జారి .....
ఓ చద్దన్నపు ముద్ద తినాలనిపిస్తుంది.

(అమ

వడ్డెబోయిన శ్రీనివాస్

మరో తాజ్‌మహల్

రక్తోత్సవం జరిగింది
"ఖాకి" ముక్కున రక్తమోడుతున్న మాంసం ముక్కను
ఎప్పట్లాగే నక్కనోట్లోకి జారవిడిచింది
శంభూకుడి శిరస్సు రాలిన గురిగానే
దళిత తర్పణం జరిగింది
ఓట్ల స్వర్గాధిపత్యం
"రాముడు విజయ"వంతంగా రక్షించుకున్నాడు
ఏకలవ్యుడి వేల్పేకాదు
మాటల్ని కూడా నరుక్కుపోయి
పత్రికల తలరాతల్ని రాస్తున్నారు
ఊరుకల్వుకున్న
ఊరవతలి గుడిపై గుండెల్ని
ఊపిరి చిదిమే సరిహద్దు చేతుల మధ్య
స్వేచ్ఛ చెక్కభజన చేయించి
రాజకీయ కసాయితనపు హిమనగంలోంచి జారే
దళిత శవ స్రవంతిలో స్నానించి
శుద్ధ సాయుధ భద్దరు సింహాసనంపై
అధికారం ప్రియురాలికోసం
తాజాగా మరో తాజ్‌మహల్ కడ్తున్నారు



గుంటూరు ఏసుపాదం

నేపథ్య శోకం

నా కంటి కింద చీకట్లో ఎవరో నంజెళ్ళు వదిలి పోయారు
కనురెప్ప పైకెత్తితే తాటాకు చప్పుళ్ళు
ఎటు చూసినా ఎవరూ కనబడరు
ఏ శ్మశాన వాటిక నుంచో నిదురించే ఏ వొల్కెనో నుంచో
ఏ వృద్ధురాలిదో ఏడుపుగొంతు
నన్నెవరో వెంటాడుతున్నారు నన్నెవరో వెక్కిరిస్తున్నారు
నాకలంలో కన్నీళ్ళు నింపుతూ
నా అక్షరాల్ని అద్ది కడుగుతున్నారు
ఎవరూ కనబడరు గానీ
నా వెన్నెముక వెంట ఎగబాకుతున్నారు
కన్నుమూస్తే కలల్లో భళ్ళున బద్దలౌతున్నారు
కన్ను తెరిస్తే
ప్రశ్నాస్త్రాలై గుండెల్లో దిగబడుతున్నారు
నా బతుకు తమదంటున్నారు
నన్ను జయించాలని చూస్తున్నారు
ఎవరూ కనబడరు ....
అవును -
చరిత్ర పుటల్లో చెదతిన్న అధోజ్ఞాపికలు
పుణ్యభూమి పాలిమేరల్లో విసిరేసిన విస్తళ్ళు
నైరూప్యరాకాసి పాలియెష్టర్ పాదాల కింద
నలుగుతోన్న నా వాళ్ళు ఎవరికీ కనబడరు
వాలికే రక్తంలోంచి తొణికి పడుతుంటారు
అక్షర గర్భంలోంచి గర్జిస్తూ పుడతారు
ప్రశ్నల్లా ప్రత్యక్షమై
నా కంటిని వెలిగించి పోతుంటారు.

(*ఆంధ్రజ్యోతి దినపత్రిక, 11-1-88)*

అఫ్సర్

యీనాం వేకువ ఏమనే...

కలల పక్క మీంచి కలవరిస్తూ
వేల మీద దబ్బున పడిపోయినట్టు
చితికిపోయిన ఆకాశం మీంచి నువ్వు
నన్ను భూమ్మీదికి వెట్టినప్పుడు
నా ప్రపంచం మీద కొత్త సూర్యుడు పొడిచాడు
ఒకటి రెండు పదులు వందలుగా విస్తరించి నువ్వు
ఆకాశ శూన్యాన్ని నింపుకుంటూ పోతున్నప్పుడు
నేను వొఠ్ఠి శూన్యమై
శూన్య గోళాన్నయి నీ చుట్టూ పరిభ్రమిస్తూ వుండిపోయాను
సమాధానంలా నింపాదిగా నిక్కచ్చిగా
నేను నిలబడినప్పుడు
మళ్లీ నన్నొక ప్రశ్నగా మార్చి
నా కాళ్ల కింద భూమిని తొలిచావు నువ్వు
ఆ తర్వాత నేను
నా మొహం వెనుక
వేన వేల భూగోళాల్నీ కొండకోనల్నీ తవ్వుకుంటూ వెనక్కి వెళ్లిపోయాను
నేను తెచ్చుకున్న చదువునంతా పారబోసుకున్నాను
మళ్లీ దాహం తీర్చమని నీ ముందు దోసిలి ఎత్తాను
నువ్వు నీళ్లూ వొంపలేదు
నా దోసిలీ నిండలేదు
నా దాహం పిడచకట్టుకుని నేను ఎడారినయ్యాను
నా వొడ్డున ఏ నీటి చుక్కయినా చేపపిల్లలా

విలవిల విల్లాడుతుందేమోనని
మళ్లీ మళ్లీ ఎదురుచూస్తూనే వుంటాను నేను

2

ఎవడు పుట్టినా అడదానికేగా
ఏ అడదైతేనేం
ఎవడు పుట్టినా రక్తం లోంచేగా
ఏ రక్తం అయితేనేం, మరి
నా యిస్తరి దూరంగా ఎందుకు పెడ్తివి నాదొరా నా రాజా
అని ఈ భూమి కెదురుంగా నిలబడి
సూర్యుడిలా నువ్వు నన్ను పొడుస్తూనే వుంటావా!
ఇంత తెలిసీ ఇంత చేసీ
నీ కష్టాన్నీ నీ కనీళ్లనీ చూడలేని
అంధుణ్ణయిపోయినందుకు
నా కన్నెప్పలకి నీ మాటల సూదులు వేలాడ్తూనే వున్నాయి నా మట్టి మనిషీ!
నేను వొట్టి మనిషినే అనుకున్నా
నువ్వూ వొట్టి మనిషివే అనుకున్నా
మనిద్దరి చీమూ రక్తవూ వొక్కటే అనుకున్నా
తోలుతిత్తి ఏదైతేనేం
మనిద్దరి కష్టాలూ వొక్కటే అనుకున్నా
అంతా వొట్టిదే నా మట్టి మనిషీ!
నా వొంటి మీద చొక్కా రంగుని బట్టీ
నా పెదవి మీద మాటల వాసన్ని బట్టీ
నా తల్లీదండ్రీ నాకు పంచిచ్చిన రక్తాన్ని బట్టీ
నా చేతుల మోటుదనాన్ని బట్టీ
తలపాగా తీసి నువ్వొచ్చినప్పుడు
నీ ముందు వొంగున్న తీరుని బట్టీ
నా మనిషితనం భాయమైపోతున్నప్పుడు
నేను వొట్టి మనిషిని ఎట్లవుతా?

3

మాటకీ
అక్షరానికీ
మనిషి వాసన వుంటే సరిపోద్దా?
పోదు,
ఏ మనిషి వాసనో గట్టిగా పసికట్టనీ.
మాటకీ
అక్షరానికీ
చెమట చేతుల మోటుదనం
కావాలిక!
మాటకీ
అక్షరానికీ
కళ్లకింద బాధతో ఏడుపుతో
తడిసీ నానీ
నల్లబారిన నీడ కావాలిక!
మాట నిజంగా మాటయితే
మనువు మాటలో చెప్పాలంటే
అది కాళ్లలోంచి పుట్టాలి
మట్టి కాళ్లలోంచి పుట్టాలి!

(యానాం పోయినప్పుడు మాదేటి 'సుబ్రమణ్యం' అనే దళితుడు కొన్ని వేమన పద్యాలూ పల్లె పాటలూ వినిపించాడు. అవి నిజంగా వేమన పద్యాలో కాదో తేల్చుకోవల్సింది గోపిగారే -శివారెడ్డి అతనికి యానాం వేమన అని పేరు పెట్టారు. ఈ యానాం వేమన ఆరోజు చాలా మాట్లాడాడు, పాడాడు. కాని నాకు పనికొచ్చింది ఒక్కటే; "ఇన్నాళ్లుగా రాస్తుండారు, మా కష్టాలూ కన్నీళ్లు మీకు అపర్ణయా దొరా!" అతని బాధకి అక్షరరూపం ఈ కవిత -బహుశా నాలో నాకు సమాధానం' కూడా కావచ్చు)

(25, మే 1942 సాహిత్యవేదిక, ఆంధ్రజ్యోతి)

ఇక్బాల్ చంద్

ఆరోకర్ణం

I

దోది ఏకీ ఏకీ

ఐదు వేళ్ళూ తెగిపోయాయి
నాకిప్పుడు కృత్రిమంగా వెలిసిన ఆరోవేలు ఒక్కటే మిగిలింది

నానమ్మకమే న గుండెను తూట్లు పొడిచినప్పుడు
తాటాకు శాసనాల రక్షణ ముసుగులో
బలైన నెత్తుటి గాయాన్ని
నిజానికి అక్కడేమున్నా నాకొరిగేదేమీ లేదు కానీ
రెండు స్పర్శల మధ్య రూపం అపనమ్మకమైనప్పుడు
నేనో రకరకాల దేవుళ్ళ కాళ్ళమీద పగిలిన కొబ్బరికాయను

మొన్న తాటాకు వీపుకు వేలాడదీసుకొని
మోకాళ్ళమీద పాక్కుంటూ బతికిన నాలుగవ రంగుని
నిన్న ఊరి బైటనే గాలిపీలుస్తూ
వేదాలు విన్నందుకు చెవుల్లో సీసం కరిగించి పోయించుకున్న ఐదోరంగుని
ఇవాళ గూటి ప్రమిదల్లో నానెత్తురే తైలమై
మండుతున్న ఆరో రంగుని

II

నా ఆరో వేలు వెక్కిరిస్తుంది
గుండె మీద అనుమానపు చేతులు పెట్టి
నిజాయితీని పరీక్షిస్తుంది
తెగిన మొండి వేళ్ళ గాయం

నువ్వు ఆరోవర్ణస్తుడివని హెచ్చరిస్తుంది
పెంచి పోషించిన ఊరే వంచించి తరుముతుంది
వా నుదిట అచ్చయిన ఆరోవర్ణపు గీత
కన్నతల్లి రొమ్ము చీకుతున్నప్పుడూ
కామిస్తున్నావని విందెల ఈటెలు విసురుతుంది
అబద్ధపు తలారీ అయి ఉరితాడు మీట నొక్కుతుంది

III

విందులో వడ్డించే వాళ్ళెవరో తెలుసు
భాళీ విస్తళ్ళు మొహాన కప్పకొని
పిగ్గుతో చచ్చిపోతున్నదెవరోనూ స్పష్టమే
అకలి ఏడ్పుల కన్నీళ్ళ మీదనే
దేశ ద్రోహపు అచ్చుల్ని ముద్రిస్తున్న చోట
ఇక్కడ వేను కచ్చితంగా ఆరోవర్ణస్తుణ్ణే

IV

వా తెగిన వేళ్ళను
తిరిగి ఇవ్వొద్దు కానీ
నా మెడకు తగిలించిన నీచవర్ణపు బిళ్ళ
వా బిడ్డలకూ తగిలించమని
నాకు మాటివ్వండి

(కంజిర పొయిట్రీబులిటిన్ - 6, అగస్టు 1993)

యాకూబ్

లోకిక స్వప్నం గురించే మాట్లాడుతాను

మోనుతున్న గాయాన్ని మళ్ళీ ఎవరో కెలికారు
ఎవరో స్వేచ్ఛను యాభై ఏళ్ళలోపే పరీక్షకు నిలబెట్టారు
మేకప్పుల్తో సహా మనుషులందరూ
మళ్ళీ వెనక్కి రూపాంతరం చెందారు.
రోడ్లమీద నడుస్తున్నవాళ్ళూ
కుడి ఎడమలకు నర్దుకున్నారు
పేర్ల వెనక మతాల ఐడెంటిటి గుర్తులు తగిలించుకుని
అందరూ అప్రమత్తులైపోయారు.

మూడు గోపురాలు, మూడు సింహాలు
మూడు రంగులు ప్రశ్నార్థకాలుగా మారిపోయాయి
అన్ని ప్రతీకలూ మరోసారి వంచించబడ్డాయి
మత నిర్ధారణ కోసం ప్రత్యేక నిర్ధారణ కమిటీలు నియమించబడ్డాయి
చరిత్ర పేజీల్లోంచి మనిషి ఆనవాళ్ళు తప్ప
అన్నీ మిగిల్చి శిధిలాల్నే ప్రమాణాలుగా చూస్తున్నారు
మనిషే అన్ని శిధిలాల్లోంచీ అస్థిపంజరమై వెలికి వస్తున్నప్పుడు
మనిషి తప్ప మిగిలిన సమస్యలే ప్రధానమైపోతున్నప్పుడు ,
ఇక దేవుళ్ళు కూడా మనుషుల్నే పావులుగా వాడుకుంటారు.

* * *

రాజులు రాజ్యాలు అంత:పురాలు
కాలం పరీక్షించి వదిలేసిన జ్ఞాపికలు
కాలం వెంబడించిన ప్రతివస్తువు పరివర్తన చెందుతుంది
విలువలు మారతాయి, అవసరాలు మారతాయి

మనిషి మారిపోతాడు
కానీ ఇప్పుడు అవరోహణా క్రమంలో
మనిషి ప్రయాణించడం ఎంత చోద్యం
ప్రతి మనిషిని శత్రువుగా చిత్రించి
ప్రతి గుండెమీద అపనమ్మకాల పరదాలు కప్పి
భయాన్ని విత్యావనరంగా మార్చి
అన్ని మానవతా విలువల్ని కాలరాచి
ఏ రథాలమీదో రామబాణాల మీదో రాతియుగం దాకా
ప్రయాణం కట్టిన ఆదిమ మానవుల్ని చూస్తున్నానిప్పుడు,
మనిషిని వెంటాడుతున్న ఉన్మాదాల సాక్షిగా
నిజానికి ముక్కలైపోతున్నది మనిషే
మనిషి నిజం కానప్పుడు
అన్నీ కల్పితగాథలే భూగోళాన్ని చుట్టుకుంటాయి.

* * *

ఊపిరి పోసుకోకముందే మతాన్ని నిర్ణయించే భూమ్మీద
నన్ను కొత్తగా ఆవిష్కరించుకునే ప్రయత్నం చేస్తున్నాను
నన్ను సృష్టించిన తొలిమానవులు ఆదామూ అవ్వలూ కారు
ఏ నిషిద్ధఫలంలోంచో నేను పుట్టలేదు
నేను డార్విన్ చెప్పిన కోతికి వారసుణ్ణి
ఆకాశం, గాలి, నీరూ నా దేవుళ్లు
నేనే ఒక కట్టడాన్ని.

నన్నెవరు కూల్చడానికి ప్రయత్నించినా
నేను మనిషిలా ప్రశ్నిస్తాను
ప్రతిసారీ నేను లౌకిక స్వప్నం గురించే మాట్లాడతాను.

(కంజిర పొయిట్రీ బులెటిన్ - 6, ఆగష్టు, 1993)

బెరుకు సుధాకర్

అనగా..అనగా.. మెరిబే !

అప్పుడు,
నేనింకా ఊపిరి పోసుకోనయినా లేదు
నాలో జవమూ, జీవమూ సంతరించుకోనూ లేదు
కలలు కకావికలైన కోట్లాది మాతృమూర్తుల్లో ఒకతి మా అమ్మ
బ్రతుకంతా కత్తులవంతెనపై రక్తసిక్తగమనం గావించే
దరిద్రరేఖ దిగువనున్న కోట్లకుటుంబాలలో ఒకటి మా కుటుంబం
ఆకాశం అంతస్తుల మేడకు వెన్నుపూసలు విరగ్గొట్టుకొని
రాళ్ళుమోసే దినకూలీల్లో ఎవరైనా మా అమ్మే కావొచ్చు.
ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకొని, దుక్కి కింద నలిగే
ఏ రైతుకూలీ అయినా మా అయ్యకావొచ్చు.
అట్లా విరిగిపడిన జీవనశకలాలను కూడదీసుకొని
రేపటి చందమామ తమ కళ్లల్లో మొలుస్తాడని
నన్ను మా అమ్మ గాజుకళ్ళతో, అమావాస్య చీకట్లో నవమాసాలు మోసింది.
రక్తరంజితం కానరాని, రక్తమాంసాలు లేని ఎముకల గూడయిన
మా అమ్మలాంటి వాళ్ళు
'ప్రతిభ కలవాళ్ళ' సదుపాయాలు సహాయం అందుకోలేక కాన్పులోనే
వందేళ్ళ జీవితం నిత్యం ముగిస్తున్నారు.
పాలకోసం గుక్క పెట్టి ఏడ్చిన బాల్యం సాక్షిగా చెబుతున్నా,
అమ్మ పొత్తిళ్ళలో వెచ్చదనం కోసం తల్లడిల్లిన పసితనం సాక్షిగా చెబుతున్నా,
మీ ప్రతిభాపాటవానికి అప్పుడే నా ఒంటిమీద మంటల పుల్లెలు పూసాయి.
ఆరనిగాయాలయి, మాయని మచ్చలతో శరీరం క్షతగాత్రమయింది.
గిడసబారిన కాళ్ళూ,

పాగ చూరిన నా కళ్ళు

ముడుచుకుపోయి, తోలుతిత్తిలా నా ఒళ్ళు -
క్షతగాత్ర శిశుజనన చరిత్రమాత్రమే కాదు తెలిపేది,
శిశిర గర్భకుహరంలో ఎన్నిసార్లు గర్భవిచ్ఛిత్తి చెంది
మొలకెత్తానో నాకు తెలుసు.
కళ్ళయినా తెరువని నా ఒళ్ళు
కటికనేలపై బడి జాలిగా దొర్లుతున్నప్పుడు
నిస్సహాయంగా నా తల్లి కార్చిన కన్నీరు నేనింకా మరచిపోలేదు.
నా చర్మం ఏ కర్మ సిద్ధాంతానికి అనుగుణంగా మలినపడి
అంటరానిదిగా మారిందో నాకు బాగా తెలుసు
ఏ 'మెరిట్' సంపాదించుకొని ఒకడు,
శ్రీమంతం నుండి బారసాల దాకా
నిత్యం పండుగలతో నిదానంగా పెరిగి, సరాసరి పట్టుపరుపుపై పవళిస్తూ,
కళ్ళకద్దుకునే 'అద్భుత చర్మాన్ని' సృష్టించుకుంటాడో నాకు బాగా తెలుసు.
చింకిచాపపై రాటుదేలిన నా శరీరానికి లేని 'మెరిట్' ను
సుతారంగా, సుతిమెత్తని పరుపుపై పొర్లడానికి నీకెవరిచ్చారని
నేనడుగుతున్నా?
గాలికి, ధూళికి, రోగ క్రిములకు జాతీయం చేయబడ్డ మా శరీరాలు
బాల్యం చూడకుండానే 'ప్రతిభావంత' ప్రభుత్వాల పాలనకు
మిలియన్ల సంఖ్యలో ఏటా మృత్యువాకిటి తలుపు తట్టి మూల్యం
చెల్లిస్తున్నారు.

2

ఒక శిశువు నేలపైబడి కదలిక నేర్చకముందే
అయ్య జేసిన అప్పుకింద వాడి సర్వస్వం
దొరగాడి కాళ్ళకాడ కుదువబెట్టబడుతుంది.
వాడు మట్టిలో మట్టయి, 'వెట్టిలో జీవితమంతా అంగలార్చినా

అంగుళం భూమయినా అంటుకోదని నీకు తెలుసా?
ఒక తమ్ముడి చేతులు ఇంకా గట్టిపడకముందే
ఈ దేశంలో ఇనుప మరల కింద, బొగ్గుపొరల కింద నలిగి, పగిలి
లోహదార్ఢ్యాన్ని నంతరించుకొని నిన్నటి బాల కార్మికుడు
రేపటి "మెరిట్ గల యువ కార్మికుడు" గా పరిణితి చెందుతాడు.
తొలకరితో వేల గుబాళించినట్లు,
వేకువలో కలువరేకులు వికసించినట్లుంటుందన్న బాల్యం
తన ముద్దు ముద్దు పాదముద్రలైనా వదలకుండా
నన్ను మొరటుతనం రంగరించుకున్న అలగాజనంలోకి తోసేసింది
కాశ్మీర్ నుండి కన్యాకుమారి దాక
రాజస్థాన్ క్వారీ కాంట్రాక్టు నుండి శివకాశి ఫైర్ వర్క్స్ దాకా
మాది దిక్కుమాలిన 'పరిపక్వతే' గాని ప్రతిభకాదుగా?
నదులు సముద్రంలో కలిసినట్లు,
కిరణం పత్రహరితాన్ని ఉద్దీప్తం చేసినట్లు
మా చెమటబిందువుల పరిపక్వత మీ ప్రతిభ గుబాళింపయింది.
మా చేతుల్లో కాయలు మొలిపించుకొని, మీ పాదాలకు
సుతిమెత్తదనం పొదిగితే, గుట్టుచప్పుడు కాకుండా
మమ్మల్ని ముట్టడించాలనుకుంటున్నారు.
ఈ దేశం అమూలాగ్రం కుశాగ్రబుద్ధి గల మీకంటే
మేము చాలా 'మెరిటోరియస్' గానే శ్రమిస్తున్నాం.
తెగిపోయిన మా చేతులకు
కాలిపోయిన మా చర్మానికి
కమురు బారిన మా కళ్లకు
చచ్చుబడిపోయిన మా అంగాలకు ఏ 'మెరిట్ పారితోషికం' ఇస్తావు?
ఫ్యాక్టరీ అంతా తనదే అయినవాడు,
బాల్ బేరింగ్‌లా, క్రేన్‌లా
మరచక్రపు మధ్యస్థ ఇరుసులా ఇన్నాళ్ళూ మెలిగినవాడు
తన మెరిట్‌కు ఇంక్రిమెంట్ కావాలంటే, గుర్తింపు కావాలంటే

కనీస వేతనం కావాలంటే లాకౌట్లు, రిట్రెంచుమెంట్లు, లాఠీ ఛార్జీలు.
నేల నేలంతా తానయి కలేసి తిరిగినవాడు,
వాగలి మొనకింద ఒళ్ళంతా చీల్చుకున్నవాడు,
చెమటయి, విత్తనమయి మొలకెత్తినవాడు
రైతన్న తన శ్రమకు ఫలం కావాలంటే,
భూమిని చాపకింద మలుచుకున్న
హిరణ్యాక్ష భూస్వామ్యంపై పిడికిళ్ళెత్తితే, ప్రతిభకు ప్రతిఫలం కావాలంటే,
కల్లోలిత చట్టాలు, ఎన్‌కౌంటర్లు....
ఇదీ నా మెజారిటీ దేశప్రజల "మెరిట్" కథ.
మెరిట్ గురించి నీవు నిజంగా వెంపర్లాడితే
ఆ మెజారిటీ ప్రజల 'మెరిట్' గురించి మాట్లాడు
చిప్పిల్లిన చెమట బిందువుల్లోంచి
చరచరా పెరిగిన పంటపొలాలు, కర్మాగారాలు
ఏ 'తిరకాసు' మెరిట్‌తో నావాళ్ళకు దక్కడం లేదో జవాబు చెప్పు
పాలం గట్టుమీద కూర్చున్నవాడికి,
ఫ్యాక్టరీ ఎయిర్ కండీషన్ రూంలో యజమానికి
గరిసెలో ధాన్యరాశులు, షేర్ మార్కెట్లో క్యాపిటల్లు
ఎట్లా స్వంతమవుతున్నాయో చెప్పు.
నా అగ్ని ప్రశ్నలకు, ప్రశ్నల కొడవళ్ళకు నీ దగ్గర జవాబు లేదు.

3

నీ బాల్యం బాధాతప్త హృదయ విదారక గీతమొక్కటే అయినా బాగుండేది.
అవమానాల తివాచీల మీద సాదరంగా ఆహ్వానించిన అసమానతల వ్యవస్థ,
తప్పటడుగుల నుండి లేచి నిలబడేదాక
సూర్యరశ్మి సోకక పచ్చనాకు మెడలు వాల్చేసినట్లు,
ప్రోత్సాహం లేక, గమ్యం లేక
చెట్టుకింద నా చదువు, మృత్యుగోడ పాఠశాల నీడలో నా చదువు
అర్థకలితో నా చదువు,

అవమానాల శరపరంపరలో నా చదువు
పద్మవ్యూహంలా, పరచుకున్న అర్థంకుల్ని ఒకటొకటిగా దాటి
ఉన్నత విద్యా ప్రాంగణంలోకి అడుగిడితే
పబ్లిక్ స్కూల్లో నీ చదువు,
ఫ్లోరసెంట్ దీపాల వెలుగులో నీ చదువు.
పసిడిబుగ్గల, పాలబిస్కెట్ల నీవు ఎదురుపడ్డప్పుడు
ఈ దేశంలో మెరిట్ స్వామ్యం, మొరటుస్వామ్యం అర్థమయిపోయింది.
ట్యుటోరియల్ వెండి చెంచాతో మెత్తగా వండిన పదార్థాలను
సుతారంగా గొంతులోకి దించి,
అనుభవైక ప్రజ్ఞకు ద్వారాలు మూసిన 'ప్రవేశపరీక్షలో'
కక్కే మీ ప్రతిభ ముందు మేము దిగదుడుపే సుమా
హృదయం వికటించి నీవు బూట్ పాలిష్ చేస్తే,
రోడ్లు ఊడ్చితే, శ్రమ జీవి వృత్తులను అవమానిస్తే,
కథ అర్థం తిరిగి 'చక్రబంధనం' మొదలయితే
పత్రికల పతాకశీర్షికల్లో ఎక్కుతున్న
మీ 'నవీన పద్ధతులూ' మీరూ ఊపిరిమాని ఉరిపోసుకోవాల్సి వస్తుంది.

4

ప్రతిదీ పరాధీనమయిపోయిన ఈ దేశంలో,
'కుట్ర' సాధారణ సూత్రమవుతుంది.

అనాదిగా నా దేశ ప్రజలు వర్ణాలుగా వర్ణాలుగా
అర్థంగా, నిలువుగా విడదీయబడ్డదీ వాస్తవం
కులం అడ్డుగోడల్లో 'కూలివాడు' చీలిపోయిందీ వాస్తవం
రెక్కలమ్ముకునే వాళ్లంతా ఒక్కటిగా ఉండకుండా
చీల్చినవాడి 'కుట్ర' చిరకాలం కొనసాగుతుంది.

శాస్త్రం నా సొంతం అని ఒకడు
రాజ్యం వీరభోజ్యం అని ఒకడు

వాణిజ్యం నా సొంతం అని ఒకడు,
సకల ఉత్పత్తి సాధనాలని, భూమిని గుప్పెట్లో పెట్టుకున్నప్పుడు
వాగలి కర్రు అయినవాళ్ళు,
మంగలికత్తి అయిన వాళ్ళు,
కమ్మరి కొలిమి అయిన వాళ్ళు,
కుమ్మరి కుండ అయిన వాళ్ళు,
మగ్గాలు వేసేవాడు, కల్లుగీసేవాడు,
అస్పృశ్యుడు, అధముడు, పంచముడు....
.... ఇట్లా నాదేశపు శ్రమశక్తి అంతా విభజించి పాలించబడింది.

5

కొందరికే విద్య గుత్తసొత్తయి పోయినపుడు,
కొందరికోసమే పథకాలు, పరిశ్రమలు, అభివృద్ధి నిర్దేశింపబడినపుడు
'మెరిట్' కు నయంకాని 'ఎయిడ్స్' వ్యాధి సోకింది
అసమానతల విషవృక్షం బలిసి వర్ధిల్లే దేశంలో
'మెరిట్' కొనుగోలు వస్తువయి పోయింది.
పరాధీనమయిపోయిన 'మెరిట్' మనల్ని పరాన్న జీవుల్ని చేస్తుంది.
బ్రతకడానికి బ్రయోపైటా పనికిరాదు.
వెర్టిబ్రేటా ఎంత చదివినా నిటారుగా నిలబడలేకపోతాం
హాలోజెన్లు, అల్కెమీ, అర్ధంకాని ఆల్జీబ్రా,
రాజనీతి శాస్త్రం, చరిత్ర.. ఏదైతేనేం,
'ఇంటర్వ్యూ' అవినీతి ప్రవాహంలో అన్నీ కొట్టుకుపోతాయి.
రిజర్వు చేయబడ్డ నా అర్హత కూడా
రికమెండేషన్ లెటర్ దగ్గర గింగిర్లు కొడుతుంది
పైనుంచి కిందవరకు అల్లుకుపోయిన
కులదురహంకారం, మమకారం
ఒకడికి నిచ్చెన మెట్లయితే,
మరొకడికి జారుడుమెట్లవుతున్నప్పుడు

ఏ రిజర్వేషన్ అడ్డుకోలేకపోతుంది.
రిజర్వేషన్ కాలమే రిజర్వు చేయబడినపుడు,
రిజర్వు చేయబడ్డ ఆస్తులు మెజారిటీ మీవే అయినపుడు,
తరతరాల 'సాంఘిక ఔన్నత్యం' మీరే అనుభవిస్తున్నన్నాళ్ళు,
మాపై సాంఘిక అణచివేతను, వెనకబాటుతనాన్ని
ఏ రిజర్వేషన్ అడ్డు చక్రం వేయలేదు.
ఏ అర్హతకు, ఏ మెరిట్‌కు కట్టుబడి
రారాజు కొడుకు యువరాజుగా
భూస్వామి కొడుకు పిల్లభూస్వామిగా,
ఆఫీసర్ కొడుకు చోటాసాబ్‌గా ఉనికిలోకి వస్తున్నారు?
నా అగ్ని ప్రశ్నలకు, ప్రశ్నల కొడవళ్ళకు నీ దగ్గర సమాధానం లేదు.

6

రిజర్వేషన్ల కాగితపు పడవలో
జీవన సంక్షోభ సముద్రాన్ని ఈదాలని భ్రమపడ్డవాడు
ఆ మాత్రం అవకాశం రాలేదని నిరాశలో మునిగిన మధ్యతరగతివాడు
ముంచుకొస్తున్న నిరుద్యోగ ఉప్పెనలో
కంప్యూటరైజేషన్ కుదింపులో రోడ్లమీదకి విసరబడి
నెమ్మదిగానైనా నిజాన్ని గ్రహిస్తారు.
వాళ్ళు వాళ్ళంతా ఒక్కటవుతారు
సమస్యల సాగరంలో ఈది అలసినవాళ్ళంతా ఒక్కటవుతారు.
వర్గాలు, వర్ణాలుగా చీలిపోయిన శ్రామికజనమంతా ఒక్కటవుతారు.
శ్రమైక శక్తులు నిర్మించే సమాజంలో
మెరిట్ కోట్ల ప్రజల సమిష్టి శ్రమ అవుతుంది.

('అనగా.... అనగా .... మెరిట్' పుస్తకం నుంచి)

మద్దూరి నాగేష్ బాబు

అప్పుడుగానీ ... ?

ఇంతకీ నేనెక్కడున్నాను?
ఎవరది
వాపై కొండచరియలు దొర్లిస్తూ
నా మొండెంపై త్రిశూలాలు నాటుతూ
వాకాళ్ళూ చేతులూ నరికి
మనుష సంచారమేలేని కూడళ్లలో విసుర్తూ
ఎవరదీ
వా నరాల కాలవల్లో రాక్షసి బాగ్లు రగిలించి వెళుతున్నారు
నన్ను వెలుతుర్లో వున్నావని వెక్కిరిస్తున్నారు
చూపులు సూదులు
మాటలు మహారాజకరవాలాలు
చేతులు ఫార్టీసెవెన్లు ఫిఫ్టీనైన్లూ
ఎవరూ
నా గొంతులో గొల్లతాలై నొక్కిపడుతూ
వా కాళ్లమధ్య గుదిబండలై అడ్డుపడుతూ
ఉదయం అంటే అవహేళనల అశనిపాతమై
మనుగడంటే ఒక అసమానతల మహాంధకారమై
ఏం!?
నేను నేసిన బట్టలు నావికావా?
నే కుట్టిన చెప్పులు నే తొడుక్కోవద్దా?
బోగన్‌విల్లా పరాగాల్ని పీల్చి పీల్చి
ఊపిరితిత్తులు ఒక మహాశూన్యంలోకి
ముడుచుకుపోయాయి

హంస్పేన్‌సాగర్ల సదుపాయాలు
అనుభవించీ అనుభవించీ
బతుకు పాకీ దిబ్బల పరిశుభ్రతైపోయింది
ఎంతప్రాధేయపడుతున్నా నిర్లక్ష్యిస్తూనే
ఎంత వేళ్లూనుతున్నా పెరికి వేస్తూనే!
ఏవిటీ నేను చేసిన మహాపరాధం?
ఈ దేశం ప్రభుత్వానుపత్రి వరండా చివర్న
దిక్కులేని రోగగ్రస్తుడి మూలుగుని నేనేనా!?
ఈ జంధ్యప్పోగుల కరెన్సీ కట్ట ఏలికల తులసీ వనంలో
గుబాళించే గంజాయి మొక్కని నేనేనా?
ఇంతకీ ఎక్కడున్నాన్నేను
కాకులుదూరని మహాసముద్రాల చిమ్మచీకట్ల వత్రాలమధ్యనా
మానవశిలాజమైనా దొరకని మరో గ్రహాంతర వాసంలోనా?
అయ్యా అగ్రకులాల్లారా!
మా గుండెల్లో దిగుతున్న శూలాల్లారా!! దించండి దించండి
మా తల్లుల పొత్తి కడుపుల్లో - గర్భ పలుగుల్ని మరింత లోతుకి దించండి
మా నేల గుడిశెల తాటాకు చూర్లకి
మీ అహంకారాన్ని పెట్రోలు పోసి మరీ వెలిగించండి
మేం ఇన్‌షర్ట్ చేసుకుంటే
మమ్మల్ని రెండు ముక్కలుగా తెగనరకండి
మాట్లాడినందుకు
మా నాలుకలు తెగ్గోసి రోళ్లకింద నాటండి
మేం కనపడితే
మమ్మల్ని భస్మంచేసి తుంగభద్రల నిమజ్జనాలు చేయండి
మా దేవుడి మెడలో
మీ పాత చెప్పులు మరిన్ని కూర్చి నిలువెత్తు దండలేసి

పెటిల్లున నవ్వండి
మేం ఎత్తితే మొలకెత్తిన విశ్వవిద్యాలయాల వొనళ్లమీద
మా వేలిముద్రలువ్నాయేమో
మా బొటనవేళ్ల దక్షిణలు అడక్కనే కోనుకోండి
బాబూ
మేం రిజర్వేషన్ల కూలే ప్రాజెక్టులు కడుతుంటే
మీ ఓపెన్ తెలువుల్తో పునర్నిర్మిస్తున్న మేధావులారా
మేం బొటాబొటి మార్కుల వైద్యులమై చంపుతుంటే
మీరు సంజీవనులై ఈ దేశాన్ని పునరుజ్జీవింపచేస్తున్నారా?
మీకింకా కోపం బాగా రాలేదేమో
దయచేసి
ఆగ్రహోదగ్రమహోగ్రమూర్తులై విజృంభించండి
క్షణానికో దహనం ఘడియకో మానభంగం
లిప్తకో హత్యచేసి
మా జాడలేకుండా చేసి ఈ పుణ్యభూమిని పునీతం చేయండి
మాశవాలమీద అల్పాచమనాలు చేసుకుంటూ నవ్వుతూ పోండి
అప్పుడు
అప్పుడుగానీ మాకు సిగ్గురాదు
అప్పుడుగానీ మీ కుతికెలు తెగ్గోయం

(జూన్ 1994, ఆహ్వానం)

సీతారాం

నా ఇంటిపేరు చుండూరు

ఈరోజు పొడిచింది

గొడ్డలి నరికింది
ప్రాణం పరిగెత్తింది
కులం కుమ్ములకుమ్మింది
శవం చెల్లాచెదురైంది
దు:ఖమూ కలగక కళ్ళు చూస్తున్నాయి
సంచె కట్టుకుని మరీ ఏరుతున్నాను
మోపులు కట్టినపుడు రాలే వరి కంకుల్ని ఏరినట్లు
దొరికిన శ్వాసల్ని, చనిపోయిన మనుషుల్ని
సంచెలో వేసుకుంటున్నాను
గోనెసంచులు విప్పమన్నావుగా
చూడు తలలెవరివో, మొలలెవరివో
ఈ చేతులకు తండ్రెవరు తండ్రీ
కాళ్ళకు తల్లెవరు తల్లీ
ఈ శవాలకు దిక్కెవరు నాయనా
ఎవరి కుంకుమ దిబ్బరా ఇది?
సరేలే కాసేపు అడుకుందాం కళ్ళు మూసుకో గట్టిగా
పీరీపీరీగుమ్మడిపండూ ఈశవం పేరేమిటి
వప్పులకుప్పా వయ్యారిభామా
గూట్లో నిజం చేలో శవం
కళ్ళు నిప్పుకణికలయ్యేదాకా చూస్తాను
ఈ శవాలకి కాపలాగా
నిజాలు చెప్పటానికే మనిషి మీద ప్రమాణం చేస్తున్నాను
చచ్చిన శవమ్మీదొట్టు అమ్మతోడు నన్ను నమ్ము

అంతా అయిపోయాక
ప్రభుత్వపు కూలోళ్ళంతా పాలాల్లోకి దిగారు
పాలాల్లో పడి మునుంపట్టి ఏరుతున్నారు శవాలను
టోపీలనిండా పార్లుతున్న వెత్తురు
త్రీనాట్టాకి ఎనిమిది బొటన వేళ్ళు దొరికాయి
ఎడం చేతులు ఏడు దొరికాయి
రెండు మాత్రం పిడికిళ్ళు బిగించి వున్నాయి
పిడికిళ్ళలో ప్రాణాలున్నాయేమో
గవరయ్య తొమ్మిన్నరకాళ్ళూ ఆరుతలలూ వెతికాడు
406కి జ్వరం కనుక డ్యూటీలో లేడు
ఈ తలకి ఈ కాలు, ఈ చేయి ..... ఒక్కటో
ఈ మొలకి ఈ మొండెం, ఈ కుడికాలూ కలిపితే ..... రెండో
ఈ పిడికిలి కేమీలేవు అయినాసరే ..... మూడో
ఎన్నిశాల్తీలు; ఎన్నిశాల్తీలెన్ని శాల్తీలు మొత్తం ఇరవై పైచిలుకు
ఎతకండెతకండి ఇళ్ళకి పోవాలి
వొట్టికాళ్ళూ చేతులూ ఎక్కడికీపోవు
ఓపికచెయ్యండ్రా
ఈరోజు ఫస్ట్‌జీతాలెత్తాలి
పేనాయక్ ఉంటాడో పోతాడో
వాడి తలనూ ఇక్కడే చూడండి
అసలిక్కడ్నుంచి గాలి కూడా కదల్లేదు
ఇక్కడెక్కడక్కడో వుంటాయి చుట్టూ చూడండి
తెగిన్తరువాత ఎగిరెగిరి ఎక్కడికి ఎగురుతాడ్రా
ఆ మాలమాదుగులు
చిమ్మిన రక్తమంతా
పెద్దముత్తయిదువ నుదుటి బొట్టుగా దిద్దుకుందిరా!

('అక్షరం', ఆంధ్రభూమి దినపత్రిక)

సతీష్ చందర్

కులని కనుపాపలు

రెప్పవాల్చని కన్నుల్లా రెండు బావులు
ఒకటిః మాకు
రెండుః మా వాళ్ళకు

మధ్యలో ముక్కుమీద వేలేసుకున్న రోడ్డు

ఎవడో జల్సారాయుడు
వాడక్కూడా
అంటరాని రోగం తగిలించాడు
పుట్టుమచ్చలేని కవలల్ని
పచ్చబొట్లతో వేరు చేశాడు

మాదీ మావాళ్ళదీ
ఒకరినొకరు చూసుకోలేని
కనుపాపల సహజీవనం

కన్నీళ్లలా తోడే కొద్దీ ఉబికే బావి నీళ్ళు
రెంటికీ ఒకటే జల
అదే హృదయం కాబోలు

మధ్యలో ఎగనామం పెట్టుకున్న రోడ్డు

ఎవడో నిష్ఠాగరిష్ఠుడు
వాడచేతకూడా
మడి కట్టించాడు
అయిన వాళ్ళకి ఆకుల్లో
పిండాలు పెట్టించాడు

మాదీ మావాళ్ళదీ
ఉరిపళ్ళ ఖైదీలు పెట్టుకున్న
ఉచ్ఛనీచాల వివాదం

పగిలిన కొబ్బరి చెక్కల్లా రెండు బావులు
అంతరంగమంతా ఒకటే తెలుపు

మధ్యలో తలంటుకున్న రోడ్డు

ఎవడో భక్తాగ్రేసరుడు
వాడక్కూడా
తిరువాళ్ళు రప్పించాడు
మేము శిరోజాలకు బదులు
ఒకరి శిరస్సుల్ని మరొకరు మొక్కుకున్నాం

మాదీ మా వాళ్ళదీ
నపుంసకుణ్ణి కట్టుకున్న
తోబుట్టువుల నవతిపోరు

తెగిన లంకె బిందెల్లా రెండు బావులు
ఎక్కడ తడిమినా ఒకటే శూన్యం

మధ్యలో ముడివిప్పుకున్న రోడ్డు

ఎవడో సర్వసంగ పరిత్యాగి
వాడక్కూడా
సన్యాసాన్నిచ్చాడు
మేం నిండు యవ్వనంలో
వానప్రస్థాన్ని స్వీకరించాం

మాదీ మావాళ్ళదీ -
కందిన మద్దెల బుగ్గలు
నిసర్గ సౌందర్యం

ఇద్దరు వంచముల కోసం రెండు బావులు
ఎందులో దూకినా ఒకటే చావు
మధ్యలో బుసలు కొడుతున్న రోడ్డు

ఎవడో మనువు తాత ముని మనవడు
వాడక్కూడా
వర్ణాశ్రమాన్ని బోధించాడు
తలకాయల్ని కోల్పోయిన మేం
తనువుల్తో స్వీకరించి
తలో బావిలో దూకాం

మాదీ మా వాళ్ళదీ -
గెలలు నరికిన
అరటి మొక్కల సహజ మరణం

ఎంత వెతికినా కనపడని రెండు బావులు
ఎటు చూసినా ఒక్కటే సరోవరం

మధ్యలో తోకముడిచిన రోడ్డు

ఎవరో ఇద్దరు అమర ప్రేమికులు
వాడకోసం
పడవను బహూకరించారు
నేనూ నా సహచరుడూ
నలుదిక్కులా ప్రయాణించి
ఒకే ఒక్క తామరపువ్వును కోసుకొచ్చాం
మేమిక
ఎన్ని కిరణాలతో గుణించుకున్నా
మాచుట్టూ ఒకే ఒక్క సూర్యోదయం
(పశ్చిమగోదావరి జిల్లా కొమ్ముచిక్కాల గ్రామంలోని రెండు శాఖల దళితుల కోసం రెండు బావులు పక్క పక్కనే ఏర్పాటు చేశారు)

(రనన, ఉదయం దినపత్రిక)

ప్రసేన్

క్రీ.పూ. 1992 డిసెంబర్ 6

మనిషి పుడతాడని మనిషి ఎదుగుతాడని మనిషి దేవుడవుతాడని అందరూ అబద్ధాన్ని నటిస్తున్నారు.

అప్పుడెప్పుడో అమ్మనడిగాను నాదేమతం అని. దేహంలోని ప్రతి నెత్తుటి బొట్టునూ ప్రశ్నించాను. అణువణువునూ నిలదీశాను. అమ్మ ఏదో చెప్పింది. అర్థం కాలేదు నాకు. నన్ను నేను తవ్వుకున్నాను.

కవలలను కలిపి కుట్టిన పచ్చి పేగును రంపంతో కోస్తున్నారెవరో. పురిటి వాసన రుచి తెలియక పెంటు పులుముకుంటున్నారెవరెవరో.

ఇంకొక దెబ్బా హైస్సా....వెయ్యరపాటూ హైస్సా....వగిలిన అద్దాలలో ప్రతిబింబాలను పలుకరిస్తూ దయ్యాల భాషలోకి మంత్రాల ననువదిస్తూ మాటలకు గుణింతాలు చెరిపేసి మరియొక దెబ్బా హైస్సా.....మరియొక పోటూ హైస్సా.

ఏడీ ఎక్కడ ధర్మజుడేడీ హరిశ్చంద్రుడేడీ దేవతా వస్త్రాల కథలో పసిపిల్లడేడీ త్రిశూలాలతో కూల్చేశారా రబ్బరు గుండెలకు కొక్కేలను తగిలించి శుద్ధి చేశారా చరిత్రకు చేతబడి చేశారా రాలిన శిథిలాల్లోంచి ఉరాంగ్ ఉటాన్ లేచిరాలేదా బుడగల్ని చిదిమేయడం తేలికే మళ్ళీ రాతి ఆయుధాలను చెక్కడం లేదా మొదటి రాయిని పెకిలించడం చాలా చాలా తేలికే.

ఇక్కడేమీ శిథిలం కాలేదు. ఒక పావు ముందుకు జరిగింది.

మనిషి చిరిగిపోయాడా మాంసం తునకలతో దేహాన్ని అల్లడం సాధ్యం కాదు. మనిషి సిగ్గుపడుతున్నాడా దేశాన్ని నగ్నంగా చేసి చూద్దాం. మనుషులను ఒకటొకటిగా వలిచేద్దామా లోపల చెదలు పుట్టలు తప్ప విగ్రహాలుండవు.

చెవులు మూసుకోండి ఇక్కడ దిక్కులు పిక్కటిల్లే నిశ్శబ్దం పరుచుకుంది. ఒక బ్రెండ్మూడ్నాలుగైదారేడెనిమిత్తంభై వెయ్యినైండు క్రమించండి వాకింతకు మించి లెక్కరాదు. ఈ శవాలు మతాలవి కావు. మనుషులవి. ఆ పక్కనే చేతుల్లో

చేతులేసుకుని కూలిపోఁ ుున అ ఇద్దరు దేవుళ్ళ ఇంటి పేర్లేమిటో.....పదియుగాల నడకలో దారి పొగొట్టుకున్న ఆ చివరి శవాన్ని నేనేనా... నన్ను పెకిలించారు...నేను శిథిలమయ్యాను.

విధ్వంసం తరువాత నేను మళ్ళీ అడిగాను. అమ్మా నాదేమతం అని. అమ్మ చెప్పింది స్పష్టంగా అర్థమైంది. ఇపుడు నా తల్లిదండ్రులను నేను ద్వేషిస్తున్నాను. నా పుట్టుకను నేను ద్వేషిస్తున్నాను. నేనూ దేవుడ్నే అయినందుకు నన్ను నేనే అసహ్యించుకుంటున్నాను.

సాతాను పుడతాడని సాతాను ఎదుగుతాడని సాతాను దేవుడవుతాడని నేనిపుడు నిజాన్ని నటిస్తున్నాను.

(29-1-93 ఆంధ్రజ్యోతి వీక్లీ)

అప్పర్

ఒక అడిమి అవశేషంలోకి ...

ఏవ్వాళ్లో గడిచిపోయిన అపరిచిత క్షణాల మీద
ఇన్ని దూరాలూ విడిచిపోయిన అవాంఛిత స్వప్నాలమీద
ఇప్పుడెవరూ శోకన్నాలు పెట్టక్కర్లేదు
వక్క పక్కనే రాసుకుంటున్న రెండు భుజాలమీద
కలవని దిక్కుల కరగని విస్మృత లోకాలమీద
ఇప్పుడెవరూ సంతాపాలు ప్రకటించక్కర్లేదు

ఎంతకూ తెగని దారిమీద
తెగిన పాదాలు తడబడ్తున్నట్టే వుంది
ఎంతదూరంలే అకాశం అని
కొండలుదాటీ
కోవలు దాటీ
పరుదుతీస్తున్న పసితనపు వూహలానే వుంది

ఎక్కడ బయలుదేరామో
అక్కడే వుండచుట్టుకుని
ఎక్కడ గొంతువిప్పామో
అక్కడే లుంగలు చుట్టుకుని కూలబడిపోయామని
ఇప్పుడెవరూ పశ్చాత్తాపాలు రాసుకో అక్కర్లేదు

ఎందుకోసం వెతుకుతున్నామో తెలియని
ఎవరికోసం వెళ్తున్నామో తెలియని చీకటినుంచి
చీకటిలోకి తలుపులు తోసుకుంటూ
కాలంగుహ చివర కనిపించని వెలుగులోకి
కంటిమీద ఆరిపోయిన ఒకే ఒక్క ఆశచివరికి ..

ఎవరినో నమ్మించడానికి పుట్టించిన అబద్ధాలను
అవును నిజమే అని ఇన్నాళ్ల తర్వాత
ఇప్పుడెవరూ భుజాలు తడువుకోనక్కర్లేదు

అబద్ధం పుట్టినపుడే చరిత్ర జీవచ్ఛవమైంది
అబద్ధం రెక్కతొడిగినప్పుడే
మన ప్రశాంత మైదానాలన్నీ శవాల గుట్టలయ్యాయి
అప్పణ్ణించీ
మనమే మనశవాలకు
అనాధ వాహకులమయ్యామని
ఇప్పుడెవరూ బోనెక్కి సాక్ష్యాలు చెప్పక్కర్లేదు
మతం ఎవరి అభిమతమో
ఎవరి గొడమీద వేలాడుతున్న ఖడ్గమో
ఇప్పుడెవరూ పురావస్తు తవ్వకాలు చేయక్కర్లేదు
మనం నడిచి వచ్చినదారే అంత!
ఏనాడో తప్పిపోయిన అడుగుల్ని
ఇప్పుడు
అటు తిప్పీ ఇటు తిప్పీ వెతుక్కునీ అతుక్కునీ
తల అజ్ఞానానికి వేలాడేసినట్టు
ఎవరికీ తెలియనట్టే
ఎందుకింకా
అమాయక అర్ధజ్ఞాన అర్ధసత్యాల
అర్ధ అబద్ధాల పగిలిన అద్దాల వృథా ప్రశ్నార్థకాలు?

మనిషి రాక్షసి అయినాసరే
దేహం కుప్పకూలిన గోపురమైనాసరే
దేహం శిథిలమైన మసీదైనాసరే
ఇన్ని యుగాల అంతరాత్మ ప్రబోధాల ప్రార్థనలన్నీ
నెత్తుటి జలపాతంలోంచి

అగాధంలోకి జారిపోయినానరే,
ప్రకృతి మీదా
మన లోలోపలి ఎకృతిమీదా
ప్రకటించిన యుద్ధాలన్నీ
మన లోపలి చీకటి యుగాల్ని మళ్లీ తడిమినానరే
అంధకారాలమీద అంధమూర్ఖత్వాలమీద
కాంతిధారల్ని వొలికిన చరిత్ర
చివరి మలుపు గోడమీద వొట్టి మసిబొగ్గు రాత అయినానరే
మొహమ్మీద రక్తం పులుముకునే తిరగండి
వొంటి మీద స్పర్శ పొరల్ని వొలుచుకునే తిరగండి

రండి రక్తమాంసాల్లేకుండా!
సరికొత్త ప్రపంచపటాన్ని
తెగిననరాలతో, శిథిలమైన ఆత్మలతో నిర్మిద్దాం
రండి
ఈ శవయాత్రకి అందరూ ఆహ్వానితులే,
జాగారాలూ, ఎదురుతెన్నులూ ఇంకా ఎందుకు?
ఈ మనిషి కడసారి చూపుకోసం
మృత్యువు సిద్ధంగా వుంది

(సాహిత్యవేదిక, ఆంధ్రజ్యోతి దినపత్రిక)

ప్రసేన్

కారిజన్ కూబాగ్

ఒక శవం చనిపోయింది

పట్టపగలే తలల మీద
చరిత్ర నటిస్తూ
వెలుగుతాయి దీపాలు

చావకూడు విడిచిన
శవాలను తొడుక్కుని
షికారుకెళ్ళింది ఊరు

ఒక మృతదేహం మరణించింది

చావు బతుకుల నడుమ వంతెన తెంపే
రంగొక రాచపుండు
మగత రెప్పల మధ్య ఖాళీలోంచి
ఆయుధం పలచగా చిక్కబడుతుంది

ఒక చావు పాడి కట్టింది

పాలాల్లో శవ కళ్ళం తప్ప
ఒక్క ఊపిరి మొలకా కన్పించదు

అర్ధరాత్రి
ఉలికిపడి చిట్లిన కలలకు
తెలతెలవారు సుప్రభాతంలో
మనిషి కుళ్ళిన వాసనే వినిపిస్తుంది

ఒక శవం లేచింది
చర్మం రెండో పొర మీద

వెలి దుఃఖం పాకుతున్న స్పర్శ
కనుపాపల వాకిట్లో
తడి దుమ్మెవరో ఊడ్చిన అలికిడి

ఒక శవయాత్ర నడిచింది

నిప్పున్నా లేకున్నా
పాగ చితిలోదే కదా
నిండు చూలాలిగా ఉబ్బిన చావుగోనె
సాక్ష్యం చెబుతుందా
తెగిన దేహాన్ని తడిమి
పదును ప్రమాణం చేస్తుందా

ఒక వల్లకాడు పిలిచింది

గాలి వేటుకు జలదరించిన
ఒంటరి ప్రమిద కాళ్ళ దగ్గర
ప్రాణాలు ముడుచుకున్న కొన్ని కాయాలు
చితిలోంచి నడిచిపోయాయి
చిరిగిన చరిత్ర పేజీలను వెదజల్లుతూ

ఒక స్మశానం అంటుకుంది

చితి
చనిపోయింది
ఆత్మ
రగులుకు
ఒక మని మరణించాడు



(ఆదివారం ఆంధ్రజ్యోతి)

సతీష్ చందర్

అరచేతి రంధ్రాలు

లేనితనం మా చిరునామా
నిన్న రవిక లేనితనం
నేడు బొట్టులేనితనం

లేనితనం శూన్యం కాదు
శిలువ దిగిన వీరుడి అరచేతుల్లో కనిపించేది
రక్తమాంసాలు లేనితనమే కాని ఖాళీతనం కాదు
వెత్తురొలికిన జాడల్ని గుర్తుపట్టడానికి
మేలుజాతి జాగిలాలు ముక్కుపుటల్ని
ఎగురవేయనవసరం లేదు

చూపుల్ని
చూపుడు వేళ్ళల్లో జొనిపిస్తే చాలు
లేనితనం పారదర్శకమై
తాటాకుల్నించి కాగితాల మీదకి
అంటరానితనం రుజువర్తనం చెందుతుంది

లేనితనం నా రక్తబంధం
అమృతనం కావచ్చు
చెల్లితనం కావచ్చు

శిరస్సు నుంచి, భుజాల నుంచి, తొడల నుంచి
పాదాల మీద పడి తన్నబడ్డ
పసుపుకుంకుమల నా తల్లి పరాభవానికి
పాండవదైవాలు శిరస్సులు వంచినప్పుడు
బొట్టులేనితనం పునరుత్థానమే కాని వైధవ్యంకాదు.

జారిపడ్డ కురుల్ని ముడివేయడానికి కులపతులు
పరమత నయోధనుల తొడలు విరవనవసరం లేదు
పాతకి గావో
పతితగానో ప్రకటించి ముక్కు చెవులూ కోసేస్తే చాలు

బొట్టులేని తనానికి ముఖం లేనితనం తోడై
ఇతిహాసాల్నించి మరియమ్మ కొండదాకా
పరాభవం పరుగెత్తుకుంటూ వస్తుంది.

లేనితనం ఎక్కడైనా దాస్యమే
అక్కడ దేవదాసి
ఇక్కడ పాపాలరాశి

పిగ్గుమాలిన తనాన్ని గుర్తుచేసి మొలచుట్టూ
వాలుగాకులు కట్టించిన నేరానికి
పాదలమాటున సృష్టికర్త మండిపడ్డప్పుడు
భీతిలేనితనం ధిక్కారమేకాని పాపం కాదు.

ఎదురు తిరిగిన తల్లిని శిక్షించడానికి పైనున్నవారు
ప్రసవవేదన బహూకరించనవసరం లేదు

వాలుగ్గోడల్లోనో
వాలుగు నీతుల కూడలిలోనో నిలబెట్టి శీలం లేనితనాన్ని
రాళ్ళతో కొట్టిస్తే చాలు

'తప్పు చెయ్యని వాడు తొలిరాయి వేయమనే' నాధుడు లేక
బొట్టులేనితనం కులంలేని తనంగా పరిణమించి
వెత్తిన చెంగువేసుకుని మోకరిల్లుతుంది

లేనితనం మా ఉద్యోగం
రాత్రికి కట్టుకట్టే నర్సు నా చెల్లి
నల్లబల్లను వెలిగించే కొవ్వొత్తి నా తల్లి

కాళ్ళను కన్నీళ్ళతో కడిగి కురులతో తుడిచినట్లు
గాయాలను శుభ్రం చేసి గాజుగుడ్డ కట్టిన పాపానికి
పతివ్రత నెత్తిన ఊరేగే బుట్టలోని కుష్ఠురోగివడో
కన్నుకొట్టినప్పుడు

సహనంలేని తనం "సిస్టర్" తనమే కాని
బాధ్యతా రాహిత్యం కాదు

రోగికి నిద్రపట్టకపోవడానికి
రాత్రంతా విలపించిన ఫ్లారెన్స్ నైటింగేలు కారణమని
ఉన్నతాసనాలు రిపోర్టు రాయనవసరం లేదు
చెడిందనో
మరెవర్నో మరిగిందనో
మురికివాడ పంతులమ్మ తెల్లచీరమీద చిమ్మినట్లు
బురద చిమ్మితే చాలు
గొంతెమ్మ సందు నుంచి
చర్చిపేట వరకూ అవమానం విస్తరిస్తుంది.

లేనితనం మా వారసత్వం
అప్పుడు గుండెల్ని కప్పుకోలేనితనం
ఇప్పుడు మనసుని విప్పుకోలేనితనం

పదిమంది ఆడపిల్లల్లో నా కన్నకూతురికి మాత్రమే
బొట్టులేకపోయిన లోపానికి
వృత్తి ప్రేమికుడెవడో
బెల్టులేని బుజ్జికుక్క పిల్లని వెతికి పట్టినట్లు
పోల్చుకొని ఎగరేసుకపోయినప్పుడు
అనందించలేనితనం దెబ్బలు చవిచూసినతనమే కాని
సంకుచిత్వం కాదు

కిచకుల కులాంతరాలింగవాల్ని గౌరవించకపోవడానికి
కన్నపేగు నిర్దాక్షిణ్యాన్ని తప్పుపట్టనవసరం లేదు
సెకండ్ సెటప్ గానో
ఉంపుడుగత్తెగానో మార్చుకొని మేడమీద రెండో అంతస్తులో
కట్టిపడేస్తే చాలు
కులం పీడని ప్రేమమతం బిచ్చగాడి పాత్ర నుంచి
రావణాసురుడి చెరలో పడుతుంది

కలిగినతనానికి నమస్కారం
గుండెలకు రవికలిచ్చినట్లు
నుదుటికి బొట్టునివ్వకండి

పడిన చోట వెతుక్కుంటున్నవాళ్ళం
నిదురించిన చోటనే మూడోరోజు మేల్కొంటున్నవాళ్లం
బాకీపడ్డ చెంపదెబ్బల్ని లెక్కించుకుంటున్నవాళ్ళం
అరచేతి రంధ్రాల్లో ఆకలిదప్పులు చూసుకుంటున్నవాళ్ళం

నుదుటి మబ్బుల మీద మాకేమాత్రం మోజులేదు
ఫాలభాగం నీలాకాశం కావాలన్నదే మా స్వప్నం

ఒక్క సూర్యబింబం మీద తప్ప మాకు ఏ బొట్టు మీదా భ్రమల్లేవు

(ఆదివారం ఆంధ్రజ్యోతి)

భాజా

శరత్తు

మమ్మల్ని చూస్తే
పారిజాత పుష్పాలంకృత ధరిస్తాను చూసినట్లుండాల్సింది
ఆకాశపు వెన్నకుండలో చేయిపెట్టి చందమామను అరిచేతిలోకి తీసుకున్న
ట్లుండాల్సింది
ఒక సురపురాని అనుభూతి కొలనులో మైమరచి మునకేసినట్లుండాల్సింది
కాని!
కరిగి కారిపోతున్న తారు డబ్బాలో ముంచి తీసిన పావురాన్ని చూసినట్లుంటుంది
సింగరేణి గర్భంలోకి జారిపోయి రెండుకళ్లూ పెకలించుకున్నట్లుంటుంది
అమావాస్యను ధరించిన మృత్యువును అమాంతం కౌగిలించుకున్నట్లుంటుంది
బతకడాన్ని బంధాల మధ్య నించి తప్ప
కళ్ళమీంచి జారిన నల్లకఫన్‌లోంచి తప్ప
కలల్లో, కథల్లో తప్ప దర్శించెరుగని వాళ్లంకదా!
మేవెంత నిండు పౌర్ణమిలమై ఉదయించినా
మీ మేఘాల రాక్షస హస్తాలు కప్పి మమ్మల్ని వికారుల్ని చేయండి
గులాబీలమై విరబూసి పరిమళిస్తే
సాంప్రదాయాల ముళ్లకంచెల్ని బందోబస్తు చేయండి
కట్టుబాట్ల వస్త్ర కచ్చడాల్ని నిలువునా ధరించిన వాళ్లం కదా!
మేం వెలుగును చూడ్డం మీకిష్టం లేదనో
మా అందాల అమృతాన్నెవడైనా చూపులస్త్రాలతో పీల్చి చిరంజీవత్వం
పొందుతాడనో
మీ మూర్ఖత్వపు చీకటిగదుల్లో మమ్మల్ని కొవ్వొత్తుల్ని చేయండి
ఏ ఐదారేండ్లకోసారో
తోబుట్టువు నిఖాకో - వలీమా విందుకో బయల్దేరితే
మీ అహంకారపు గోతాముల్ని కప్పి
మమ్మల్ని సైతానుల్ని చేసి తీసుకెళ్లండి
మా కళ్లమీద కాటుక దుప్పటికప్పి

మీకళ్లతో మాకు చూపుని ప్రసాదించండి
పడగ్గదుల్లో మాత్రం పశువులకన్నా - కుక్కలకన్నా హీనంగా
మా సున్నితమైన ఆశల్ని - కోర్కెల్ని నమిలి
పీల్చి పిప్పిచేసి భిల్వత్ పాన్‌దాన్‌లో ఉమ్మెయ్యండి

* * *

మా కళ్లమించి కురిసే వర్షం నలుపు, మెరిసే కిరణం నలుపు
మా పసిడి వన్నెల శరీరాల జిలుగు వస్త్రాలపై కప్పబడ్డ మీ కర్కసత్వం
గురుతు నలుపు
అసలు ప్రపంచమంతా కాటుకడబ్బాలో ముంచి తీసినట్లు కారునలుపు
మేం వీధిలో నడుస్తుంటే నిలువెత్తు నిరసన జెండా నడుస్తున్నట్లుంటుంది
ఒకరాత్రే, మనిషి దెయ్యమో అయి నడిచొస్తున్నట్లుంటుంది
ఇప్పుడు మా శరీరాల మీంచి వీచేది అరబ్బుదేశాల అత్తరు వాసన్లు కాదు
మక్కిన మా కలల మాగు వాసనలు
మా గొంతులు పాడేది సాయంకాల ఖవ్వాలి ముషాయిరీలుకాదు
మా చూపులపై ఒలికిన సుర్మాషోషాలాపనలు
ఏం? మాకు మా కళ్లతో చూడాలనిపిస్తుందని
మీ బూజుపట్టిన బుర్రలకెన్నడూ అవగతం కాలేదేమో!
మా కన్నీళ్లనెవడైనా కథగా చిత్రిస్తే
వాడి తలపై టాకాలు బహుమతి ప్రకటించండి
ఈ మోజిజా నెదుర్కొనే మూసా ఎవడైనా వుంటే
వాణ్ని తీహా మైదానం దాకా తరిమికొట్టండి

* * *

ఇప్పుడు మాకు కాసింత వెలుగు ప్రసాదించమని మిమ్మల్ని వేడుకోం
ఈ జీవితం ఉరికొయ్యమీద నించుని,
మీరు తగిలించిన మాస్కు భయపెడుతుందని గగ్గోలెట్టం
మా మీద కప్పిన మీ అల్పబుద్ధుల తెర తొలగించమనీ ప్రార్థించం
కాని,
గాలిసైతం స్వేచ్ఛగా పీల్చుకోలేని గాఢాంధకారపు రుచి తెల్సుకోడానికి
మీరు గోషా ధరించే తిరగాలని షరతు పెడుతున్నాం

(అంకితం : తస్లీమా నస్రీన్‌కు)

(ఆగస్టు 1994, ఆహ్వానం)

భాజా

పత్వా

అస్సలామాలైకుమ్ - తస్లీమా - అస్సలామాలైకుమ్!

నీ తల కో రేటు ప్రకటించిన

నా ముస్లిం సోదరులకూ అస్సలామాలైకుమ్!

నేరమే?

నేరం ఎవ్వరు చేసినా నేరమే?

నువ్వు చేసినా, నేను చేసినా

తస్లీమా నస్రీన్ చేసినా, బెంజమన్ మొలయిసే చేసినా

నేడు, ఉదయించిన సూర్యుడు వెలుగు నివ్వడమూ నేరమే -

పెదాల వీణ మీద సొంత మాట ధ్వని చెయ్యడమూ నేరమే?

అంతరంగంలోని అల్పపీడనాలు అక్షర రూపెత్తుకోవడమూ నేరమే?"

* * *

అసలు ఆడది అక్షరాలు దిద్దడమే నేరమైతే

మనం కప్పిన నల్లగోతాముల్లోంచి తలెత్తిన కాఫిర్, సువ్వరీకీ బచ్చీ

షరియత్‌ని వేలెత్తి చూపడం క్షమించరాని నేరం కదా?

మరి నేరం కాని దేవిటి?

అల్లాహో అక్బర్ -

ఇంకా పురిటి వాసనైనా పోని పసిబిడ్డల్ని

అమ్మ పొత్తిళ్ల లోంచే అరవై ఏళ్ల ముసలోడు పెళ్లాడ్డం మాత్రం నేరం కాదు

సాక్షాత్తూ తల్లిదండ్రులే

కూతుళ్లను అరబ్బు దేశాల కమ్మడమూ నేరం కాదు?

ఏలిన వారి కరుణామయ క్రీగంటి చూపుల కోసం

పదవుల కోసం, గుప్పెడు ఎంగిలి మెతుకుల కోసం

ఆత్మని, అస్తిత్వాన్ని ఎకాఎకి బాబరీ మసీదునే

తాకట్టు పెట్టడం ఆనలు నేరమే కాదు?

అందమైన మొగ్గల్ని మాయచేసి నిఖా చేసుకోవడమూ నేరం కాదు?
వాడిపోయాక మెహర్ మొహాన కొట్టి తలాక్ చెప్పడమూ నేరం కాదు?
అవి నేరం అన్నవాళ్ల నాలుకల్ని సుస్తీ చేయండి?
నిన్నొకడు - నేడొకతె
రేపంతా నోరెత్తగలరు
ముందే అందరి నోళ్లూ కుట్టెయ్యండి -
పొరపాట్న సూర్యోదయమవుతుందేమో?
"భాయియో?
తస్లీమా నస్రీన్ కనిపిస్తే పట్టివ్వండి
లక్ష కాదు -
కోటి టాకాలు బహుమతిస్తాం!"

(26, జూలై 1994 ఆంధ్రప్రభ వారపత్రిక)

దెంచనాల శ్రీనివాస్

గంగావత్ ధ్వని

చేతగానివాణ్ణి

తరాలు తగలబడ్తున్నా
నీ భాషకు లిపి ఇవ్వలేనివాణ్ణి
కట్టెలేరుకోడం కోసమో
పరిగెలేరుకోడం కోసమో
నీ జీవితాన్ని ఖర్చు చేస్కుంటున్నా
వంచనా వచనాలల్లుకుంటున్న వాణ్ణి
నీ టుక్రీపై కుట్టుకున్న అద్దాల రవివర్మలతో స్నేహం చేశాను
నిప్పు కణికలతో కాల్చిచ్చిన నీ జొన్న రొట్టెల అమృతం తాగాను
నా, కమ్మదొరల బానిసా
నువ్ కూర్చున్న నేలను వాళ్లు అసహ్యించుకోవటం చూశాను
నీ సామూహిక డప్పు నాట్యాల్లో దరిద్రాన్ని మర్చిపోయాను
నలభై ఏండ్ల రిజర్వేషన్లూ నీ చేత సార బట్టీలు పెట్టిస్తూనేవున్నాయి
నీ కులపు నాయకూ నిన్ను కొనుక్కుంటున్నాడు
నీ కాంచడీ పెఠియా వూడబెరికి
కంప్యూటర్లు బలవంతాన నీకు చీర చుడ్తున్నాయి
నేనే కాదు
నీ తళజా దేవతా చేతగానిదే
తల బాదుకొని
కడుపు కొట్టుకొని
ఏడ్వు ఏడ్వు ఏడవ్వే
నన్ను కన్నందుకు
నా పెద్దకిష్టాపురం లంబాడి తండా

('గురి తప్పిన వద్యం' కవితా సంకలనం నుంచి)

ప్రసేన్

ఐదోగోడ

అనగనగా చాలా రోజుల క్రితం పూర్వంలానే దుఖ్ఖాన్నీ కొత్తగా ఏడ్వలేక చెరిపిన వేలిముద్రనే మళ్లీ వేసి ఇపుడిక ఓ పూటంతా దిద్దిన అక్షరంలా గజిబిజిగా ఉబ్బి అచ్చంగా అపుడె పుడోలానే వెలివాడల గొందుల్లో దాచుకుని పోగొట్టుకున్న ఏదో వెతుకులాటలో ఓడిపోయి పన్నెండున్నొక్క సూర్యోదయాల అవలింతలకు చిటికెల నిద్రాభంగాలు పాడి....

ముసుగులే మెరుగులనుకున్న అమాయకమే
నకిలీ గోత్రాలు చెప్పుకున్న అజ్ఞానమే

అపుడెపుడోలానే ఇపుడూ ఇక్కడ తెలుపు నలుపుల గళ్ళు గీస్తున్నారు. పావులు పొంచి పొంచి నల్లగళ్ళ మీదుగానే పాకుతున్నాయి. నాలుగు గోడల మీద పరుచుకున్న పరమపదసోపానంలో పాములన్నీ తోకలు ముడుచుకునే ఉన్నాయి.

రవ్వంతైనా మార్పులేదు
అచ్చుగుద్దినట్టు గతమే ఇవాళ

మడిబట్ట తడి పొగరుకు ఏ రంగూ వెలిసిపోలేదు. ఎవరో ఎవరి అనాధ శిశువునో ఎవరి గుమ్మం ముందో గుడ్డల్లో చుట్టి వదిలిపోయారు గతంలోలానే.

అదే చనుబాల జోల
పురిటి చావిడిలోంచి అదే పాత జన్మ వాసన
లక్షన్నొకటోసారి బాలింత పరిమళం
బొడ్డు రాలిపడ్డ చప్పుడు
అంతా గతంలోలానే
రొట్టెముక్క రాజసమూ నీరుగారిన ధాహం తీపీ
మింగిన రోకళ్ళ గిరికీలూ అవాది వారసత్వమే

కదిలే ఒంటెద్దుబండి చక్రాల కింద చిందరవందరగా జారినపుడూ చూరు విషాదధారల తీవెల జలతరంగిణి కణ్‌కణమని మీటినపుడూ ఏ పాచి పీలునామాలోంచి తూలిపడ్డాయో అదే పలుగూపారా అదే జమాబందీ అదే జోలపాట.

బులిబుల్లి పాదాలిపుడే గుర్తల్ని కాళ్లతో తన్నేస్తున్నాయి. కొత్తగా ముసుగులు తీయడమంటే కత్తులు దూయడమే మరి! ఇక అరచేతుల్లోకి మొహం కూరుకుపోదు!

(ఆదివారం ఆంధ్రజ్యోతి)

లింగాల రాజ నమ్మయ్య

కాబోయే గీత

కుల మతాల రివాజు
నరనరాల రక్తంలో జీర్ణించి
నేటికీ ఆధిపత్యంతో
కులహీనతల లోను చేస్తూ
కులహంకారాల బలి చేస్తూ
కాల్మొక్తా బాంచన్‌నని
మాటి మాటికీ అన్పిస్తుంటే
మర్లబడి నిలబడితే
సూటిపోటి బూతులు.
అవ్వనక్క పెండ్లమనే.
పీపులు పగలకొట్టే.
వీధిలో మానం తీస్తున్న
కారంచేడు చుండూరు
మాదిగ మాలల శవాలు.
గుండెల్లో మెదులుతున్న
కండ్లల్లో కదులుతున్న
నీడలా వెంటాడుతున్న
రామరథ యిరుసులు.
అహంతో తొక్కిపట్టి
అదునుచూసి ఓట్లతో
అధికారాన్ని చేజిక్కించే
అగ్రకులం ఎత్తుగడలు.
ఆకలి తీర్చే మాటలతో
అంటుముట్టు లేని చేతులతో

వాళ్ళు ఏళ్ళు గాళ్ళు.
కన్నీళ్ళ తుడువుకై
మొసలి కన్నీళ్ళు కార్చే
మేకవన్నె పులుల వైనం.
మోసాన్ని ఎరుగక
ఎంగిలి మెతుకు తినేరీతి
ఇకలేదంటే లేదు
ఎగబడుతున్న నా జాతి మాటే
కాబోయే గీత

(అముద్రితం)

జి.ఆర్.కుర్మె

రేపటి కిరణం

నిన్న ... ...
నా గుడిసెకు తలుపుల్లేవు
నా మనసుకు తలుపుల్లేవు
ఎడారిని మోసుకుపోయే
బిడారి జీవితం నాది
ఊరికి దూరంగా
కాటికి భారంగా
నా గూడెం పాడెలో
శవాన్నై నేను నిర్జీవించేవాన్ని!
వేడు ... ...
'కోటా'ల కొట్వాల్లో
నా నోటిని కట్టేసినా
పదవులు పంచేసి
నా పెదవులు కుట్టేసినా
'రిజర్వేషన్' జోల పాటతో
నన్ను నిదుర పుచ్చుతున్నా
'ప్రిజర్వేషన్' ఈల పాట
నాలో నేను పాడుకుంటూనే ఉన్నా!
రేపు ... .
నా కలం గళం
యుగళం పాడతాయి
గొంతులన్నీ
నాకు వంత పలుకుతాయి
ఏ రేఖ గీసినా
నా రూపు రేఖలే స్పష్టంగా కనపడతాయి
సమాజ పరిణామక్రమంలో
రేపటి తొలి సూర్యకిరణాన్ని నేనే!

(పునాదిరాయి కవితా సంపుటి నుంచి)

వరదయ్య

అన్నిటికీ చెడి....

ఎందుకురా

కలల కట్టవతల చేతులు కట్టుకు నిలబడిందీ
గుండెలు లేని కొండల్లా అక్కడే పాతుకుపోయిందీ
బర్రెతోలు గీక్కుంటూ గట్టుకింద నడుమొంచింది ఎందుకురా

ఎవడో గీసిన గీత రోతనంతా తట్టలకెత్తి తలకబోస్తుంటే
ఎర్రెర్రని పాలిగాళ్ళు చూసీ చూడనట్టు తప్పుకు పోతుంటే
ఒండ్రుమట్టి మబ్బును చూపించి గేటుకి మైళ్ళ దూరంలో
మందల్ని చేసి జాగారం చేపిస్తే
ఎట్టా నడిచి పోయిందిరా నడ్డి మీద కూచున్న గడ్డుకాలం

అన్నిటికీ చెడిన గుండెలు
వానలో తడుస్తున్న గుడిసెల్లా నానిపోవు
ఎండలో రాలిన పిండెల్లా మాడిపోవు
సందుల్లో చిందిన చీమిడిలో చిక్కుకున్న చీమల్లా కన్నుమూయవు
ఈ గుండెలు ఒంట్లో తూట్లయ్యే దప్పుల నోళ్ళై
లోపల కపాలంలో నాదును సాది
బతుకునే ఒలకబోయే పలుకులు కాకపోవు

(ఆదివారం ఆంధ్రజ్యోతి)

పి.సి. రాములు

యుగారంభం

మన మెదళ్ళను మేట వేసిన సాగు చేలను చేసి
తమ మెదళ్ళను ఊసర క్షేత్రాలుగా మలుచుకున్న వాళ్ళు గదా
నరాలు చిట్లుతున్న చప్పుడునీ
జ్వలన స్వర జోరీగల పోరుహోరునీ ఎలా వినగలరు?
నడుస్తున్న చరిత్ర గమనాన్నెలా గమనించగలరు?
మురికి సందుల్లో ముళ్ళబాటల్లో ముప్పిరిగొన్న దారిద్ర్యాన్నీ
ముసురుకున్న 'వెలి' చీకటినీ ఎలా పసికట్టగలరు?
స్వేచ్ఛనీ, స్వచ్ఛతనీ, జనేచ్ఛనీ ఎలా గుర్తించగలరు?
ఆలోచనా ఆయుధాలనెలా పండించగలరు?
మడవేయడం, మడక దున్నడం, చెంగత్తు కొట్టడం ...
దమ్ముచేసి పెళ్ల తొక్కని వాళ్ళు,
మట్టిని చిలికి పంట తీయని పరాన్న భుక్కులైన వాళ్ళు
భూమిని తమ ఉక్కు హస్తాల్లో బంధించిన వాళ్లు
పేడతీయని వాళ్ళు నేలబావి నీళ్ళు చేదని వాళ్ళు
వేదోపాసనతోనే ఉపనిషత్తుల కసరత్తులతోనే
వేదననీ, వేడుకనీ, విధిరాతనీ, దు:ఖపులోతునీ కొలిచే వాళ్ళు
వీపు తట్టడం, వెన్నుపోటు పొడవడం
విభజించి ఎవికలిరవడం వెన్నతో పెట్టిన విద్యయిన వాళ్ళు
వీళ్ళే గదా... తొలకరి జల్లుకే మొలకబోయే,
నీరెండకే కంది పోయే అసూర్యం పశ్యలే గదా

నీరెండకే కంది పోయే అనూర్యం పశ్యలే గదా
పెట్టుగుడ్డి కులీన నూతికప్ప పండిత ప్రకాండులే గదా
'వర్ణ' ముద్రికలై శ్వాన శాసన కర్తలై మన ఏలికలై
సాహిత్య కమెండోల, పారామిలిటరీ పె(గ)న్ను స్వామ్యమై
పెచ్చరిల్లిన పిచ్చికుక్కల విచ్చలవిడితనమై బోరవిరుచుకుంటున్నది!
"ఊరనుంటే మాలవాడుందదా"ని నీచవృత్తులకి నీచ సామెతలు సృష్టించి
పైశాచికానందంలో ఓలలాడ్తున్న వాళ్ళు గదా
మనల్ని, మనసేవల్ని జుర్రుకుని తెగబలిసి వెర్రెత్తిన వాళ్ళు గదా
మన రక్తాన్ని లిప్‌స్టిక్ పూతగా బెడ్‌లైట్ జిగురు కాంతిగా
పులుముకుని పులకరిస్తున్న వాళ్ళు గదా ... !
చెమట సముద్రాల్లో బతుకు చిల్లి పడవ లాగుతున్న వాళ్ళం మనం
సకల సంపదకీ సృష్టికర్తలం, ఆకలి, అస్పృశ్యత వారసత్వమైన వాళ్ళం
పస్తులూ పరగడుపులతో వల్లకాడు కాపురమైన వాళ్ళం
దళితులే శ్రామికులు శ్రామికులే దళితులిక్కడ
పుట్టిన గడ్డపైన్నే కాందిశీకులం మనం
కాన్సెంట్రేషన్ క్యాంపుల్లో కర్కోటక కారాగార వాసులం మనం
కనిపించని కుల భూతపు కోరలకు వేలాడుతున్న వాళ్ళం
సరిచిన కర్రులమై వాళ్ళ బొర్రల్నీ, బుర్రల్నీ సుర్రు సుర్రున చరుస్తుంటే
తిలోదకాలోదిలిన సిద్ధాంతమై ఉద్యమం దారి తప్పిందనీ, నీరుకారిందనీ
ప్రశ్నల కొడవళ్ళు పరాభవిస్తున్నాయనీ, పూర్వ పక్షం చేస్తున్నాయనీ
నెత్తి నోరూ బాదుకుంటూ వడదెబ్బల పెడబొబ్బల గగ్గోలుపెడతారు.
కూల్చబడిన కలల శిధిలాల్లోంచి
కాల్చబడిన బతుకు కమురు కరుళ్ళలోంచి
పెల్లుబికిన గండ్రగొడ్డళ్ళమై
నిబద్ధంగా, నిర్భయంగా, నిర్దుష్టంగా, నిటారుగా ముందుకు సాగుతాం
లోకం మనల్ని అనుకరిస్తుంది, అనుసరిస్తుంది.

(అమ

ఎండ్లూరి సుధాకర్

పాద ముద్రలు

నేను బద్ధలవుతున్న అగ్ని పర్వతాన్ని
నన్నెవరూ అర్పలేరు
నాని అగ్నిపాదాలు
నా కళ్ళను ఏ తాళ్లూ కట్టిపడెయ్యలేవు.
నా శిరస్సు సగర్వ పతాక
నన్నెవ్వరూ అవనతం చెయ్యలేరు

నాకు ప్రతిభ లేదనేకదా అభియోగం
నా భూమిని దొంగిలించాక
నా కళల్ని తొక్కిపెట్టాక
నా చుట్టూ నిషిద్ధకుడ్యాలు నిలబెట్టాక
నాకు ప్రతిభెక్కడిది?
మట్టి నా ప్రతిభ
మట్టిలోంచి పుట్టిన మెరుపుసారం నా ప్రతిభ
మట్టిబొమ్మిడికం దాల్చిన మనిషి నా ప్రతిభ
నిన్నటిదాకా నన్ను చెట్లక్కట్టి కాల్చారు
అమానుషపు కొరడాలతో అస్పృశ్యగాయాలు చేశారు
నా దేహాన్ని ముక్కలుగా నరికి మూటలుకట్టారు
నా వోట్లో నిర్లజ్జగా మలం కుక్కారు

ఇవాళ నాది అగ్నిముఖం
నా చేతులు వజ్రాయుధాలు
నేనిప్పుడు నడిచే ఖడ్గాన్ని
నన్నెవ్వరూ తాకలేరు
నేను నిద్రలేచిన పులిని

నా కదలిక సింహస్వప్నం
నా తాతముత్తాతల నాటి అంటరానితనపు దస్తావేజుల్ని
నా తరతరాల ఆక్రోశాల కన్నీటి కైఫీయతుల్ని
నా జాతి వేలిముద్రల దరిద్రపు చీకటి చరిత్రల్ని
నడిరోడ్డు మీద చించిపోగులు పెడుతున్నాను.
భూతకాలం గొంతుమీద కాలుపెట్టి
భవిష్యత్తు గుండెల్లో నిర్భయసంతకం చేస్తున్నాను.
ఏనాటికైనా
నా పాదముద్రలు చారిత్రక రథ్యలవుతాయి.....

('వర్తమానం' కవిత

పి. సి. రాములు

గాయం కొత్త కాదు

గాయం కొత్త కాదు
గాయపడిన వైనమే కొత్త
అనుభవం పాతదే
అనుభవించిన తీరే కొత్త
గాయపడటమూ చంపబడటమూ
అవాదిగా అనుస్యూతంగా అవిచ్ఛినంగా సాగుతున్నదే
ఇదేం కొత్త కాదు! ఇదేం కొత్త కాదు!
పన్నిన షడ్యంత్ర చక్రబంధాలే కొత్త
కుమ్మక్కయిన కుటిల లాతీల
కుయుక్తుల వ్యూహ రచనే కొత్త
పాలిమేర పులినోరై తెరుచుకోవడమే కొత్త
తెగిపడ్డ మొండేలు
పాలాల్లో పరిగ కంకులవ్వడమే కొత్త
వలలేసి తుంగభద్ర కాల్వలో
శవాల గోవె సంచుల్ని దేవడమే కొత్త
అనుభవం పాతదే
అనుభవించిన తీరే కొత్త
చావడం కొత్త కాదు.....చంపబడ్డ విధానమే కొత్త!

ఊరి గమిట్లోని కట్టు బానిసలు
మనుషులని ఎప్పుడెంచారు గనుక
ఊరోల్లను ఓట్ల చెట్లుగా కాకుండా
ప్రజలని ఎప్పుడు పరిగణించారు గనుక

పంచాయతుల్లో దొరతనం కరచినోళ్ళను
భద్రంగా ఎప్పుడు బతకనిచ్చారు గనుక

చంపండి ..... చంపండి .....
దళితుల్ని చంపండి దరిద్రుల్ని చంపండి
గమిట్లోని వాళ్లందర్నీ కక్ష కట్టి మరీ ఖతం చేయండి
ఎంచుకున్న వాన్నెలా ఏరి పారెయ్యాలో
సాక్ష్యాన్నెలా శవంగా మార్చాలో
మీకు కరతలామలకం గదా!

ఎదిగొచ్చిన ప్రతివాన్నీ ఎదిరించిన ప్రతి వాన్నీ
ఏదో ఒక సాకుతో ఏరి పారేయండి
ఊచకొతల్తో ఊరంతా ఊడ్చేసి ఎక్స్‌గ్రేషియాల్తో వెలకట్టండి
కారణాలకేం ..... సవాలక్ష కల్పించవచ్చు
ఏ సాకూ దొరక్కుంటే 'ఆకతాయిని' ఫోకస్ చేయొచ్చు
అన్ని కాలాల్లోనూ అలుపై పోయిన ఆడవాళ్ళ నడ్డు పెట్టుకోవచ్చు
మరేం ఫర్వాలేదు .....
నరమేధం గావించండి ..... నరమేధం గావించండి
జనాభా కంట్రోలై దేశం సుభిక్షమవుతుంది
అన్నివేళలా ఏలినవారి అండదండలూ వెన్నుదన్నులూ
కొండంత బలాన్నీ బలగాన్నీ యిస్తుంటాయి
ఇరవయ్యేడు శవాలను భుజానేసుకుని
ఇరవయ్యొకటో శతాబ్దిలోకి ఎగిరి గంతేయండి
హత్యా వేదాంతాన్ని ఔపాసన పట్టండి
నెత్తురు కూడు బుక్కి మత్తుగా శయనించండి.

హంతకుల్నరెస్టించి ముద్దాయిల్ని శిక్షించమనే
విజ్ఞాపనలూ వినతిపత్రాలూ నిరసన ప్రదర్శనలూ నినాదాల ఊరేగింపు
కబేళాలోని మేకపిల్ల అరుపులవుతాయి
ప్రతి ఊసరవెల్లి గ్లిజరిన్ సానుభూతి పరామర్శలూ

కూల్డింక్ పల్కరింపులూ విడతలవారీ చర్చలూ
జ్వలించే తిరుగుబాటునీ పాటెత్తే జన సముద్రాన్నీ
డిలేడ్ ట్యాక్టిక్స్‌తో డీలా పడెయ్యడానికే
క్రమించే ఉద్యమాన్ని కాలరాయడానికే!

వద్దు ..... వద్దు
బతికే హక్కును కూడా బతిమాలుకునే దుర్గతి వద్దు
దగాపడి దిగాలుగా మొగాలు పూడ్చుకునే దీనస్థితి వద్దు
విద్య ఏ ఒక్కడి సొత్తూ కాదు
విజ్ఞానం ఎవడబ్బగాడి జాగీరూ కాదు
భుజం రాసుకుందనడం వట్టి బోగస్ మాటే!
భుజకీర్తుల్ని ధిక్కరించడమే
తరతరాల కర్రపెత్తనాన్ని తృణీకరించడమే
ఎవ్వర్నీ దేబిరించకుండా ఎక్కి రావడమే ..... వాస్తవం !

అనుభవం పాతదే అయినా -
హత్యాకాండకు జడిసి అదిరిపోయి బెదిరిపోయి
గూళ్ళనొదిలిన పక్షులయి ఊరొదిలి చెదిరిపోయి
శివారు శిబిరాల్లో శరణార్థులవకుండా

దుఃఖాగ్ని రగిలి పొగిలి సెగలనెగజిమ్మడమే కొత్త
సంఘటితమై దళిత శక్తి సంఘర్షించడమే కొత్త
కన్నెర్రజేసి కణకణ త్రెల్లుతూ నినదించడమే కొత్త
విముక్తి పోరులో వింటిని సారించటమే కొత్త
బాధితులూ పీడితులూ
ఆత్మరక్షణా సమర సన్నద్ధులై 'రక్త క్షేత్రం' పై శపథ సంతకం చేసి
తుడుం మోగించడమే కొత్త!

(సెప్టెంబరు 1991, 'అగ్ని శ్వాస' కవితా సంపుటి నుంచి)

ఎండ్లూరి సుధాకర్

రేపటి చరిత్రకు ముందు మాటను నేనే .....

నాది దగ్ధ ముఖం
నా లోపలి ముఖాన్ని దాచుకోలేను
నా ఏక ముఖంలో
ముసుగు ముఖాలు పరావర్తనం చెందవు
అధోముఖ బీజంలోంచి పుట్టినవాణ్ణి
అంతఃకరణను హత్య చేయలేను
నేను పాయను కాలేను
మరొకరి ఛాయగా నడవలేను
నా అనుభూతులను చెదరగొట్టలేను
నా అనుభవాలను ప్రహేళిక చేయలేను
నాఅక్షరాలను అదిమిపెట్టలేను
నా ముఖం మీద ముద్ర పడితే రుద్రుణ్ణవుతాను
స్వేచ్ఛ నా శ్వాస
లోహమై కరుగుతున్నవాణ్ణి
నా లోపలి తీక్షణత్వానికి ఇంకా కొలమానం పెట్టలేదు.
నాలో పెల్లుబికే నెత్తుటి ఊటలకు
ఎడారి కంచెలు కట్టలేను
కవిత్వం నా జీవధాతువు
నా రక్త మాంసాలలోని అగ్నికణాలు సజీవమైనంత కాలం
నా బాధ బతికే ఉంటుంది.
బలహీన భావజాలపు ఇరుకు పెట్టెల్లో
నిర్జీవంగా ఇమడలేను

రక్తక్షేత్రాలు నా స్థావరాలు
నిర్భయత్వం నా కవిత్వం
నా చుట్టూ గోడలు కట్టి
నా ముఖ సూర్యుణ్ణి అబద్ధపు మబ్బుల్తో కప్పేయడం
నన్ను ప్రతీకను చేసి బంధించడం
నా నిప్పు గొంతు మీద నీళ్ళు చల్లడం
నేనెప్పటికీ భరించలేను
పంజరాలు నా శత్రువులు
నా తలలో వేయి కెరటాల హోరు
అయినా నేనెవరికీ తలవంచను
స్వేచ్ఛ నా చిరకాల యుద్ధ స్వప్నం
నిన్నటి నిషిద్ధ కళ
ఇప్పుడు నా చేతుల్లో మట్టి బొమ్మ
మట్టికి ప్రాణం పోసే విద్య కవిత్వం
నేనే కవిత్వానికి ప్రాణదాతను
నా అక్షరాలకు ఏ రిజర్వేషన్లూ అక్కరలేదు
నిన్నటి చివరి వాక్యాలు నేనే చించి పారేసిన కాగితాలు
రేపటి చరిత్రకు ముందు మాటను నేనే

(రనన , ఉదయం)

అఫ్సర్

దారికోసం

గోడ కదలదూ
మెదలదూ
మాట్లాడదూ
కాలం వొక శరీరంలోంచి
అనేక శరీరాలుగా చీలిపోతుంది.
రాత్రిపగళ్ల మధ్య దేశాలు మార్తాయి
జలతారు కిరణాల నీడ మెల్లగా పదునెక్కుతుంది
చీకటివాకిళ్లు వెలుగు పుప్పొడితో ముగ్గులు తీర్చుకుంటాయి
పసిపాదాల రెక్కల్తో పిల్లలు
ప్రపంచాన్ని కమ్మిన దుమ్ముని తుడిచేస్తారు
కిరణాల అమాయకత్వం నుంచి
పెద్దల ప్రపంచం బోలుగా మొదలవుతుంది
గొప్ప చలనజ్వలనంతో
వొక నిశ్చలన దృశ్యానికి తెరతీస్తాం

గోడకదలదూ
మెదలదూ
మాట్లాడదూ
నిరంతర మరణ వేదనతో కాలిపోతున్నవాడికి
సూర్యుడు కూడా
మార్చురీకి వెళ్తున్న మృతదేహంలా కనిపిస్తాడు.
హత్యలూ ఆత్మహత్యల చక్రగమనంలో
ప్రతి కదలికా
కూలిపోతున్న శిఖరంగానే కనిపిస్తుంది.

దృశ్యాదృశ్యాల మధ్య రూపభేదం వుండదు
ఎటు నుంచి ఎటు వెళ్లినా కాలానికి పాదం ఒక్కటే.

గోడ కదలదూ
మెదలదూ
మాట్లాడదూ
సంతూర్ రెక్కల మీంచి ఎగురుకుంటూ వచ్చే
అందమైన సాయంత్రాలన్నీ
దుఃఖ వార్తలతో ముగుస్తాయి
వొంటిమీంచి వొట్టి బెరడుగా
రాలిపోతాయి పరిమళాలన్నీ
స్వరానికీ అపస్వరానికీ రూపం ఒక్కటే

ఇది శిధిలమైన గోడ
ఎండుటాకుల మౌనంలో
దృశ్యాలమధ్య గుడ్డి తెరని రాలుస్తున్న చీకటి
అనుక్షణ నిరీక్షణోద్వేగాన్ని కోల్పోయాక
మిగిలేది శవ జాగరణ
కూలిన గోడతో రహదారి కట్టాలిక !

(18-10-93 సాహితీగవాక్షం, ఆంధ్రప్రభ)

ఇక్బాల్ చంద్

నా రెక్కల ముడి విప్పు

చివరి పేజీని చూడనీవు?

మబ్బుల్లోంచి
నిదుర పీడకలల్లోంచి
మెత్తటి దేహం కింద ముళ్ళయి
నా బదలాయించలేని భయాలు బెదిరిస్తుంటాయి

ఊడలు దిగి కదల్నీకుండా కప్పేసుకుపోయి మెదడు
అనిశ్చితంగా అసంబద్ధంగా
తలపై మాడిన బల్బును మోస్తూ .....
నాకు దీపం కావాలి
నన్ను నేను వొల్చుకొని నిరాకారంగా ఎగిరిపోయి
ఆకాశాన్ని ముక్కలు ముక్కలుగా చింపి నమిలి మింగెయ్యటానికి
కొండగుర్తులు చెప్పే దారి దీపం కావాలి -
నాకు నిప్పు కావాలి
నగ్నంగా కాల్చేసుకొని బూడిదయి పోయి
మళ్ళీ మొదట్నించి నడక మొదలెట్టటానికి
సహజంగా వికసించిన పలకరింత కావాలి
మోసి మోసి అలసిపోయిన గుండె తడిని వదులుకోటానికి -
అది కావాలి అది కావాలి
ఇది కావాలి ఇది కావాలి
దాని కోసం దీని కోసం
అన్నిటి కంటే ముందు నా రెక్కల ముడి విప్పు

(7-6-1993, సాహిత్య వేదిక, ఆంధ్రజ్యోతి)

అఫ్సర్

ప్రేక్షకుడు కన్ను మూశాడు !

నా మొహానికి
రంగులు పూసే పచ్చ గదుల్లో విసిగిపోయాను
నాకళ్ళకీ కళ్ళకీ గోడకట్టే
మూడు తెరల 'ముచ్చట'తో అలసిపోయాను
నన్ను పలకని మాటల మధ్యా
నన్ను కట్టేసిన కదలికల మధ్యా
నేను 'మోస' పాత్రనయ్యాను
నాలుగు వీధులూ కలిసే చోట
ఇప్పుడు నా పాత్ర మారింది
ముసుగులేని రంగుల్లేని భాష నాది
మనిద్దరి మధ్యా
ఇక తెరలూ హంగూ ఆర్భాటాలూ అక్కర్లేదు
నన్ను నేను సరికొత్తగా వెతుక్కోడానికి
నన్ను నేను సరికొత్తగా ఆవిష్కరించుకోడానికి
గోడలు కూల్చేసిన చౌరస్తాలో నిలబడ్డాను
ఇప్పుడు
ఆడబోయే నాటకంలో నేను మరెవరో కాదు
నేను కచ్చితంగా నేనే
ఇప్పుడు
ఆడబోయే నాటకంలో నువ్వు మరెవరో కాదు
నువ్వు కచ్చితంగా నువ్వే
ఈ నాటకంలో నేను నటుణ్ణే కాదు
నువ్వు ప్రేక్షకుడివీ కాదు నీకు గొంతునిస్తున్నాను

నీకు కదలికనిస్తున్నాను నీకు ఆలోచన నిస్తున్నాను
ఇప్పుడు మన కళ్ళకి కట్టిన గంతలన్నీ తీసి
ఈ నాటకానికి చరమాంకం పాడదాం!
మన పాత్రల్ని మనమే న్యాయంగా ఆడదాం!

(దివికుమార్‌కీ, ఉదయ్‌కీ)

(3-1-93 ఆదివారం 'ఉదయం')

అడిగోపుల వెంకట రత్నమ్

ఇంద్ర ధనుస్సు ఏడో రంగు

స్పృశ్యాస్పృశ్యాల మధ్య దూరం వేల యోజనాలు
సుదీర్ఘ యాత్రలో మజిలీలు తప్ప మలుపుల్లేవు
నేను యిక్కడే నిలబడి వున్నాను
ఐనా ప్రయాణిస్తూనే వున్నాను !
ఎత్తులు, కుయుక్తులు, యుద్ధాలు, సంధి ఒప్పందాల మధ్య
పల్నాటి కోళ్లకు వారసులమై కొట్టుకు చస్తూ
ఆకాశ హర్మ్యాల కూలీలై రాళ్ళెత్తుతూనే వున్నాం !
కౌరవ సంతతి పరిరక్షణకై
ద్రౌపది వస్త్రాపహరణం జరుగుతూనే వుంది
అస్పృశ్యత, ఆకాశపు గూడు
నాకు సంక్రమించిన పిత్రార్జితం
వివస్త్రుల్ని చేసి మమ్ము తరుముతావు
పట్టువస్త్రాన్ని పట్టుకుని వెంటబడ్తావు
కప్పడానికన్నట్లు అందరూ భ్రమించాలి?
పరిశ్రమలు, పాడిపంటలు, నదీజలాలు ఏ ఒక్కటీ
నా చేయి మారకుండా నీ చేతికొచ్చిన ఉదాహరణలేవి?
భూమిని చీలుస్తూ నది
నదిని చీలుస్తూ నీటి కాకి
ఎవరు పరాజితులు
ఎవరు విజేతలు?
నేను నిన్ను పెంచుతుంటాను.
నా రక్తం నీ మృత్యు ముఖానికి ప్రాణదానం
నా కళ్ళు నీ కళ్ళకు ఉషోదయం

నా మూత్ర పిండం నీ బతుక్కి సుప్రభాతం
తీరా అవసరం తీరిపోయాక
అస్పృశ్యుడనై దిక్కుల కౌగిట్లోకి వెట్టబడతాను
అవసర నిమిత్తం కలుసుకున్న సమాంతర రేఖలం!
నేను సముద్రఘోష
నేను జలపాత హోరు
నిర్బంధం, నియంత్రణ పనిచేయవు
బంధించిన బస్తాల్లో
ఎర్ర మల్లెమొగ్గ విచ్చుకుంటున్న సందడి
విషాదం వర్ధిల్లనీ ఆనందం పుష్పిస్తుంది!

(ఆగస్ట్, 1994, 'మట్టి మౌనం వహించదు' కవితా సంకలనం నుంచి,

అఫ్సర్

మొదటి ప్రేమ పాఠం

కొందరొక అసంబద్ధ అబద్ధ నాటకంలో పాత్రగా మిగిలిపోలేను
తెల్ల చొక్కాల కింద దాక్కుని ఇంకా మానవతా గీతాల్ని గొణుక్కోలేను
నా వొంటి మీద క్షణాల ముల్లుతో చెక్కుతున్న ప్రతి శాసనం చూస్తున్నాను.
చూస్తున్నాను
చాపకింద నీళ్లల్లా పాక్కుంటూ వెళ్లిన వాళ్లం
ఇన్నాళ్లూ నేను నాకూ, నాకు నువ్వూ
మనిద్దరికీ ఊరేగింపులూ వుప్పెనలూ తెలీవు కదా
మనల్ని వస్త్రాలు కప్పుకున్నాయి
మనల్ని మాటలు కప్పుకున్నాయి
మనల్ని అక్షరాలు కప్పుకున్నాయి
ఇన్నాళ్లూ నీళ్లే కదా అనుకున్నాం
చాపకిందనే కదా వున్నాయనుకున్నాం
మనల్ని మనం రహస్యంగా
జలసమాధి చేసుకుంటో
జెండాల్ని ఆకాశంలోకి ఎగరేస్తూ వుండిపోయాం
మన చాపల్నీ
మనల్నీ మన గదుల్నీ ముంచెత్తి
మనల్నిలా వీధులపాలు చేస్తాయనుకోలేదు
మనల్నిలా పై వొంటిమీద అంగీలేకుండా నిలబెడ్తాయనుకోలేదు
చాపకింద నీళ్లే కదా అనుకున్నాం
ఇంకెలాగూ రోడ్డెక్కాం కాబట్టి
ఇప్పుడైనా రహస్యాలు విప్పేద్దాం
ఇంకెలాగూ లోపల్లోపల దాక్కుని

సణుక్కుంటూ వుండలేం కాబట్టి
ఇప్పుడైనా మాటల్ని మాటలుగా
గోడమీది నినాదంలా
స్పష్టంగా పలకడం నేర్చుకుందాం.

* * *

నా మొదటి పాఠం ప్రేమ గురించి
అందరూ ప్రేమ గురించే కదా
మళ్లీ మళ్లీ మళ్లీ మాట్లాడున్నారు.
కూలిన ఆత్మ గోపురాల శిథిలాల మీద నిలబడి
అందరూ ప్రేమ గురించే కదా
బద్దలవ్వని కుండల్ని సవరించుకుంటో మాట్లాడున్నారు
కత్తిపోట్ల కింద తుపాకుల కింద బాంబుల కింద
నెత్తుటి ముద్దల కింద తెగిపడిన ప్రతి శరీరాంగం కింద
కొసరి కొసరి వర్ధించుకున్న ప్రేమ గురించే కదా!
రక్తాన్ని పెరుగులా కలుపుకొని
వొకళ్ల కొకళ్లం కడుపారా ఎంగిలి చేసుకున్న ప్రేమ గురించే కదా!
తల్లి పాలకీ, నది నీళ్లకీ, జులాయి గాలికీ
కనిపించని, కనిపించే ప్రతిదానికీ
జంధ్యం కట్టి రక్తనమస్కారాలు చేయించాం కదా!

వొరేయ్ కవీ
ప్రేమలో ఈ నెత్తురేమిటి?
అని నా తెల్ల పాలకులు
(పాలకులు అచ్చు తప్పుకాదు పాతకులు అసలు తప్పు)
గర్జిస్తున్నారా?
నేను బానిసని దొరా! ఇది బానిస ప్రేమ దొరా!
బానిస ప్రేమ ఎలా వుంటుందో నీకు తెలీదూ,

* * *

పుట్టే పుట్టగానే వెలివేయబడ్డవాణ్ని
పుట్టే పుట్టగానే
ఈ భూమిని మలినం చేసినవాణ్ని
నాకంటూ గుప్పెడు భూమిలేనివాణ్ని
ఏ దేవుడైనా ఏ ప్రవక్తయినా
నాకు ఆకాశాలు రాసిచ్చాడు తప్ప
గుప్పెడైనా భూమి ఇవ్వలేదు కదా!
మీరు చెప్పిన ఆత్మ పాఠాలో
ఆకాశం పాఠాలో శ్రోతలా వినడం తప్ప
నేనేం చేశానని?
దేహం నీటిబుడగ అన్న మీరే
నా దేహం వెనక ముళ్లకంప పెట్టి
నా అడుగులన్నీ తుడిచేశారేం?
ఇవాళ నేను ప్రేమ గురించో, కరుణ గురించో
మనిషి గురించో మాట్లాడబోతే
నా రంగు నాకు చూపించారేం?
ఒకే అంకంలో రెండు పాత్రలా?
నేను దేహాన్ని గురించి చెప్పబోతే
మీరు ఆత్మసంగతి విప్పుతారు
నేను ఆత్మగురించి విప్పబోతే
మీరు దేహాన్ని గురించి చెబ్తారు.
ఈ అపంబద్ధ అబద్ధ వాటకంలో
నేనేమిటి? నేనెవర్ని?
నా పాత్రనివరో పోషించాలి?

నా మొదటి పాఠం ప్రేమ గురించి
నా ద్వేషం గురించి వా గురించి
ఎవరూ పోషించలేని నా పాత్ర గురించి

నన్నురాయిని చేసి
నా నుదుట శాసనాలు రాసిన వాళ్ల గురించి
నా నరాల్ని తడి వస్త్రంగా ధరించి
మడి కట్టినవాళ్ల గురించి
నా చెమటని తాగి తేన్చి
నా రక్తానికి మైలనంటించిన వాళ్ల గురించి !

ఎవర్నో వొహార్ని
ద్వేషిస్తే తప్ప ఎవర్నీ ప్రేమించలేవని
నా మొదటి పాఠం!

(20, ఫిబ్రవరి 1994 ఆదివారం ఆంధ్రజ్యోతి)

యాకూబ్

కొనసాగిక

ఇక ఇక్కడ్నుంచి ఒక నమ్మకంతో ప్రయాణం మొదలెడతాను.
ఒక విశ్వాసాన్ని వస్త్రంగా ధరించి
అన్ని కాలాల కలతల వెతల ఒడుదుడుకుల్నించి రక్షించుకుంటాను.
ప్రతి వీధిలోనూ నీకు నేను ఎదురవుతాను
ప్రతి గుమ్మం ముందు నా ముఖమే కన్పిస్తుంది
నేనే వేన వేల ముఖాలుగా పరివర్తనం చెంది
ఒక విశ్వాస ప్రపంచంగా నిదురలేస్తాను.

ప్రతిసారీ దుఃఖించబోతాను
అప్పుడు గమ్యమే నిలదీస్తుంది.
నా అచేతనాల అవిశ్వాసాల అశాంతుల లోకంలోని
మళ్ళీ మళ్ళీ కొత్త ఆకాశం కిందకు చేరుస్తుంది.
నన్నెవరూ దొంగిలించకుండా
నన్నెవరూ దొంగచాటుని కూల్చేయకుండా
నా దారిలో నా అడుగుల్ని నానుంచి దూరం చేయకుండా
నా నిరంతర తపనను ఎవరూ అవహేళన చేయకుండా
ఇక కాలమే బాధ్యత వహిస్తుంది.

ఒక రాత్రి నన్ను పునీతుడ్ని చేస్తుంది.
ఒక పగలు నా సహనాన్ని పరీక్షిస్తుంది.
నా కాలం ముందు నేనొక పనిముట్టునైపోతాను
నా అనుభవాల ముందు చిన్నపిల్లాడినై పోతాను
ఆకలి నా పరోక్ష గురువు.

ఏకలవ్యుడినై ఒక్కడినే కాల పరీక్షల్ని తట్టుకుంటాను.

ఎవరి కోనమో నా భవిష్యత్తు వేలు తెగ్గొట్టుకోలేను.
నేను బలహీనుడ్ని కాదు
ఏ ప్రశ్నా నా ముందు మనలేదు.
అన్ని సమాధానాలూ నేనే
నేనొక కొత్త జీవశక్తిని రూపొందించాను.
నేనొక జీవన విధానాన్ని ఆపాదించుకున్నాను
నేను చీకటిని భరించి వెలుగును పట్టుకున్నాను
కాలాన్ని అర్థం చేసుకున్నవాణ్ని నేను
కాలనాళికను నేను
శతాబ్దాలు నన్ను దాటుకుంటూ వెళ్లిపోయాక
అందరిముందూ మనిషిగా ప్రత్యక్షమవుతాను.
నేను స్వేచ్ఛను శ్వాసిస్తున్నవాణ్ని
నా మతం మానవమతం
ఎవరు బంధించినా స్వేచ్ఛనే నినదిస్తాన్నేను
ఈ మట్టిని 'కన్నతల్లీ' అని గొంతెత్తి పిలిచినవాణ్ని
నా జీవన పుష్పానికి ఈ మట్టి రేణువుల్ని పుప్పొడిగా అద్దినవాణ్ని
ఈ మట్టిలో పార్లాడి పార్లాడి
గుండెలోకి ఒంపుకున్నవాన్ని
పుట్టుమచ్చ నా అస్తిత్వం కాదు
ఈ మట్టి నుంచి నన్ను వేరు చేసినప్పుడల్లా
ప్రతి గుండె మీదా మట్టిలా పుష్పిస్తాను

(1992 డిశంబర్ 6 పరిణామాల తర్వాత)

(జూన్, జూలై 1993, అరుణతార)

అబ్బాస్

నెత్తుటి అంకం

నేప్పుడంతా పుట్టుమచ్చల ప్రస్తావన
ఎన్నాళ్ళకు వా మొహాన్ని
నాకు అద్దంలో చూపించారు!
ఎంత భయోద్విగ్నమో!?

అంతా ఒక విషాదన్వప్నం
నిద్ర లేచాక వెక్కిళ్ళూ
చెంపలపై రెండు కన్నీటి చారికలూ తప్ప

ఇక్కడేం బావుకున్నాననీ రభస?
ఈ మట్టిలో నేనూ ఓ మొక్కై మొలిచానే!
నుదుటిపై మచ్చ తప్ప బొట్టు లేనివాణ్ణి
రేపటి మీద అధికారం లేనివాణ్ణి

ఇదంతా తూనీగలు రెక్కలు కాల్చుకునే కాలం
నా ఉనికిని రంగుల్లో చూపించలేను
భద్రత క్షీణించాక బంధాలు పెంచుకోలేను

ఇక నన్ను నేనే హత్తుకుంటాను
నిన్నటి శిథిలాల్లోంచి వా పనిముట్లూ
ఇంకా కాస్త కింద ఓ కత్తి .....
అవును,
ఇప్పుడు నా పుట్టుమచ్చను పెకలిస్తాను

(17-4-94, ఆదివారం ఆంధ్రజ్యోతి)

టి. అంజయ్య

చాటింపు

మా తాతల బాకీలకు తాకట్టయినోళ్ళం
మీ భూమిని నాగళ్ళై దున్నినోళ్ళం
మీ పొలాలకు కాలవలై పాకినోళ్ళం
మీ పొలాల్లో నాటేసి, కలుపు దీసి, వరి కోసినోళ్ళం
మమ్మల్ని మీ పొలాల్లో పరిగేరు కోనియ్యరా?
నోట్లోకి నూకలు లేని వాళ్ళం
మమ్మల్ని కల్లం నూక్కోనియ్యరా?
కనిపిస్తూనే వుంది, ఏరుకునే పరిగెను కూడా
వారి భవిష్యత్తుకు జమకట్టి
మీ వాళ్ళతో పోటీలకు దండలు వేయించుకోవాలనే ఆరాటం,
మేం నీళ్ళలాంటి వాళ్ళం,
మమ్మల్ని నీళ్ళలాగా వాడుకోకండి.
'భూమి' కంటే 'నీళ్ళు' మూడు రెట్లెక్కువని మాకు తెలుసు
మా చెమటని ఉప్పుగా మార్చుకున్నామే గానీ,
మీ ఉప్పు మేమేనాడూ తినలేదు.
రాత్రంతా మోటలు కొడుతూ,
మా బతుకులను పాటలతో తెల్లార్చుకున్నాం
మాకు ఏటి కేతం బెట్టే సత్తా ఉంది
మాలో సముద్రమంత శక్తి వుందనడానికి నిదర్శనం,
మా రక్తం మరిగినపుడు చిందిన చెమట రుచి చాలదా?
మా అడవాళ్ళు మీ ముందు
చెప్పులు చేతబట్టుకుని నడవాలా?

చర్మం వొలిచి చెప్పులు కుట్టడమే కాదు
డొక్కచీల్చి, ఢోలు కొట్టేది మేమే,
మేమెంత వెనకబడ్డ వాళ్ళమైనా
మేం ముందుంటేనే
మీ పెళ్లిళ్లు ఊరేగించ బడతాయి.
మీ శవాలు ఊరవతల బడతాయి.

(జూన్ 1994 ప్రజాసాహితి)

పి.సి. రాములు

యాదుంచుకోండ్రి ...

ఓ! గట్ల గుడ్లు దెరిసి సిత్రంగ నగుతరేంది.....?
గూనపెంకు లెక్క గొడ్తున్నం లే .....!
సుక్క పొడ్వంగ లేసి ఇల్లిల్లూ దిరిగి జమేసిన
మీ మైల బట్టల మూటల్ని మోసి మోసి
మా ఎన్ను పూస కాల్చిన సలాకలెక్క జివ్వునంగిపొయినంక
మీ లెక్క నిటారుగ నడిస్తందుక్కు మాకెన్నెవికేడుంది.... బాంచెన్ .....
మా పిల్లా జెల్లా ముసలీ ముతకా యింటిల్లిపాదీ
సాకరేవునే బత్కుదెరువుగా నమ్ముకున్నాల్లం
మా పెయ్యిమీద పెట్టిన సెమట నవుడుతో
పొత్తిగుడ్డల్కాన్నుంచి కాటిక్కాళ్ళు సాపినోల్ల పీతిగుడ్డల్దాకా
సీరపేన్లువడ్డ మీ అంటుముట్టు మైల్నంతా సాపుజేసి, సలవజేసి
నీరుకాయ గుడ్డపేగ్గునుక గతిలేనోల్లం
మీ బారసాల్లకీ పెళ్ళిల్లకీ పండ్గలకీ పబ్బాలకీ
మా బొక్కల సున్నంతో మీ యిండ్ల కెల్ల ఏపి తెల్ల మొగాలతో మిగిలేటోల్లం
దెవసాలకి మీ తీరొక్క జాతర్లకీ
మా చేతుల్ని దివిటీలుగా, మా నెత్తుల్ని పెట్రోమాక్సు లైట్లుగా ఎల్గించి
మీ సకల సంబరాలకీ పెటాదిమ్మెలమై మోగెటోల్లం
మీ సవారీ కచ్చులం ముంగట
కుక్కతీర్గ ఉరికురికి కాళ్ళు గుంజి బొక్కబోర్లాపడి
సెర్నాకోల దెబ్బలుతిని గొల్లు గొల్లునేడ్వడందప్ప
పల్లెత్తుమాట బదుల్జెప్పినాం వాయ్నా .....

అంబటేలకో ..... మా పటేలకో.....
మా కడుపాకలిగ్గింత సంకటి ముద్దకొస్తె

"యింటింటి ముద్దలు మింగెటోల్లకొక్కింటిదేం రుచిస్తదే' అంటా
పెట్టే అయింత బువ్వలో నుక కోతపెట్టి
మమ్ల మలమల మాడ్చింద్రు గదమ్మా!
పెంగ సూపుల సోకుదొరలంతా, మా పిల్లలు రాంగపోంగ
"నీ యవ్వ కూతకచ్చిన పెట్టలెక్క పిటపిటలాడ్తన్నవే పోరీ
మస్తుమిడిసిపడ్తన్నవే మైసీ ..... మాపానం గుంజేస్తన్నవే ఎల్లీ" అంటూ
పరాశికాలాడ్తా ..... సతాయించి ..... సతాయించి ..... సత్తెనాశ్జేసింద్రు!
దున్నెతందుకు సారెడు పేను పేల్కె లేనోల్లం
కట్టెతందుకు జానెడు గుర్జపేగు కరువై నోల్లం
ఔగనీ ..... మాకినామనిచ్చిన బంచరాయి పొరుక
గానంవోస్తందుకేనా ..... చెప్పుండ్రి నిజంగా !
కులంకగ్గితగల ..... కాలంతోటి వృత్తులన్నీ మారిపోతన్నా
మారన్ది మాత్రం గీ మా కులకశిపాక్కటేనాయె
గదేమంటే..... "పదివినోడికన్న సాకలోడెమిన్న" అని
మమ్లనొక్కసారిగా గగనానికెత్తి కుదేస్తిరి గాద్దరా.....?
మీ పెళ్ళిల్లకి పాలువోస్తం ..... పతానమ్మాటల్మోస్తం
మీ యింట్లకచ్చిన కొత్తకోడలు నికార్పయిన కన్నెపునో కాదో
దొరసానికి నెలదప్పిందో లేదో మేమే తేలుస్తంది
మీ మైల్నంతా సాపుజేసి మల్లెపూల్లెక్క తీర్చే మేం
ముట్టుకుంటే మీరు మైలపడిపోరూ బాంచెన్ .....!!
ఔ! మాచేత్తో తాలిముద్ద తినిపిస్తే
మీ పిల్లల్కి పిల్కపల్కులొస్తయంటగదా.... గదెట్లనోమల్ల
దోబిఘాట్లు గట్టిస్తం ..... యిస్త్రిపెట్టి లోనిప్పిస్తమన్నెప్పి
మా కాళ్ళువట్కొని ఓట్లడుక్కున్నాలంతా
ఓట్లయినంక మాన్నోల్లల్లో మన్ను జల్లి లావతా అయింద్రు
జెండాలు మారివా .....సర్కార్లు మారివా

మా బత్కు గొర్రెతోక బెత్తెడేనాయె
మా కట్టాలనోల్లు జూసిండ్రు నాయ్నా .....
గట్లెందుకని.....మా కడుపుల మండి లొల్లిజేస్తే
సీటిమీద సీటిగొట్టి లాటీవిరగ్గొట్టి
అగమాగంజేసి మా బత్కులల్ల కటకటాల్ని నాట్తాండ్రు
గిదెక్కడ న్యాయమయ్యానంటే.....ఏకంగ ఎన్‌కౌంటరై పోతావంటాండ్రు
మా బత్కు బెగ్గంపాడాయె మా గోస గాలిలగలిసి పాయె
నగుతురు ....నాయ్నా....నగుతరు
మమ్లనెన్నడైనా యిజ్జతున్న మనుషులుగా జూసిండ్రా
నెత్తి మాసిన నెరిత్రయీనులంగదా!
ఔ! మేం సాకలోల్లమే.....సుద్దలోల్లమే.....దళితులమే .....
ఇగో ..... గిప్పుడే జెప్తున్నం .....బగ్గ యాదుంచుకోండ్రి
గుడ్డలుత్కుడే కాదు మీ యీపులుత్కుడమూ మాకెరికెనె
మీ శానితనమిగ నద్వది .....
మీ సన్నద్దుల బద్దుమాసితనమిగ చెరువుల గలుస్తది

(జనవరి, ఫిబ్రవరి 1994 'తెలుపు' మాసపత్రిక నుంచి)

శిఖామణి

కాదే 'అనుద్ధ' మానవుడు

రేయ్! లంజాకొడకా

ఏం! సిగ్గుగా వుందా?
అసహ్యంగా వుందా
రోతగా వుందా
కడుపులో చెయ్యి పెట్టి దేవినట్టుందా
వాంతి వచ్చేటట్టు వుందా
వాణ్ణి కన్న వేరానికి
నిన్ను తూలనాడుతున్నాను క్షమించు తల్లీ!
మగవాడ్ని తిట్టడానిక్కూడా
ఆడదాన్ని అడ్డుపెట్టుకునే
దౌర్భాగ్య దేశం నాది!!
ఇంకా ముక్కుపచ్చలారని ఆడపిల్లల్నీ
ఇంకా పురిటి వాసనైనాపోని పచ్చి బాలింతల్నీ
క్రూరంగా అనుభవించి
పైశాచికంగా వాళ్ల మర్మాంగాల్లో
కొయ్యకర్రల్నీ ఖాళీ బీరుసీసాల్నీ జొనిపి
దారుణాతి దారుణంగా హత్య చేసే ఈ దేశంలో
పండు వెన్నెల్లాంటి - నిండు గోదారిలాంటి యవ్వనాల్ని
సతిపేర చితిమంటలకు
ఆహుతి చేసే పవిత్ర 'ఖర్మ' భూమిలో
నా కడుపున కాసిన కాయకు
నువ్వే తండ్రివంటూ ఒక మగవాడి ఇంటిముందు
ఒక అభినవ శకుంతల ధర్నా చేసిన ఈ వేదభూమిలో
పయ్యెదలను కప్పుకోవలసిన జిలుగు పైటలతో

కట్నం ఇచ్చుకోలేని కాన్పూరు కన్యలు
కంఠాలకు ఉచ్చు బిగించుకొని
కన్నెచావులు చచ్చిన ఈ దేశంలో
లంజాకొడకా అనే పదం
చాలా చిన్నదే అవుతుంది
ఆకలేసి విశ్వామిత్రుడు
చచ్చిన కుక్కమాంసం తినబోయాడని
పురాణాలు ఘోషిస్తున్నాయి
ఇంకా ఈ భూగోళం మీద
అనేక దేశాలు అనేక జాతులు
ఆవుల్నీ మేకల్నీ తింటున్నాయి
గుర్రాల్నీ గాడిదల్నీ తింటున్నాయి
పందులనూ పందికొక్కులనూ తింటున్నాయి
ఒంటెల్నీ పాముల్నీ
కప్పల్నీ, కుక్కల్నీ కూడా తింటున్నాయి
కానీ ఈ భూగోళం మీద మొట్టమొదటిసారిగా
ఈ దేశంలో
మనిషి మరొక మనిషి మలాన్ని తిన్నాడు
ఏం సిగ్గుగా వుందా?
.....
ఒరే! నిన్ను లంజాకొడకా అనడానిక్కూడా
నాకు సిగ్గుగా వుంది
ఈ లోకంలో మనిషి రక్తం తాగిన
నరరూప రాక్షసులున్నారు
మనిషి మాంసం తినే 'మేన్ ఈటర్స్' ఉన్నారు
కానీ మనిషి మలాన్ని
మరొక మనిషి చేత తినిపించిన
మనుషులు మాత్రం లేరు.

నీకు చదువూ సంస్కారమూ
నీ సాహిత్య భాషా అశ్లీలమూ
అన్నీ అడ్డొస్తున్నాయవునా?
చదవడానికి యిబ్బందిగా వుందవునా?
ఒరే! నీకు చదవడానికే అంత యిబ్బందిగా వుంటే
రెండు కళ్లూ - రెండు కాళ్లూ
రెండు చెవులూ - రెండు చేతులూ
ఒక ముక్కూ - మనసూ కలిగిన
అచ్చం నీలాగా - నీలాగా
ఒక అమ్మా బాబుకు పుట్టిన మనిషి
అక్షరాలా మనిషేరా
వాడు మలం తిన్నాడు
ఒరేయ్ నీ ఇరవై ఒకటో శతాబ్దం
అదిమ యుగం నాటి
అజ్ఞానపు గుహలో దాక్కుందా?
నీ అణుబాంబు
గాలితీసిన బుడగలా తుస్సుమందా?
నీ స్టార్‌వార్స్
రాలిపడిన పుల్కాల్లా నేలకొరిగాయా?
చేతులెత్తి మొక్కే
నీ దేవుడికి ఎయిడ్స్ సోకిందా?
ఇప్పుడు చెప్పరా
మళ్లీ మళ్లీ అడుగుతున్నాను
ఒరే! లంజాకొడకా
నీ పేరు మనిషా?
(కర్ణాటకలో దేవాలయ ప్రవేశం చేసిన హరిజనుడి చేత మలం తినిపించారన్న వార్త చదివి)

(రచన బులెటిన్: 2, రాజమండ్రి 1989)

ఎన్.ఆర్. వెంకటేశం

మూడో కన్ను

అప్పుడు

నువ్వు సూర్యుని కంట పడకుండా తిరుగుతుంటే
నేను చండ కిరణాల్లో మండేవాణ్ణి
నీకు వాన చిటపటలు దూరంగా వినిపించేవి
నేను చినుకుల్లో కూడా చెమటలు కక్కేవాణ్ణి
నువ్వు చలిచేతికి చిక్కకుండా తిరుగగలిగేవాడివి
గడ్డకట్టించే చల్లకూడ నా రక్తం ఆవిరౌతుండేది
నా శక్తిని నరాల్లోంచి లాగి
నీ కోసం సుఖాలను సృష్టించేవాణ్ణి
చెమటోడ్చే నా రెక్కలే
భోగాల ఆకాశంలో యథేచ్ఛగా ఎగరటానికి
నీకు రెక్కలయ్యేవి
ఇప్పుడు
కాలజ్ఞానం నా కళ్ళల్లోని వెలుగయ్యింది
నీకు గుండెదడ పుట్టించే ప్రశ్నలు
నా చూపుల్లో వ్రేలాడుతున్నాయి
తరతరాల నాటి నా సహనంలోంచి
మూడోకన్ను విచ్చుకుంటున్నది.

(31-7-1994 ఆదివారం ఆంధ్రజ్యోతి)

కలేకూరి ప్రసాద్

రోడ్డు

రోడ్డూ వాలాగే దళిత
గుండెలమీది పాదముద్రల్ని తడుముకుంటూ
గతంలోకి ప్రవహిస్తుంది .....
భయమో సందేహమో
ఎదమీటిన కనురెప్పల
జలతరంగణీ రాగమో!
గుండెమీద చెవిపెట్టి వింటే
తారు ఉడుకుతున్న
కుతకుత చప్పుడు
రోడ్డూ వాలాగే దళిత.
పాలంగట్ల అలజడి వింటే
తల్లిపేగై చలించిపోతుంది.
మొరటుపాదాల కరాళ నృత్యానికి
ఉగ్రమూర్తయి జ్వలించి పోతుంది.
తనను తాను చెప్పుకోవాలని
తనను తాను నిలుపుకోవాలని
నేలనేలంతా పాటగా
పరచుకోవాలని
తపించిపోతుంది.
అవునూ
అడుగడుగువా
శిలువలు పాతుకున్న
రాదారి పాటవెప్పుడైనా విన్నావా?
దారులన్నీ పెనవేసుకుపోయి

రోడ్ల ఊరేగింపైన సందోహాన్ని
ఎప్పుడైనా చూశావా?
దాడికి గురైన శవమై
అర్ధం తిరిగి
మొత్తం చలనాన్నే స్తంభింపజేసిన
రోడ్డు ధిక్కార గీతంలో
ఎప్పుడైనా గొంతు కలిపావా?
ఈ రోడ్డు మీదుగా
ఒకసారి మా ఊరికి రా

(ఆదివారం ఆంధ్రజ్యోతి)

కృపా

భైరవగీతం

అస్పృశ్యత రాత్రిలోకి ప్రవహిస్తుంది
నన్ను లాకప్ చేస్తుంది
నాకు నేనే పనిముట్టునై
ఈ ఇరుకు గనుల్ని పగలగొడతాను
ఒంటరితనాన్ని సమూహం మధ్య
కసిగా పాతేస్తాను
ఆవులించిన ఆరుబయలు చీకటిలో సాగిపోతుంటాను
మృగాలు మళ్ళీ మరోజైలు సిద్ధం చేస్తాయి
గుడిసెల్లో చమురు దీపాలు
నీడల్ని ఒణికిస్తుంటాయి
పక్షులు వేకువని పాడతాయి
నేను విముక్తినీ, భూపాలాన్నీ
బిగ్గరగా పాడతాను

(సెప్టెంబరు 1991, ప్రజాసాహితి)



మద్దూరి నాగేష్‌బాబు

పంచమ గీతం

కళ్లున్నాయా -
అవహేళనల అతిశీతలత్వంలో
ఎక్కడ అడుగేస్తే ఏమౌతుందోనని
భయం చేతికర్రవూతంతో
కన్నీరోడుతూ నడుస్తున్న -
ఈ నేలకి ఐదోతనాన్నిచ్చిన
బతికున్న శవాల్ని చూపిస్తా
రా -
చెవులున్నాయా -
సమూహంలో ఏకాకితనపు ముళ్లకిరీటాల్ని మోస్తున్న
ఆకాశపు అంగలార్పు గీతాన్ని వినిపిస్తా
రా -
ఆఘ్రాణించగలిగితే
మీ పరుపుల మీద తమ నెత్తుటి అత్తర్లుజల్లి
ఆకలిదప్పుల్తో, అవమానాల్తో కన్నుమీద కునుకెరుగని
వేదకాలాల్నుండీ కాలుతూనేవున్న పంచమాగ్ని పరిమళాలు అందిస్తా
రా -
రుచి చూడగలిగితే గొడ్లల్లే బలిసిన మీ కోసం
గొడ్లల్లే శాకిరిచేసి చేసి
తింటానికేమీలేక నిట్టూర్పులతో పొట్టనింపుకునే
నా జాతి గాలిబువ్వని తినిపిస్తా
రా -
పట్టుకోగలిగితే నిన్నటిదాకా అలలు తన్నినా ఉమ్మినా
భరించీ భరించీ నేడు తెగించి సముద్రం మీద తిరగబడుతున్న
ఇనుక సముద్రాన్ని చేతికిస్తా
రా!
రారా -

(జూలై 1993, 'సంతకాలు' కవితాసంచిక-3)

మహమ్మదాలి

రొండి!

గంగ సాచ్చిగా
పంచాయితి ఎలచ్చన్లలో
పెద్ది రెడ్డి మా మంచాలపై కూసుంటే
మా కడుపుబ్బిపోయింది
గంగునాయ్ని మా ముంతతో నీళ్ళు తాగితే
మా మనసంతా అయినయ్యే !
'మాలాటి మనుసులే మీరంటె'
మా జాతంతా మురిసిపోయింది!
వాల్ల పార్టీ తగాదాలలో మా పానాలడ్డేసి
ఇరుపార్టీ పెద్దల్ని బతికించుకున్నాం
ఏరు దాటినాక
మా గాలి తగిలిందని, మా బుజం రాసుకుందని
కారాలు నూరుకొనే కామందులేకమై
పార్టీలు కాసేపు పక్కనెట్టి, మా తలలు మొండేలుగా నరికేసి
గోతాల్లో కట్టి గంగకిస్తుంటే -
మాదిగోల్లకి మాల్లోల్లకి తగినపని జరిగిందని
కామందుల కాల్ల కాడ గునిసే ఎనకబడ్డ తరగతి ఈరులారా!
'పెద్దకులం' ఎండమాయికి బెమిసి
కూడు గుడ్డకు నవిసే శూరులారా!
మేమెంతో - రేపు మీరంతే ! వాళ్ళుదప్ప - వాళ్ళకందరంతె!
అందుకే
కులాలు ఇడిసి, మతాలు మరిసి
కూడులేని బీదజనం కూడి ఒక్కటైతే
కులపిచ్చి కూరాత్ముల, దనంకార ఈనాత్ముల, దురంకార దూరాత్ముల
బూతాపితం పేద్దాం
కల్లు తెరిసి కదిలిరాండి, నిజం ఎరిగి కలిసి రాండి

(అరుణతార)

దెంచనాల శ్రీనివాస్

వృధా

తుమ్మ జిగురు గదకు తోకలతో కుచ్చిన వేయి తేళ్ళు
పాము గుడ్ల సాన మోదుగు దొప్పలో కాగుతూ
పాల చేతులు నాగళ్ళు చెక్కుతూ
అన్నా వొదినల కాళ్లకింద చితికిన అనాథ బాల్యం

నువ్ తొలిచిన నందీశ్వరులను తలచుకొని లేపాక్షి బనవన్న లేచి పోతాడు
త్రాచుల్ని చంపే నీ నైపుణ్యాన్ని చూసి దేశ దేశాల కమెండోలు తలలు
దించుకుంటారు
కాలుతున్న గుడిసెల మధ్య దూకే నీ చాకచక్యాన్ని విని
ప్రపంచ పైరింజన్లన్నీ తగలబడి పోతాయి
నువ్ సృజించిన ఇళ్లూ, నాగళ్లూ, వెండి మొలతాళ్లూ, మట్టి గంగాళాలూ,
కట్టె శిల్పాలూ,
ఇత్తడి తాంబాళాలూ, ఇనప పనిముట్లూ, కళా జ్ఞానాల చరిత్ర చెరిపేస్తాయి

'తల్లీ నిన్ను దలంచితో నా పయనాన్ని ప్రారంభించిన వాడు
మా ముగ్గురికీ ఆహారంగా తన ప్రొటోప్లాజమ్‌ను పంచిన వాడు
మెట్ల వాంఛలు లేనివాడు
అర్పిసానే కాదు అతడు అర్పిస్తు

పాప పలకనంటోంది నీ 'ఖర్జూర ఫలములూ గణికుండు కొని తెచ్చి'
ఎవడు కుక్కుతున్నాడు మన కళ్లల్లో చెవుల్లో డిషేంటిన్నాలను
నీ బంగాళీ విద్య పీసీ సర్కార్ కూడా ప్రదర్శించబ్లేదు
ఎవడు నమిలి మింగుతున్నాడు ఆదివాసీ కల్చర్‌ను

బొట్టు పొగొట్టుకున్న పదేళ్ల బాలిక
కౌమారపు యువకుడు

జగత్తును వూదేసిన రాత్రి ప్రయాణం
యవ్వనం నగం సంపెంగ వానవా, నగం బూడిద వాసనా

మనిషికి పంజాలతికించిన గింజల లేమి
గుడంబాతో కోరలు మొలిచిన మనిషి
కట్టె చేతుల్లో దాని నల్ల మల్లెల కురులు
లాగులు మార్చుకున్న నేను

నిన్ను దహించిన నిజాయితీనే ధరించాను కానీ
దాన్కి దాని వాట్లేసి చెడిన చేతులు గుర్తుకొచ్చీ
నీ ఆశ్వరభశ్వరభ గుర్తుకొచ్చీ
నీకసలు నిప్పంటలేదంటుంది

మన దైవ ధిక్కారాన్ని అసంస్కృతిగా
మన దరిద్రాన్ని మహా క్రైమ్‌గా
మనల్ని గజ నేరస్తులుగా చూస్తున్న
ఈ భూమండలాన్ని ఎడం కాలుతో తంతున్నాను
అది పగిలి, అందు
నా భార్యా, నీ భార్యా బంధు మిత్రులూ
పకల లోక కుటుంబాలూ
సర్వ అస్తులూ
సమస్త మతాలూ, వాటి దంతపు దేవుళ్లూ
ముక్కలై, చెక్కలై, భస్మమై గాల్లో కలిసిపోవును
గుమస్తా తండ్రీ
దెంచవాల బ్రహ్మయ్యాచారీ
నా వాన్నలు వేల లక్షల కోట్లు

గాలి యంత్రపు సుడిగాలి మధ్యన చెమట సాగరంలోంచి
హఠాత్తుగా నా హస్తాల్లోకి వొరిగిపోతూ .....
ఖగోళాలు దాటిపోతూ .....

('గురి తప్పిన పద్యం' నుంచి)

భూజా

అనకార పురుషులు

తెలసిపోయిన వాళ్ళ బతుకు ముఖాలమీద
కాసింత నవ్వుల రంగునద్దుకుని
పగలంతా కష్టాల ముళ్ల కిరీటాల్ని ధరించిన దేవుళ్ళయి
అంగళ్లముందు ప్రత్యక్షమవుతారు.
హార్మోనియం పెట్టె అంగుళుల మీద యాచక రాగంలో ॰
నారదుడు ఆకలి బాధను పల్లవిస్తుండగా
సంజీవిని పర్వతాన్ని మోసిన చేతులు
దుకాణాల ముందు చాచిన క్షయ పాత్రలవుతాయి.
గేటు దగ్గర కాపలాకాసే గూర్ఖా
దేవుణ్ని మెడపట్టి అరటితొక్కలా రోడ్డుమీదకు విసుర్తాడు.
అర్ధనారీశ్వరుని అరమీసం మీద ఎవడో విసిరిన ఛలోక్తి
వాడి కర్ణ భేరిలో వాడి ముల్లయి దిగుతుంది
కత్తిని బుగ్గలపై పెళ్లి చుక్కలా అలంకరించుకొచ్చిన వాడు
కను కొలుకుల్లో మహా సముద్రాల్ని బంధించుకుని
కఠోర తపోముద్రలో మౌనిలా వుంటాడు
మంచు ఖడ్గాన్ని మస్తిష్కంలో దింపినట్టు
బిగించిన చర్మవాయిద్యంపై శబ్దాన్ని గీరుకుంటూ వచ్చినవాడు
ఛెర్నాకోలను ఝుళిపించి -
శరీరంపై ఘనీభవించిన రక్తపుటేరుల్ని సృష్టించుకుంటాడు.
సంక్రాంతి ఉదయాన్నే మంచుకింద కెరలెత్తే సన్నాయిపాటై వచ్చిన
పిడికెడు బియ్యానికే గంగిరెద్దయి
వీధివాకిట్లో మోకరిల్లుతాడు
సొరకాయ బుర్రలోంచి సంగీతాన్ని పలికించేవాడికి
చిట్టి చేతుల్లో చిడతలు సహవాయిద్యాలవుతాయి

బతుకంత విషాదాన్ని పాటగా ఆలపించే అంధుడు
చేతికర్రను దారిగా చేసుకుని
అనంతానంత నిశీధంలో శబ్దాల కళ్లు రిక్కించి పోతుంటాడు
పేవ్‌మెంట్లపై చేరిన రవివర్మలు
అరిగిన రంగు చాకీపీసుల్లోంచి ఏసుక్రీస్తులై జాలువారతారు
సాంబ్రాణి ధూపమై ఆవరించిన అల్లా
పావలా పైసలకే అందరికీ ముక్తియా చెబుతాడు.
ఆకలి వ్యూహాన్ని ఛేదించలేని ఎంకట్రావుడు
నాలుగుమెతుకుల కోసం నాలుగొందల గడపలముందు
విరామ చిహ్నాలెరగని వాక్ప్రవాహమై సాగిపోతాడు.
సంధ్యవేళకి దేవుళ్లంతా ఊరిచివరి బడిచెట్టుకింద
సగవే నిండిన కడుపులై, సమాధానం దొరకని జీవితాలై .....
"సంభవామి యుగే యుగే-"
ఇక ఉపేక్షించలేక
పాత అవతారాల్నీ ఆయుధాల్నీ విసర్జించి
కొత్త అవతారాల్నీ ఆయుధాల్నీ వెతుక్కుంటూ
కొత్త ఉదయం వైపుకి ప్రయాణమవుతారు".

(1994, ఆంధ్రజ్యోతి వారపత్రిక దీపావళి ప్రత్యేక సంచిక)

చెరుకు సుధాకర్

నెత్తుటి బొట్టు

ఒకడు కారంచేడు

ఒకడు నీరుకొండ
ఎందుకమ్మా! మన రక్తం కాల్వలై పారిన
హంతక గుండెలపై పడిపడీ ఏడుస్తావు
చేతులెత్తి అర్థిస్తావు
తోబుట్టో, తాళిబొట్టో, పేగుతెంచుకున్న కడుపుతీపో
పోగొట్టుకుంది ఏదైతేనేంగాని,
చెల్లీ! నాతల్లీ!
వాణ్ణెవన్నీ న్యాయంకావాలని అభ్యర్థించకు
తుంగలో శవాల్ని తొక్కిన వాళ్ళు
పిప్రా, బేల్చి, బోజ్‌పూర్, చుండూర్‌లో
ఎన్ని ముఖాలు తగిలించుకున్నా,
ఎన్ని జెండా కర్రల్ని వెంటేసుకున్నా ఒక్కరే తల్లీ!
శంబూకుడు, కోటేశు, ఆలీసమ్మ .....
మన తలల్ని అప్పుడప్పుడు కోటగుమ్మాలకు
కట్టకపోతే రెచ్చిపోతామని
శ్రీరాముడి సాక్షిగా వాడు నమ్ముతాడమ్మా!
వేటకొడవళ్ళ జడివాన ముగిశాక,
మన వాడవాడంతా నెత్తుటి చిత్తడయ్యాక
ఆ మృగం ఎవడ్ని అభయహస్త మడిగిందో తెలుసా అమ్మా!?
మృగానికి ధోకాలేదని, దాని గోళ్ళు తుడిచి
సాక్ష్యం మాయం చేసిన హంతక చక్రవర్తి
నీ కన్నీళ్ళు తుడుస్తూ అభయాభినయం చేస్తున్నాడు
ఎక్స్‌గ్రేషియా నోట్ల కట్టలతో నీ నిలువెత్తు కొడుకుని తూచి,

అనుబంధాల్ని కొలిచి చేతులు దులుపుకుంటాడు వాడు
నీతోపాటు వలవలా ఏడ్చి
టీ.వీ.లో, పేపర్లో ఫోటో అయి,
రేపటి ఓటు కోసం అర్రులు చాస్తుంటాడు
వాడు ఓట్ల కోసం తల్లి రొమ్ము చీల్చేరాక్షసుడు
ఒకింత మన రక్తం తొలకని
నూది మొనంత నేల చూపెట్టమ్మా
ఈ గుండె కోత మనకు మొదటిదీకాదు, చివరిదీకాదు
తరతరాలుగా మనం పోగొట్టుకున్న
నెత్తుటి శ్వాసల్ని గుండెనిండా పీల్చుకో
పిడికిలి బిగించి వేలను ముద్దాడిన వీరుల్ని తలుచుకో
జాలిజాలి అభ్యర్థనలు కాదింకా
నల్లని నిరసన జెండాలనెగరేయ్
గోడు గోడు ఏడ్పులు కాదింకా
తిరుగుబాటు వడగాడ్పుల్ని ఎగదోయ్
అట్టుడికిన నీ శరీరమంతా
అమ్ముల పొది కావాలి
నాగేటి చాళ్ళలో ఒలికిన నెత్తుటి బొట్లన్నీ
బిగి పిడికిళ్ళై మొలవాలి

(సెప్టెంబర్, 1991, ప్రజాసాహితి)

కలేకూరి ప్రసాద్

పిడికెడు ఆత్మగౌరవం కోసం ....

నేను ఎప్పుడు పుట్టానో తెలియదు గానీ
వేల ఏళ్ళక్రితం ఈ గడ్డమీదనే చంపబడ్డాను
'పునరపి మరణం పునరపి జననం'
నాకు కర్మ సిద్ధాంతం తెలియదుకానీ
మళ్ళీమళ్ళీ మరణించిన చోటనే పుడుతున్నాను
నా దేశం ఈ దేశంలో కరిగిపోయి
గంగా సింధూ మైదానమయ్యింది
నా కనుగుడ్లు కన్నీరై ద్రవిస్తే
ఈ దేశంలో జీవనదులు ప్రవహించాయి
నా సిరల నుండి జీవధాతువులు ప్రవిస్తే
ఈ దేశం సస్యశ్యామలమై సిరులు కురిసింది
త్రేతాయుగంలో నేను శంభూకుణ్ణి
ఇరవై రెండేళ్ళ క్రితం నా పేరు కంచికచర్ల కోటేశు
నా జన్మస్థలం కీలవేణ్మణి, కారంచేడు, నీరుకొండ
ఇప్పుడు కరుడుకట్టిన భూస్వామ్య క్రౌర్యం
నా గుండెల మీద నాగేటి కర్రులతో పచ్చబొడిసిన పేరు చుండూరు
ఇక చుండూరు నామవాచకం కాదు సర్వనామం
ఇప్పుడు ప్రతి గుండే ఒక చుండూరు, రగిలే రాచపుండూరు
నేను జన సమూహాల గాయాన్ని గాయాల సమూహాన్ని
తరతరాలుగా స్వతంత్రదేశంలో అస్వతంత్రుణ్ణి
అవమానాలకూ, అత్యాచారాలకూ, మానభంగాలకూ, చిత్రహింసలకూ గురై
పిడికెడు ఆత్మగౌరవం కోసం తలెత్తిన వాణ్ణి
ధనమదాంధ కులోన్మత్తుల రాజ్యంలో
బతకడమే ఒక నిరసనగా బతుకుతున్న వాణ్ణి

బతికేందుకు పదే పదే చస్తున్నవాణ్ణి
నన్ను బాధితుడని పిలువకండి
నేను అమరుణ్ణి, నేను అమరుణ్ణి, నేను అమరుణ్ణి!
లోకానికి సంపదల్ని మిగిల్చేందుకు క్షామాన్ని మింగిన
గరళ కంఠుణ్ణి నేను
శీర్షాసనం వేసిన సూర్యోదయాన్ని
నిటారుగా నిలబెట్టేందుకు
సూర్యుడి నెత్తిమీద యీడ్చితన్నిన వాణ్ణి
రగిలే గుండె కొలిమిలో నినాదాలు కురిపిస్తున్న వాణ్ణి
వాకు జాలిజాలి మాటలొద్దు కన్నీటి మూటలొద్దు
నేను బాధితుణ్ణి కాదు అమరుణ్ణి
ఎగిరే ధిక్కార పతాకాన్ని
నాకోసం కన్నీరు కార్చకండి
మీకు చేతనైతే
నన్ను నగరం నడిబొడ్డున ఖననం చేయండి
జీవన రవళిని వినిపించే వెదురువనాన్నయి వికసిస్తాను
వా శవాన్ని ఈ దేశం ముఖచిత్రంగా ముద్రించండి
చరిత్రపుటల్లోకి సుందర భవిష్యత్తునై పరివ్యాపిస్తాను
ఒక పెనుమంటల పెనుగులాటనై
మళ్ళీ మళ్ళీ ఈ దేశంలోనే ప్రభవిస్తాను.

(అరుణతార)

పి.సి. రాములు

అర్పించేటం

మధ్యాహ్నపు ఎర్రబెండ తెల్లమొగమేసి వెలతెలబోయింది
జడివాన జడుసుకుని ముడుచుకు పడుకుంది
ప్రకృతి ప్రకృతంతా గజ గజ వజ వజ వణికింది
ఔ! మేం కాటికాపరులం, తాలేలిల్లాయ్ గాళ్ళం
మీరూహించి ఆవాహన చేసిన క్షుద్రశక్తుల్ని
మా పిడికిట పుక్కిలించి గడగడ లాడించిన వాళ్ళం
లోకమంతా అమవసనిశిలో ఆదమరచి పేద దీర్తుంటే
అర్ధరాత్రి ప్రకృతివడిలో నిర్భయనిశాచరులమై
గరళాన్ని మా కంఠంలో నింపుకుని మీకు అమృత యుగస్మృతిని ధారపోశాం
ఊరునూడ్చి, పశుకళేబరాల నీడ్చిపారేసి. సాపుచేసి, ముస్తాబు చేసే
మమ్మల్ని
ఊరుని కంటికి రెప్పలా కాపు కాసే మమ్మల్ని
మీ తిరొక్క అవసరాలకీ జీహుజూర్లమైన మమ్మల్ని
ఊరవతలి గమిట్లోకే నెట్టేశారు గదా!
ఇప్పటికీ - కాఫీ హోటెల్లలో సత్తులోటాల్నెందుకు అలాగ్గా
దడుల్లో చెక్కి వుంచారో
సలవబట్టలేసుకుంటే - వెకిలిగా నకిలిస్తూ వెక్కిరింపులు కొక్కిరింపులెందు
కెదురవుతున్నాయో....
కిరాయిల్లడిగితే - వెజా..... నాన్‌వెజా అంటూనే మాటల్లో
నా వర్ణాన్ని తెలునుకుని పెదవెందుకు విరుస్తున్నారో .....
'మానవత్వం' గురించి ప్రవచనాలు వల్లించే 'మహామేధావులారా'
సెలవిస్తారా ?
అన్యాయాన్ని ప్రశ్నించినప్పుడల్లా, మీ అఘాయిత్యాన్ని ఎదిరించినప్పుడల్లా
చొప్ప గూళ్ళలో దొరికింది మా శవాలే

పాడుబావుల్లో తేలింది మా శవాలే
పంటకాల్వల్లో ఊల బెండులై ప్రవహించిందీ మా శవాలే!
మట్టిని చిలికి పంటను తీసి మీ గాదెలు నింపిన మేం
చివరికి పరిగె చేలో దిష్టిబొమ్మలమై పోయాం
మా చర్మాన్ని వొలిచి మీకు చెప్పులు కుట్టిస్తున్నాం గాని
'నాలుగు పాదాల' నడిచే మీ 'ధర్మాన్ని' గుర్తించలేక పోయాం
తెగిన మీ ఎదురోళ్ళనూ ఊడిన ఉంగటాలనూ అతికిస్తున్నాం గానీ
చిట్లిన మా బతుకును మాత్రం అతికించుకోలేకపోతున్నాం.
ఈ దేశపు నగ్నదృశ్యం కులం - ఈ దేశపు గుండె చీడ కులం
చీడని సమూలంగా సంహరిస్తానంటే నా పుట్టుకనే గుర్తుచేసి
మీ చూపుడు వేలితో నా 'పుట్టుమచ్చ' నే తడుముతున్నారు.
అసలు - ఈ దేశం మాదేనా? ఈ ఆకాశం ..... ఈ నేలా మావేనా?
మా కోపమేనా ... మమ్మల్నుద్ధరించడానికేనా మీ త్యాగాలు
పురివిప్పుతున్నాయి

తుప్పల్లో చిదుగులై పోతున్న దెవరు?
చిదుగుల చితిలో చలికాచుకుంటున్నదెవరు?
ఇన్నాళ్ళు - మమ్మల్నీ, మా ఆలోచనల్నీ, మా త్యాగాల్నీ పరాయికరించి
చరిత్రను మీ కనుగుణంగా చిత్రించుకుంటున్న మహాపాధ్యాయులారా
ఏడు నిలువుల కులం గోతిలోంచి అతికష్టంగానైనా
బయటపడాలనే మా తలంపును కొనగోట గిల్లేసే మీ కూటనీతిక మానండి.

* * *

ఇన్నాళ్ళు - మేం శ్రోతలం గాబట్టే మీ స్తోత్రాలు సాగాయి
ఇన్నాళ్ళు - మేం పెదవి విప్పని పాఠకులం గాబట్టే
మీ రాతలకి వాతలు బడకుండా పోయాయి
ఇన్నాళ్ళు - మేం ప్రేక్షకులం గాబట్టే మీ రంగుల రంగస్థల నటన
రక్తికట్టింది

మా బాధనీ బతుకునీ మీరూహించి చెబుతుంటే
పల్లెత్తు మాట బదులనలేక పోయాం మేం

మీ రచనలో నకిలీతనం నర్తిస్తున్నదని అభిశంసించలేకపోయాం
చాలు చాలిక మీమేలు చాలు చాలు ..... మీ కపటప్రేమ చాలు
మా కష్టాల్నీ కడగండ్లనీ కర్తవ్యాల్నీ మేమే కలబోసుకుంటాం
కాలంచెల్లిన మీ తూనికరాళ్ళూ కొలబద్దలూ మా కవసరం లేదు.
మీ కంటి తుడుపు గుర్తింపులూ, మొసలి కన్నీళ్ళ ప్రశంసలూ
మాకక్కరలేదు.
మా రంగస్థలాన్ని దురాక్రమించిన దుండగుల్నిక పట్టి దండిస్తం.
మా అస్తిత్వాన్ని నిరూపించుకుంటాం, మా ఉనికిని ఉద్ఘోషింప చేస్తాం
మూతికి ముంతలూ మొలకి తాటాకులూ కట్టడం నించి
నాల్కల్ని తెగ్గోసి చెవుల్లో సీసం పోయడం నించి
కళ్ళల్లో కాల్చిన సలాకలు గుచ్చి, శిశ్నాల్ని ఉత్తరించడించడం నించి
చెట్లకు కట్టేసి సజీవ దహనం గావించిన
మీ దమన సంస్కార సనాతన ధర్మాన్నించి
తల నరకడం నించి .....బొటన వేలు తుంచడం నించి
ఏకంగా ఊళ్ళకూళ్ళనే తుంగభద్రలో తొక్కే దాకా ఎదిగిన
మీ దౌర్జన్య దాష్టీకాన్నిక క్షమించం గాక క్షమించం.
తెగిపడ్డ మొండేలను కలాలు చేసుకుని ఈ చరిత్రనిక పునర్లిఖిస్తాం.
ఇప్పుడిక - మీ బుజ్జగింపులూ....బురిడీ మాటలూ
చెల్లవు గాక చెల్లవు.... ఇకపై సాగవు గాక సాగవు.

(అముద్రితం)

వగడాల నాగేందర్

వైతాళికుడవై రా! పద్యంలోకి

తిరిగిరావి గతంలోంచి
వేర్లను లాగి
కొత్త బతుకులో వాటే ఈరోజు
ఈ వెన్నెల మెట్లపై
నీ బురద పాదాలతో నడచిరారా నా పద్యంలోకి

ఇప్పుడు ద్విజుడి వేషాన్ని ధిక్కరిస్తూ
'ఛండాలుడా'!
పద్యంలోకి వైతాళికుడవై రా!

నిన్ను బహిష్కరించిన చరిత్ర చెవుల్లో
పలపల కాగే సీసాన్ని పోద్దువు రా!

వర్తమాన మనువు నోట్లో
ఉచ్ఛ పోసేందుకు రా!

రా!

(అముద్రితం)

స్కై బాబ

ఉప్పు కొట్టడమే న్యాయం

అది నీ చావు డప్పే!

నువ్వెంతగా వినబడనట్టు నటించినా
నీ కర్ణభేరులు అదురుతున్నది నిజం

నీ మన్మోహన వాయిద్యాలన్నీ
లయ తప్పుతున్నాయి కదూ

నువ్వు అందంగా మలచుకున్న సంగీతం
ముక్కలు ముక్కలుగా తెగుతూ
మసక మసకగా విన్పిస్తుంది కదూ

ఆ హీన శబ్దం మీంచి
తెరల తెరల హోరుతో విన్పిస్తున్నది
నీ చావు డప్పే!

పెరుగుతున్న నీ గుండె వేగం
ఇన్నాళ్ళూ అణగారిన
వాడి గుండెల ఉద్వేగం ముందు
హార్ట్ ఎటాకై ఆగుతుంది

వినుఁ! జాగ్రత్తగా వినుఁ!
గుండెలు బాదుకోవాలనిపిస్తే
బాదుకొనీ మరీ వినుఁ!
ఇప్పుడు విన్పిస్తున్న చప్పుడు
ఎప్పటి నీ అకృత్యాల ఫలమో.....

పల్లకీ శిథిలమైపోయింది
ఇక నీ పాడె కట్టడమే తరువాయి
పన్నాయి చెదలు పట్టింది
ఇక దప్పు కొట్టడమే న్యాయం!

(అముద్రితం)

వన్నాల జగన్నాథ దాను

ఇకనైనా తప్పుకోండి....

కేడుపులోని చల్ల కదలకుండా
హాయిగా చల్లదనాల మీ పాలరాతి మేడల
పై అంతస్తులో మెత్తమెత్తని హంస తూలికా తల్పాలపై నిద్రించి
మీరు కన్న నీలి స్వప్నాల నుంచి తేరుకోకముందే....
మీ జీవితాలనీ సంపదల సర్వస్వాన్నీ
భీమా చేయించుకున్న కాయితాలని
ఇనుప బీరువాల్లో పెట్టి తాళాలేసేసుకుని...
మీరు నివసిస్తున్న సురక్షిత భద్రతా క్షేత్రపు
సరిహద్దుల నుంచి బయటకు రాకుండానే...
మీ ఉన్నత సౌధ గవాక్షాల గుండా వీక్షించినంత మాత్రానే.....
బడుగు బతుకుల బాధల్ని గురించి
ఏ అర్హతతో రాస్తున్నారు?
ఒడ్డును కూర్చున్న మీరు
జీవన కాసారంలోని కల్లోలాన్ని గురించి
ఏ అర్హతతో మాట్లాడుతున్నారు?
గుండె కదిలి, మనసు పిలిచి, కళ్ళు చెమ్మగిల్లి....
అంటూ బుకాయించబోకండి
బలిసిన మీ వాళ్లు కాస్త అలిస్తే చాలు
గుండె వేగంగా కదిలిపోతూనే వుంటుంది...
మీరు చేసే సకల అనుకరణలకు మెచ్చిన ప్రభువులు
మీకు చెయ్యబోయే సన్మానాలు
మీ మనసుని పిలుస్తూనే వుంటాయి...
జవ జీవన స్రవంతిలో చెలరేగిన పోరాటాల ధూళి
నేరుగా మీ కళ్లల్లోనే చిమ్ముతే
అవి చెమ్మగిల్లక మరేమవుతాయి?

ఇప్పటికైనా చాలించండి మీ ప్రకోపిత పైత్య ప్రలాపాన్ని
ఇకనైనా ఆపండి మీ అక్షర ధ్వన్యనుకరణా నైపుణ్య ప్రదర్శనని
చేతనైతే మీరూ వచ్చి మాతో కలవండి
పోరాట క్షేత్రంలో వెత్తురు చిందించడానికి సంసిద్ధులవండి
చేతగాకుంటే
చేవ చచ్చిన చేతుల్తో చెక్క భజనలు చేసుకోండి
పత్తువన్నది మీలో నిజంగా వుంటే
కష్టాల కడలిలో మాతోపాటు ఎదురీత నీదండి
లేకుంటే
మీ రాజకీయాల మురుక్కాలువల్లో పందుల్లా పొర్లండి
మాకేం అభ్యంతరం లేదు
మా అభ్యంతరమంతా
మీరు మా మీద నటిస్తున్న సానుభూతిపైనే
మీరు మా కోసం కారుస్తున్న మొసలి కన్నీటిపైనే
మహా మహా కవులారా
శత సహస్ర బిరుదాంకితుల్లారా
మీ శకం అయిపోయిందని కాస్త గ్రహించండి
కృత్రిమ కాంతులతో వెలుగుతున్న అభినయ రవులారా
మీ పొద్దు కుంగిపోతూందని కొంచెం తెలుసుకోండి
మీరు సృష్టించిన తిమిరం పై
సమర శంఖాలమై ప్రతిధ్వనిస్తున్న
అక్షర కిరణ కాంతి శరాలం మేం
బతుకు బండరాళ్ల పై సానబట్టుకున్న
అనుభవాల వజ్రాయుధాల్తో విజృంభిస్తున్న వీరులం మేం
కంటకారణ్యాల్లో
మా కలల పంట పండించుకోడానికి
కత్తుల్ని దూస్తున్నవాళ్లం మేం
మా దారి నుంచి మర్యాదగా తప్పుకోండి
అడ్డు తగిలితే కుత్తుకల్ని కత్తిరించడానికైనా వెనుదియ్యం

(994 ఆంధ్రజ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక)

జూపల్లి ప్రేమ్ చంద్

సర్వ పంజరం

సి ఆర్ పి సాక్షిగా

పారా మిలటరీ బలగాల సాక్షిగా
భగ భగ మండి ఖిన్నుడైన సూర్యుడి మౌనశోకం సాక్షిగా
ఒక్కొక్క గోడ పెళ్ళలు పెళ్లలుగా భూపతనమైన పురాకట్టడం సాక్షిగా
ధూళిమేఘాలు ఉన్మాదంతో నేత్రాకాశాన్ని పూడ్చేసినరోజు
నిజంగా ఇవ్వాళ పాత మాటలకు కొత్త అర్థాల్ని వెతుకుతున్నాం
అంతే లౌకికత్వంతో అలౌకికతను ప్రదర్శిస్తున్నాం అంతే

* * *

ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు నన్ను నేను కోల్పోయాను
కాదు కోల్పోడానికి నా దగ్గర ఎం మిగిలింది కనుక
అనాదిగా తలలేని మొండెంతో మౌనంగా తిరుగుతున్నవాడిని
నా శ్రమ నా శరీరం నా ఆత్మ నా సర్వస్వం పరాధీనమే కదా

* * *

మంత్రోచ్చారణ చేశాను - నాలుక తెగ్గోశారు
మంత్ర శ్రవణం చేశాను చెవిలో కరిగించిన సీసం పోశారు
తలక్రిందులుగ తపస్సుకు ఉపక్రమించాను
ఖండఖండాలుగా ఖండించారు

* * *

ఔను నిజం ఇప్పుడు సత్యశోధన తప్పనిసరి
సమాధుల్ని తవ్వాలి ఆరామాల్ని తవ్వాలి
మసీదుల్ని తవ్వాలి మందిరాల్ని తవ్వాలి
నేల మాళిగలో పాతేసిన కాలనాలిక కావాలిప్పుడు
ధర్మం నాలుగు పాదాల మీద నడవటం కాదు

కుంటినవైనం కావాలిప్పుడు
రక్తసిక్తం కాని మానవ అవశేషం కావాలిప్పుడు
ఒకే ఒక ఖడ్గచాలనంతో తెగిపడిన
శంబూకుడి శిరస్సు సాక్ష్యం చెబుతుందేమో చూద్దాం
తవ్వాలి బాగా తవ్వాలి
దశాబ్దాల్ని కాదు శతాబ్దాల్ని కాదు కాదు
సహస్రాబ్దాల్ని పొరలు పొరలుగా తవ్వి పోయాలి
పరాజయ భారంతో అవనతంకాని మానవతా పతాకం కన్పిస్తుందేమో?

* * *

కటిక చీకటిలో కారడవులు
ఉన్నది ఒకే ఒక ద్వారం అంధకారం
పురాకట్టడాల్లో రంధ్రాన్వేషకుల్లారా
హృదయ ద్వారాలను తెరిచే తేజో సమీరం కావాలిప్పుడు
పుట్టుక యాక్సిడెంట్ మృత్యువు యాక్సిడెంట్
జీవితమే ఒక యాక్సిడెంట్ అయినప్పుడు
జ్ఞానోదయం అద్భుతమైన యాక్సిడెంట్
యాక్సిడెంట్ కోసం ఎదురు చూడ్డం పరమార్థం కాకూడదిప్పుడు

* * *

ఇవాళ పాత మాటలకు కొత్త అర్థాల్ని వెతుకుతున్నాం
కాషాయం మింగిన ధవళ వర్ణం వెల తెల పోయింది
అందమైన ముఖం మీద స్ఫోటకం మచ్చలు మురికి వాడలు
కొత్త ముఖాలతో కొత్త వేషాల కొత్త తొడుగులు తొడుక్కొని
స్ఫోటకం మచ్చల కళ్ళల్లో జిల్లేడు పువ్వులు పూయిద్దాం
బాంబులు విసిరి బీభత్సాన్ని సృష్టిద్దాం
అనాధ ప్రేతాలతో బంతులాడుకుందాం
ప్రశ్నించవనే కదా ధైర్యం

ఈ విద్రోహానికీ విధ్వంసానికీ బాధ్యులెవ్వరని
సమస్త సాంస్కృతిక అవశేషాల్నీ తవ్విపోద్దాం

* * *

గోముఖ వ్యాఘ్రాలచేతిలో రుద్రాక్షమాల తిరుగుతున్న
కమండలంలోంచీ మంత్ర జలాలను విసురుతున్నారు
అందరూ వినమ్రంగా మంత్ర బద్ధులై పుష్పధారణ చేశారు
ధర్మచక్రం పచ్చకాయిదాల చుట్టూ అప్రమత్తంగా పహారాకాస్తున్నది
కొత్త ప్రశ్నలముందు పాత ప్రశ్నలు తలక్రిందులుగ గిరికీలు కొడుతున్నాయి

ఇప్పుడు మొహంవాచిన వాడెవ్వడూ అన్నం కావాలని అడగడు
యవ్వనాన్ని రోడ్లమీద ఆరేసినవాడు పచ్చని జీవితాన్ని ఫణంగా అర్పిస్తాడు
ఫాక్టరీ జహ్వాగ్రాల మీద నెత్తుటి దీపాన్ని వెలిగించినవాడు
బోనస్ బతుకు గురించీ ఆలోచించడు
కొత్త పైసల విధానం ఆలోచనల్ని ఆత్మల్నీ తాకట్టు పెట్టినా
ఖాయిలా పడిన కర్మాగారాల్ని తెరిచి
జీవితాలకు పూచీపడండని దబాయించరు
అంతేకాదు ఈ గడ్డమీద నెత్తుటిగాటు పెట్టి
గాలిని నీటిని శశిని ఫలపుష్పాది దేవతల్ని జవజీవాల్ని
డంకెల్ మహమ్మారికి బలినైవేద్యంగా సమర్పించినా
ఎవ్వరూ ప్రశ్నించరు ప్రశ్నించరు గాక ప్రశ్నించరు
పాలకవర్గాల ప్రతిభాపాటవాలకు మంత్రముగ్ధులై పోయారు
కొత్తరూపం ధరించిన కమండలం ఎత్తుగడలముందు
అప్రతిభులు మట్టికొట్టుకుపోయారు
భేష్. ఎత్తుగడ ఫలించింది
అందరూ విధించని మారటోరియమ్ మంత్రబద్ధులైనారు
పురి విప్పనున్న పిపీలిక చైతన్యాన్ని
మింగేందుకు మతం కొంగ సిద్ధంగా కూర్చుంది

సంధించింది ఒకే ఒక బాణం ఒకే మతం ఒకే భాష ఒకే ధర్మం అంతా
అఖండం
నిజమే ఖండఖండాలుగా చీలిన నా దేహాన్ని
ఎదురైనవాడి పాదధూళిలో వెతుక్కుంటున్నాను
వరికదా
మనిషిని నిలువునా చీల్చిన గోడల్ని కూలగొట్టటం కర్తవ్యం కాదా ఇప్పుడు
అవశేషాల్నీ అస్తిత్వాన్నీ అన్వేషించక తప్పనిసరి
కొత్త వెత్తురుతో పాత చరిత్రను పునర్లిఖించక తప్పదు
వర్ణపంజరం అన్ని ద్వారాలను తెరచి నూతన పవనాల్ని ఆహ్వానించాలి

కంజిర పోయిట్రీబులిటిన్ ఆగస్టు 993)

పి. యం. సుందరరావు

నడివీధిలో నా జెండా

మీరు ముక్కున వేలేసుకోవద్దు
నా చేతులు వెనక్కి తీసుకుంటే
మీ ముక్కులు మురికి గుంటలవుతాయి
మీ ముందు కంచం వుంచి
వూరవతల కడుపులో
కాళ్లు ముడుచుకుంటున్నాను
నా ఒళ్ళు ఆదమరిస్తే
మీ ఒళ్ళు చిక్కిపోతుంది
మీ పాదాలకు రక్షణనిచ్చినందుకా
నాకు అదే చోటునిచ్చింది
మీ చావులను కడతేరుస్తున్నందుకా
నాకు సమాధి దగ్గర నివాసమిచ్చింది
తప్పెట కొట్టిన చేత్తో
తొడ చరిచి చెబుతున్నాను
వూరి చివర పారేసిన నా జెండాను
నడివీధిలో మొలిపిస్తానని

(16-11-94 ఆదివారం ఆంధ్రజ్యోతి)

మద్దూరి నాగేష్‌బాబు

ఐదోగది

భూగోళం ఈ చివర్నుండి ఆ చివరిదాకా
అక్షాంశ రేఖాంశాల మీద తొక్కుడుబిళ్లాడే గాలికెరటంలాంటి మనసుని--
ఆ మనసు అంతర్మూలాల్లో దాగున్న విశ్వాసాన్నీ
ఇప్పటికీ భోషాణపెట్టిలో భద్రంగా దాచుకున్న
బుర్రమీసాల తాతయ్య భూతద్దాల కళ్ళజోడులాంటి మధురస్మృతినీ
నోట కరచుకుపోయే మనిషి వున్నాడనీ
మనిషి మనిషేనన్న నమ్మకపుటద్దానికి
కేవలం మనిషే పెరిల్లున రాయై తగిలి విధ్వంసించగలడనీ
ఇదుగో-ఇన్నాళ్ళకి మళ్ళీవాడు
మధ్యయుగాల మైలకుంటలో మునకేశాక గానీ తెలియలేదు!
బోసిముడ్డిన నిలబెట్టి
ఒళ్లంతా తోమీ తోమీ తానాలాడించిన అమ్మకీ
నన్ను గుండెలమీద నాటుకు నాలో తనుపండిన నాన్నకీ
జీవితం పంటకాల్వలో జీవజలమై జాలువారే భార్యకీ
నన్నేకాదు నా బాహ్యాంతర లోకాలన్నీ నగ్నంగా ఎరిగిన
నా మనోముకురానికీ చెప్పుకోలేని కన్నీళ్ళనీ కలతల్నీ ఇన్నాళ్ళూ
కోపగృహంలాంటి నా గుండె ఐదోగదికి నివేదించుకునేవాడ్ని
అక్కడ ఆ అమ్మ ఒడిలాంటి ప్రశాంత గంభీర ప్రపంచంలో
ఓ వేసారిన బాటసారినై సేదదీరేవాడ్ని
నా కాళ్లకింద నేల నన్నో కాందిశీకుడిగా చూపినపుడు
నా నెత్తిమీది ఆకాశం వివక్షల అగ్నిగంధకాలు కురిసినపుడు
ఆవహించిన ఆవేశమంతా నిస్సత్తువ కనుకొలుకుల్లోంచి ధారగా

జారుతున్నపుడు

నా ఐదోగది ప్రేమగా నన్నెత్తుకు ముద్దాడి
నా వెక్కిళ్లకు తన చెక్కిళ్లిచ్చి ఊరడించేది!
ఒకానొక సామూహిక మూర్ఖత్వం నా కలల ఉపరితలంపై ముళ్ళ పాదాలతో
నడిచిపోయాక

నాకళ్ళముందే! సాక్షాత్తూ నా చేతకానితనం ముందే
నాతల్లి మూడు రొమ్ములూ ఒక్కొటొక్కటిగా వాడు తెగ్గోశాక

నాకిక్కడ మిగిలింది - బతుకంత అవమానం
నాకిక్కడ మిగిలింది - నా ఐదోగదిమీద మొలిచిన వాడి అజ్ఞానపునాచు
ఏదీ నా అతృప్తకామనల జాజితీవె కాధారమైన వెదురు వెన్నుపూన?
ఏదీ నినమొన్నటిదాకా నా సంస్కృతిని ఎలుగెత్తి పాడిన త్రికంఠగీతం?

అమ్మా నన్ను క్షమించు--
వాడు నా పేగులు రాడ్‌క్లిఫ్ దండెంమీద ఆరేస్తుంటే
నేను శాంతి వచనాలు వల్లించలేను!
నాకళ్ల ముందే వాడు నా సంసారపు ఇసకగూడు తన్నేస్తుంటే
మోరెత్తి పైనుండి సహాయాలకై ఎదురు చూడలేను
వాడు నన్నే సరికొత్త అస్పృశ్యుడ్ని చేసి
నా కలల ధగ్ధావశేషాల మీద సింహాసనం చెక్కుకుంటుంటే
నేను వాడ్ని క్షమించమని ప్రార్థించలేను
నిజమే ఉగ్గుపాలలో ప్రేమే రంగరించి పోశావు
కానీ ప్రేమించడం చేతకానితనమౌతున్న చోట-
నన్ను నేను రక్షించుకోవడానికి జిహాద్ తప్పదమ్మా
నాకూ చేతులున్నాయ్!

(ఆగస్ట్ 1993, కంజిర)

ఎండ్లూరి సుధాకర్

ఆత్మకథ

సభలో నా ఆత్మకథ ఆవిష్కరించబడింది
బహిరంగ వేదిక మీద నా సన్మానం మొదలయ్యింది
ఇప్పుడు నా మెడలో దండలు పడుతుంటే
నిన్నటి నా గాయాలు ఉలిక్కిపడుతుంటాయి
నా తలమీద పూలు చల్లుతున్నప్పుడు
నా లోలోపల ముళ్ళకొరడాలు చరుస్తుంటాయి
నా మీద అభినందన పత్రాలు చదువుతున్నప్పుడు
నా కడుపులో అవమానాల చురకత్తులు గుచ్చుకుంటాయి
నా వెనక వేదమంత్రాలు వినిపిస్తుంటే
నా చెవుల్లో సీసం పాగల గావుకేకలు తాండవిస్తుంటాయి
సభావేదిక మీద నన్ను కూర్చోపెట్టినప్పుడు
ఊరి పాలిమేర దగ్గరే నిలబడ్డ నా తాత మొహం గుర్తుకొస్తుంది
నా ముందు నీళ్లు నిండిన గాజుగ్లాసులు పెట్టినప్పుడు
మోర్లాల్లపై వంగి నీళ్ళు తాగిన ఎడారి దృశ్యాలు వేడిగా తగులుతాయి
నా భుజాల చుట్టూ శాలువా కప్పుతున్నప్పుడు
జాకెట్టులేని నా జేజెమ్మ మనక రూపం గుండెల్ని కోస్తూవుంటుంది
పట్టు వస్త్రాలు నాకు అర్పణంగా పెడుతున్నప్పుడు
చివికి పేలికలైన నాతాత ముతక పంచెలు కళ్ళతిగెలపై వేలాడుతుంటాయి.
నన్ను విందు భోజనాలకు ఆహ్వానిస్తున్నప్పుడు
చిన్నప్పుడు గొడ్లచావిట్లో బువ్వ పెట్టిన పాద్దులు గుర్తొస్తాయి
కాలం నా పాదాలకు నమస్కరిస్తుంటే
చెప్పుల్లేని నా తాతల మట్టికాళ్లు మనసులో మెదులుతుంటాయి
ఏ రోడ్డు మీదో వా చిన్నప్పటి గురువులు కనిపిస్తే
గద్దను చూసిన కోడిపిల్లలా నా బొటనవేలు గుప్పిట్లో దాక్కుంటుంది

అహా ఓహోల మధ్య నా కవిత్వాన్ని రామచిలుకలు చప్పరిస్తున్నప్పుడు
మన్నులో ఇంకిపోయిన నా జాతి కవిత్వం గుర్తొచ్చి క్రూరంగా వేధిస్తుంది
నాకోసం చౌరస్తాలు రంగురంగుల తోరణాలై ఆహ్వానిస్తున్నప్పుడు
నాతో ఐదడుగులూ కలిసేందుకు స్వర్ణహంసలు సిద్ధపడుతున్నప్పుడు
నా పూర్వీకుల దేహధూళి నేలమాళిగల్లోంచి కొత్తగాలి పీల్చుకుంటుంది
ఆ సూర్యంపశ్యలు స్వయంవరాల్లో నాకోసం పోటీపడుతున్నప్పుడు
తెగిన తలలూ కోసిన అంగాలు నాకళ్లల్లో ఎగిరిపడుతూనే వుంటాయి
దేవాలయాలూ కొత్తదేవుళ్లు నా దర్శనం కోసం పడిగాపులు పడుతున్నప్పుడు
గుడ్డి చీకట్లో గుడిగంటలు వక్రధ్వనులతో నవ్వుకుంటాయి
నాలుగు మబ్బుల నీలిగోడల్ని చీల్చుకుంటూ
నేను ఐదవ సూర్యుడినై ఉదయించాను
ఇవాళ నా రక్త కిరణాలు
చంద్ర తలం మీద ప్రతిబింబిస్తున్నాయి
ఇప్పటి కొత్త సూర్యుడి వెలుగులో
కాలం నా ఆత్మకథను
పాఠ్యగ్రంథంగా చదువుకుంటుంది.

(20-4-1994, సుప్రభాతం)

పి. సి. రాములు

ఈ చరిత్రను తిరగ రాయాల్సిందే!

గుడిసెల్లో గుడ్డి దీపాల్లా కునుకుతుండేటోళ్ళు
రచ్చబండ చేరడమే చర్చనీయాంశం గదా
గులాముల్లా బతికేటోళ్ళు ప్రశ్నార్థకంలా మారడం
మురికోడే ముష్టోళ్ళు సహపంక్తిలో దూరడం
కుక్కల్లా పడుండాల్సినోళ్ళు కుర్చీలపై చూపు నిల్పడం
మోచేతి నీళ్లు తాగేటోళ్ళు హక్కులని వోరెత్తడం
తీవ్రంగా నిరసించాల్సిన విషయం గదా
ప్రతిభను మురికి కాల్వల్లో కలిపి
బడుగు వెధవలకు భాగం కల్పించడం
మేరునగ ధీరుల్లాంటి ప్రతిభుల ప్రక్కన
మరుగుజ్జుల్ని సమానులుగా నిలబెట్టాలనడం
ధర్మ విరుద్ధం గదా!క్షమించరాని నేరం గదా!
కర్మ గీత నతిక్రమించడం గర్హాతి గర్హనీయం గదా!
'మైనార్టీ' తీరనోళ్ళ మాటల్ని పట్టించుకోవాల్సిన పన్లేదు
బలహీనులకు భిక్షాహార మిచ్చి పోషించడమేమిటి
బలాఢ్యుల హృదయఘోష కేవలం కంఠశోషగా మిగలడమేమిటి
'ఎక్కడోన్నక్కడే' ఎంచక్కా పడుండనీయక
ఈ స్థానభ్రంశాల కుహనా సంస్కరణలేమిటి
సాంఘిక సమానత్వమనే శుష్క వాదనలేమిటి
మనువును మట్లో కలిపి, నారదుల్ని బురదలో తొక్కి
మహర్షుల మహిత వాక్కులను మంటల పాల్జేయడమా?
వో ....నెవర్...ఇలా ఎన్నటికీ జరగడానికి వీల్లేదు (ఉవాచ)

మిత్రుడా!
ఒక పటిష్టమైన పథకం ప్రకారం కుట్ర సాగి

కాలం వేల సంవత్సరాల వెనక్కు నెట్టబడుతోంది
దుర్నీతి దురహంకారం దోపిడీ దౌర్జన్యం
విలయ తాండవం చేస్తూ వికృతంగా నవ్వుతోంది
పట్టు సడలి పోతున్నప్పుడు
'పన్నాగం' జరజరా జారి పోతున్నప్పుడు
ఆచి తూచి వేసిన పాచిక పారనప్పుడు
సూడోప్రతిభ బజార్లలో చీపుర్ల వయారమవుతుంది
పుట్‌పాత్ మీద బూట్‌పాలిష్ ప్రహసనమవుతుంది
ప్రతి ప్రసార సాధనమూ
వాళ్ళకాళ్ళను నాకే బొచ్చు కుక్క పిల్లవుతుంది
పత్రికల ఫ్రంట్ పేజీల్లో అందమైన పోజుల స్టిల్స్
తాటికాయంత అక్షరాల్తో తలల్ని ధీ కొంటాయి
వాళ్ళ ఎ. సి. రూముల్లో కరెంటాగి పోయి
చూస్తున్న ఫాంటసీ రీలు పుటుక్కున తెగినట్టు
నిప్పులు తొక్కిన కోతిలా సూడో ప్రతిభ చిందులు తొక్కుతుంది
మన మీంచే పైకెక్కి నిక్కి నీల్గేవాళ్ళు
ఒక్కొక్క మెట్టే దిగాల్సి వచ్చినపుడు
శక్తినంతా కూడదీసుకుని శవ నృత్యం చేస్తుంది
భవిష్యత్తు అంధకారమవుతుందని తలంచి
పెట్రోలు డబ్బాలతో తలమునకవుతుంది
అర్ధ అంగ బలాలతో అగ్ని కీలల్ని విరజిమ్ముతుంది
విధ్వంసకాండతో వికటాట్టహాసం చేస్తుంది
అంతా నాటకీయంగానే జరుగుతుంది
అంతా 'నిజంగానే' కనిపిస్తుంది
నిన్నటి దాకా మన మీద అవ్యాజప్రేమ నొలకబోసిన వాళ్ళు
గోముఖ వ్యాఘ్రాలని గుర్తించలేక పోయాం
క్రితం దాకా ఆదర్శాల ఊక దంపుళ్ళతో

మైకుల్ని బద్దలు కొట్టిన వాళ్ళు
ఇవాళ
ఎవరి 'ధ్రువాల' గుడారాల్లో వాళ్లు దూరుతున్నారు
సంపాదకీయాల సారా పీపాల్లో మునిగి
ఫ్రంట్ పేజీ హెడ్‌లైన్స్‌లో పల్టీలు కొడుతున్నారు
మన ఐదువేళ్ళూ నోట్లో కెళ్ళడం గిట్టక
పరాన్న భుక్కుల నరనరాన వ్యతిరేకత వెల్లువవుతుంది.
ఆత్మాహుతుల వాటికాలతో
అల్లకల్లోలం ఆవిష్కరించబడుతుంది
అంతా ఏలిన వారి అండదండలతోనే అద్భుతంగా నడుస్తుంది
మిత్రుడా!
ఎన్నాళ్ళిలా మన బతుకులు
వెట్టిచాకిరీ గిరిలోనే ఆవిరవుతుండాలి
ఎంతకాలమిలా ఆకలి రోగ పీడితులమై
పస్తులతో అహోరాత్రులు అలమటిస్తుండాలి
ఎవ్వటిదాకిలా పరాన్న జీవుల బొజ్జలు నింపుతూ
దరిద్రంలోనే తనువులు చాలిస్తుండాలి.
తప్పదు
ప్రతిఘటించాల్సిందే ఈ కర్ర పెత్తనాన్ని
ఛేదించాల్సిందే ఈ దాస్య శృంఖలాల్ని
ఎండగట్టాల్సిందే ఈ దోపిడీ సంస్కృతిని
ఇప్పటిదాకా జోడించిన మన చేతులు
అలవోకగా పిడికిళ్ళై లేవాల్సిందే
ప్రతిమాటనూ కూడగట్టుకుని నడుం బిగించాల్సిందే
వ్యధార్తులంతా క్షుధార్తులంతా
తాడిత పీడిత దళిత దరిద్రులంతా
క్రోధ నేత్రులై కులిశధారులవ్వాల్సిందే

ఈ 'కంటి తుడుపుల' 'వేళ్ల విదిలింపుల'
కుట్రని కుటిల రాజకీయాల్ని ఛిద్రం చేయాల్సిందే
ఘర్మ జలాన్ని దోచి భర్మ హర్మ్యాలను నిర్మించుకునే
ఈ దుర్మార్గపు దోపిడీ వ్యవస్థను నిలువునా కూల్చాల్సిందే
మనమిక ప్రత్యక్ష యుద్ధానికి సన్నద్ధం కావాల్సిందే
ఈ చరిత్రను తిరగ రాయాల్సిందే.

(సెప్టెంబరు 1990, అగ్నేశ్వాన కవితా సంకలనం నుంచి)

చిన్న అయిలయ్య

అమ్మిన చరిత్ర

ఈ పాద ముద్రలు చూస్తే భయం కలుగుతుందా
ఈ నెత్తుటి సెలయేళ్ల ధ్వని వణికిస్తుందా
ఇవి నిన్నటి పాదముద్రలు కావు
చరిత్ర పుటల్లో నువు అద్దిన వేలుముద్రలూ కావు
తెగిపడిన శంబూకుడి శిరస్సు నుంచీ
పంటపొలాల్లో వాలుతున్న తలల వరకు
గురుద్రోహాల ఆత్మవంచనల దక్షిణల క్రింద
మా బొటనవేళ్లే మీ చరిత్ర పాళీలు కదా
మలాలు తిన్పించిన నిర్లజ్జావర్తమానం
సరిహద్దురేఖ వరకు
మీవి ఒకటే రహదార్లు
మావి ఖాళీ బాటలు
ఇన్నాళ్ళూ ఈ మట్టి చేతుల్నెవరు దొంగిలించారో
నన్ను మలినుడ్ని చేసి ఊపిర్లెవరు పీల్చారో
నా స్వేచ్ఛని శరీరాన్నీ సర్వాన్నీ
ఎవడు బంధించాడో
వాడే వా చుట్టూ కట్టిన గోడల మీద
మానవత్వాన్ని కుమ్ముతున్నా
శతాబ్దాల నుండి పల్లవి లేనిపాటకు
పల్లవి సమకూరుస్తున్నాను.
నడుస్తున్న కాలం మీద మణి కిరీటాన్ని నేను
మట్టి చరిత్ర వినా
మలిన చరిత్ర లేని వాణ్ణి

(1994, ఆంధ్రజ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక)

ఎం. వెంకటేశ్

బ్రహ్మమొకం లోంచి పాదాలు

మా పంట భూమిలో
మేమే ఉమ్మెత్త పువ్వులమై పూస్తున్నాం.

మా నీడల మీద
మంత్రించిన పసుపు నీళ్లు చల్లుకుని
జంత్రిలోని దినం మొలకెత్తుతుంది.

తరతరాలుగా మట్టిపొరల్లో అగులుబొగులవుతున్న
మా అవమానాలూ, పరాభవాల కొలిమిలో
సూర్యుడు చుట్టూకై కాలుతున్నాడు ఈరోజు

చర్మం వొలిచిన చేతుల్లోనే
చంద్రోదయం బొబ్బలెక్కుతుంది
గురిపెట్టిన చూపుల్లోంచే
బలైన బొటనవేలు పొడుచుకొస్తుంది
పంచముడి పంచకంలో తప్పనిసరై
పంచభూతాలూ పవిత్రస్నానం చేస్తున్నాయి
నుదుటి మీద గీత దాటి
మేం కూతకొస్తున్నాం

ఇప్పుడు పుట్టుకొస్తున్నవి
బ్రహ్మ మొహంలోంచి పాదాలు!

(11-12-94, ఆదివారం ఆంధ్రజ్యోతి)

శివసాగర్

నడుస్తున్న చరిత్ర

శంభూకుడు పెదాలమీద చిరునవ్వుతో
రాముణ్ణి వధిస్తున్నాడు
ఏకలవ్యుడు ద్రోణుని చూటనవేలును
గొడ్డలితో నరుకుతున్నాడు
బలి, తన చిరుపాదాలతో వామనుణ్ణి
పాతాళానికి తొక్కేస్తున్నాడు.

మనువు కళ్ళల్లో నూదులు గుచ్చుకొని
నాలిక తెగ్గోసుకుని
చెవిలో సీసం పోసుకుని
శ్మశానంలో దొర్లాడుతున్నాడు

కాలం కసాయి కత్తిమీద నిలబడి
గర్జిస్తున్న ఛండాలుడు
శంకరునిపై వాలుగు వేటకుక్కల్ని
ఉసిగొల్పుతున్నాడు.

ఓహో...!
ఇపుడు నడుస్తున్న చరిత్ర
వరమ ఛండాల చరిత్ర!

(14 ఆగస్టు 1994, ఆదివారం ఆంధ్రజ్యోతి)

సతీష్ చందర్

పంచమ వేదం

నూరేళ్ళకి పదిహేడు మార్కులే వేసి
జీవితంలో తప్పించిన గురుదేవులకు
చేతులు జోడించి వ్రాయునది

' నీకు చచ్చినా అర్థంకాదురా' అని
మీరు తిట్టుకొంటూ చెప్పిన వేళ్ళ మీద లెక్క
నాకు చచ్చాకనే అర్థమయ్యింది
నేనెన్నిసార్లు లెక్కపెట్టుకున్నా
నాచేతికి నాలుగువేళ్ళే వుండేవి.
నాన్నకి కూడా అయిదోవేలు లేకనే
మీరు గుండుసున్నలు చుట్టిన ప్రోగ్రెస్ రిపోర్టు మీద
ఎప్పుడూ వేలిముద్ర వెయ్యలేదు.
పచ్చపువ్వులాంటి వెన్నెల రోజున కూడా
ఆ వేలు లేకనే-
అమ్మ గోరుముద్దలు తినిపించలేదు.
నేను తెల్లముఖం వేసినప్పుడల్లా
మీరదేదో అమృత భాషలో తిట్టేవారు.
నాకన్నం తప్ప అమృతం సయించదు
నిజం చెప్పండి
పంచముడంటే అయిదోవేలు లేనివాడనేనా
అర్థం?

మా ముత్తాత ఏకలవ్యుడు చెప్పాడు
మీకు ఫీజు ఇవ్వకుండా మరణించినందుకు మన్నించండి

ఏమివ్వమంటారు?
ప్రాణాలే యిద్దామంటే-
ఇంతవరకూ నాబొందిలో తల దాచుకొని మైలపడ్డాయి.
అదీకాక మీకు తలంటురోగం!
పోనీ
అతి సున్నితమైన నా మనోఫలకాన్ని మీకిచ్చేద్దామంటే
నా చావు మీకొచ్చిపడుతుంది.
ఎలా చూసినా మీకు నా దిష్టిబొమ్మ నివ్వడమే ధర్మమనిపిస్తోంది.
ఏ గాంధీ జయింతినాడో మీరు చేసే సహపంక్తి భోజనమ్మీద
చెడుచూపు పడకుండా కాపాడుతుంది.

ఏకలవ్యుడు కూడా
భారతంలో ఓ దిష్టిబొమ్మ

మా క్లాసులో పాండవుల్నీ, కౌరవుల్నీ
అడిగినట్లు చెప్పండి
కొత్తగా కేస్ట్ సర్టిఫికెట్ తెచ్చుకొని క్లాసులో చేరిన కర్ణుడికి
నా సానుభూతిని తెలియజేయండి
ప్రతిభావంతులు వాళ్ళు
మీ శ్లోకాలకు చప్పట్లు కొట్టేవారు.
నాకు మాత్రం అవి తిట్లులా అనిపించేవి.
నిజం చెప్పొద్దూ
మనుధర్మాలు వాత్స్యాయన కామసూత్రాల్లా వినిపించేవి.
దేవుడి నాలుగు శరీర మర్మాలూ
అశ్లీల భావ చిత్రాల్లా కనిపించేవి.
నా జన్మరహస్యం మీ శాస్త్రాల్లో రాయనందుకు
నేనెప్పుడూ కృతజ్ఞుణ్ణే.
శాపనార్థాలు దొరకనప్పుడల్లా

నా తల్లి మాటే మీనోట్లో నానుతుండేది
పోనీలెండి, దూషణలోనైనా నా తల్లికే నేను పుట్టానని
ఖరారు చేశారు.
ముమ్మాటికీ మేం తల్లికి పుట్టిన బిడ్డలమే.
అమ్మే మాకు దైవం
గొప్పెళ్ళు వెలివేసిన కుంతెమ్మనయినా
మా యిళ్ళకొస్తే గొంతెమ్మను చేసి కొలుచుకుంటాం

ఏకలవ్యుడు దేవుళ్ళకు కాకుండా
తల్లికేపుట్టాడు

నన్ను దహించింది కిరోసిన్ కాదు -
అభిమానమేనని పత్రికల వాళ్లతో చెప్పండి.
మంటల్లో కాలినప్పుడు నా శరీరమే
నాకు కంపు కొట్టింది
అచ్చంగా బతికున్న మీ దగ్గర కొట్టే కంపే.
అప్పుడర్థమయ్యింది మాష్టారూ
మీకూ నాకూ వున్న తేడా
కులం కాల్చకుండానే కంపుకొడుతుంది కదండీ!
మిమ్మల్ని చంపినా పాపం లేదని మావాళ్లంటున్నారట
అసలు మీరు బతికున్నదెప్పుడు?
ఊపిరితో వుండి తన పిండాకూడు తనే తినేవాణ్ణి
'సచ్చినోడ'నేది మా అమ్మ
మీరు నన్ను చూసి నవ్వినప్పుడల్లా
పెదవుల్లోని పుర్రెదంతాలు కనిపించేవి

వీరుడు ఏకలవ్యుడు
శవాలను చంపడు
చివరగా ఒక్కమాట

వా అంతిమ యాత్రలో పాల్గొన్న
శకుని మామలకు ధన్యవాదాలు చెప్పండి
వాళ్ళ కన్నీటిధారలకు ఊళ్ళో వరదొచ్చిందట కదా
వేను చూస్తూనే వున్నాను.
వాళ్ల ఏడుపు ముఖాలమీద మేకప్ చెరిగిపోయి
పులిచారలు బయటపడ్డాయి
వాళ్ల స్మారకోపన్యాసాల నిండా
బ్యాలెట్ పెట్టెల ముక్కవాసనే.
అయినా, వాళ్ళు నాకెంతో మేలు చేశారు
వా సజీవ దహనానికి
బియ్యం కార్డు మీద కిరోసిన్ సరఫరా చేసింది వాళ్లే

రేపు అడవిలో ఏకలవ్యుడు
వాళ్లను ఉచితంగా దహనపరచి
వా రుణం తీర్చుకుంటాడు.

(గురువుల కులపిచ్చికి బలయిపోయిన విద్యార్థులు దాకె బాలాజీ. డొక్క పద్మనాభరావులకు)
(ఎదురీత)

సతీష్ చందర్

లాస్ట్ ఏంజెల్స్

పాలే కాదు

కొన్నిచోట్ల పాపాలు కూడా తెలుపే
కాకుంటే కాసింత కన్నీళ్ళ కల్తీ

గాజు కళ్ళ రాజహంసల్లారా
నీళ్ళ శాతం కాదు
కన్నీళ్ల వర్ణం చెప్పండి
తుళ్ళిన స్వర్గం నుంచి జారివచ్చి
దేవదూతలు మీరు
జలక్రీడలప్పుడు
సముద్రాల్ని చప్పరించే వుంటారు
కన్నీళ్ల రుచి చెప్పండి
దేవుడి గాఢాలింగనంలో మీకు
చెమట్లు పోసే వుంటాయి
కన్నీళ్ల వాసన చెప్పండి

కారుమబ్బులాంటి నేను మాత్రం
కన్నీళ్ళ స్పర్శ గురించి
కుండపోతగా వర్షించి చెబుతాను

మల్లెపువ్వులేకాదు
చేతి తొడుగులు కూడా తెలుపే
కాకుంటే కాసిన్ని నెత్తుటి మరకలు

చేతులు కడుక్కున్న చక్రవర్తుల్లారా

ముళ్లకిరీటాలు పెట్టే ముందు
చిటికెడు నల్లరక్తాన్ని చూపించండి
ఆదిమవనంలో
విహరించిన నాగరాజులు మీరు
మనిషి గాయవర్ణ చోట
మట్టి కరిచే వుంటారు
ఒలికిన రక్తపు రుచి చెప్పండి
వీరుడి వీపు మీద మీరు
కొరడాలై ముద్దాడినప్పుడు
మంచిగంధపు చెట్లు మూర్ఛిల్లి వుంటాయి
రక్తపువాసన చెప్పండి

శిలువను సింహాసనంలా అధిష్ఠించిన
నన్ను మాత్రం
రక్తస్పర్శ ఏదంటే
వేలుపెట్టమని నా అరచేతి గాయాలను చూపుతాను

ఏడురంగులే కాదు
చతుర్వర్ణాలు కలిపినా తెలుపే
కాకుంటే నల్లగా కాస్త అయిదోతనం

అంగరాజ్య భిక్షతో
అగ్రవర్ణులైన అపర శూద్రులారా
రాజకీయపు రంగు చెప్పండి
దేవుడి కాళ్ళలోంచి భుజాల వరకూ

ఎగబాకిన ధమనులు మీరు
మనుధర్మాన్ని మనీపర్సులో
ముగ్గబెట్టే వుంటారు
రాజకీయపు రుచి చెప్పండి
పనర్లెక్కిన ఊరి చెరువులో
బింబానికి ప్రతిబింబం సాక్ష్యం కాదు
రాజకీయపు వాసన చెప్పండి

మనిషినే కాదన్న నన్ను
రాజకీయ స్పర్శ గురించి అడిగితే
చర్మం వలిచి సోదాహరణంగా చెబుతాను

(అమెరికన్ బ్లాక్స్ అగ్రరాజ్యాలకు స్వదేశీ ఆజ్యమిది)
(నుప్రభాతం)

నలీష్ చందర్

వృత్తాంతం

కైందవ పద్యానికి అతికిన అయిదవ పాదాన్ని నేను.

వృత్తం వెలువలే ఉత్త వచనంలా
పరిభ్రమించిన నాకు
మరణమెప్పుడూ పునరావృత్తమే

నూవెకు నోచుకోని గానుగెద్దును నేను
వృత్తలేఖినిలోని పెన్సిల్ ముక్కలా అరిగిపోయిన నాకు
వర్తమానమెప్పుడూ చెరిపేసిన గతమే

అంకెలకు విలువ నిచ్చిన గుండు సున్నాని నేను
మొత్తాల కుడి ప్రక్కలో
సంఖ్యా మానభంగానికి గురయిన నాకు-
ఎడమెప్పుడూ కడుపులో రగిలే ఖాళీతనమే

చంద్రమండలమ్మీద మానవుడు పాదం మోపినట్లు
నేనిప్పుడే కొత్తగా
వృత్తంలోపల అడుగులు నాటుతున్నాను.

చెరువుకున్న గుండ్రటి గాజు ముఖమ్మీద
నేనొక రాయి వేసి వృత్తాలను మించే వృత్తాలను
కలగంటున్నాను.

కాకతీసిన దప్పమీద శబ్ద తరంగం
వికసించినట్లు
కత్తులకు సానవట్టే
చక్రం మీద నిప్పు పువ్వుల్ని పూయిస్తున్నాను.

నరేష్ చందర్

శిశువు నేడు లేచెను

సమాధుల కర్ణంగా బండరాళ్లెందుకు
పర్వతాల్నే పేర్చమనండి
ఉన్నట్టుండి జీనస్సులు
ఉషస్సుల్లా చివాల్న లేవకపోరు

ఊరినే వెలివేసినట్లు
ఊరు మధ్య సమాధులా?

ఊరుకు నాలుగు మూలలు
జీవులకు నాలుగు కాళ్లు
పొర్లడానికి నాలుగు వరసలు
కులం నాలుగు పాదాలా పాకేది

ఎక్కడో అయిదో మూల దూరంగా
పశువుల పాకలో రెండుకాళ్ల శిశువు జననం

తోకచుక్క పొడిచిందో లేదో కాని
ఊళ్ళో తోక తెగిన చప్పుడు

శిశువు పాదస్పర్శకు మైలపడ్డ పశువుల ఆగ్రహం
మొరిగి, ఓండ్రపెట్టి, ఊళ వేసిన శోకాలాపన

ఈ శిశువు-
బానిసల కంటిపాప
ఒక శతాబ్దపు స్వప్నశకలం
వందేమాతరపు తొలిచరణం
పశుధర్మ శాస్త్రం ప్రకారం శిశు జననం మహా పాతకం

శిశువుకు
రెండుకాళ్ళు ఉండడం నేరం
మిగులు భూమ్మీద అడుగులు వేయకుండా
మేకులు కొట్టారు.

రెండు చేతులుండడం నేరం
పని చూపమని యాచించకుండా
చిల్లులు పెట్టారు.

శిరస్సులో మెదడుండడం నేరం
మళ్ళీ మళ్ళీ రాజ్యాంగం రాయకుండా
ముళ్ళ కిరీటం గుచ్చారు.

ముఖ వర్చస్సుండడం నేరం
ఏ తల్లీ ముద్దాడకుండా
కాండ్రించి వుమ్మారు.

అన్నిటికన్నా ఛాతీలోపల గుండెకాయ వుండడం నేరం
బానిస కొడుక్కి ప్రేమెందుకని
బరిసెలతో పొడిచారు.

పంట పొలాల్లో శిశువుకు శిలువ మరణం
పట్టపగలు చీకటి కమ్మింది.
ఆకాశం అయిదు ముక్కలుగా చీలింది.
సూర్యుడు వాలుగు ముక్కలూ అతుక్కొని ముఖం కప్పుకున్నాడు.

శిలువ మీద శిశువు పలికిన చివరి మాటలు:
"తండ్రీ! వీరేమి చేయుచున్నారో వీరెరుగుదురు.
వేను తిరిగి లేచువరకునూ వీరిని సజీవముగా వుంచుము"

ఊళ్ళో పశువుల పరారీ.
నాలుగు రోడ్ల కూడలిలో
గర్భందాల్చిన నేల తల్లి
వీరుల సమాధులన్నీ నిండు చూలాళ్ళే.

పిరికి వాళ్లు పశుపాలకులు! శిశువింకా లేవకుండానే
పశువధను నిషేధించారు.
"పశువులను వెదకి శిక్షించుటకు శిశువు
ఈ లోకమునకు వచ్చును"

గర్భశోకతప్త హృదయులైన మాతృమూర్తులారా
కళ్లు తుడుచుకొని
ధవళ వస్త్రాలతో స్వాగతం పలకండి

"శిశువు నేడు లేచెను. హల్లెలూయ"

(ఎదురీత)

దెంచనాల శ్రీనివాస్

మహాకావ్యాలు

నా భాష అర్థం కావాలంటే నీ జండెం తెంచుకోవాలి ముందు
దృశ్యుడైనా అదృశ్యుడైనా ఎవడి ముందూ గూనివాణ్ని కాలేను
ఎక్కడైతే ఇవ్వై ఎనిమిది సంవత్సరాల క్రితం మొదటిసారి మరణించానో
వీరుడొదిలిన చివరి గాలి వెదురు పొదల్లో దూరి విల్లమ్ములు తేవట్లేదు
అనంతానంత జీవితాల్ని ఏక క్షణంలో జీవిస్తూ నేను
సంధి కోరే వాళ్లు పెరుగుతున్నా సాము కోరే వాళ్లు పెరగరేం
మహా వాగ్గేయకారుడు ఎప్పుడూ వొక్క రాగాన్నే ఆలపిస్తుంటాడా
వాడి ఖాకి మదతలు నలగకుండానే ప్రతిసారీ మన గుండె మడతలే
ఇనప దేహాలకా కునుమ హృదయాలకా మూడు ముళ్లు
నిజమైన రాజ్యాంగ రక్షకుడే నిజంకోసం నపుంసకులచేత మగవాళ్లను
మానభంగం చేయించగలడు
శవం చెప్పే పాఠం వినడానికి నీ గుండెకు చెవులున్నాయా
జీవిస్తాం క్రియాపదానికి మరణించాం పోరాడుతున్నాం భూత వర్తమానాలు

('గురితప్పిన వద్యం'నుంచి)

దెంచనాల శ్రీనివాస్

రామా! నువ్ నాదేవుడివి కాదు

రిక్త సంద్రం నట్టనడుమ గుడిసె వేసుకున్నాను
నిత్యం నను వెంబడిస్తున్న అది రక్కసుడు
ఇంట్లో రోడ్డు మీదా వని దగ్గరా

ఎక్కడివి, నా కళ్ల నుంచి కారుతున్న త్రిశూలాలు
ఎవరివి, నా శరీరం నుంచి రాలుతున్న తల్వార్‌లు తపంచాలు
అయ్యో, నా తల కమండలంగా మారుతున్నది
శవ రథాలను శిరఃమాలలతో స్వాగతించడం చూస్తున్నాను
యముడు కొరకానుతో ఎనభైఐదు కోట్ల నుదురుల మీద నామాలు పెట్టడం
చూస్తున్నాను
అయ్యో, నన్ను నా దైవ గది నుండి ఈడ్చుకొచ్చి రామ పాదుకల మీదకు
తోస్తున్నారు

ప్రియురాలి ఒళ్లో నుంచీ
పాప పెదాల నుంచీ
నేను భుజిస్తున్న అన్నం మెతుకుల నుంచీ
మేదిని నిండా అదే వాసన
మనిషి మాంసం కాలుతున్న వాసన
ఆర్డీఎక్స్ వాసన

మీద కోటి పురా ఇటుకల్ని కూల్చి
అజా చేయడం మానుతుందా హృదయం

కొరివీరన్న మీద ఆన

అల్లాకా కసమ్
ప్వేర్ బై జినస్
గురుగ్రంథ్ సాహెబ్‌కీ సోఁ
రామా, నువ్ నాదేవుడివి కావు

నా ఇంట్లో అపరిచితుణ్ణి
నా దేశంలో కాందిశీకుణ్ణి
నన్ను అపార్థం చేసుకుంటున్న జనం మధ్య వసిస్తున్నాను
ఆది జంతువులారా, నేను ఆర్యుణ్ణి కాను

రక్తదాహానికి ఒకే శిక్ష
నిమిషుడైనా అనిమిషుడైనా
ఉప్పు పాతర

అయ్యో, నా ఉప్పు కార్మికుడు కన్పించడం లేదు.

('గురితప్పిన వద్యం' కవితా సంపుటిలో 'రండి, కలిసి చనిపోదాం' అనే కవిత పేరు మార్చి)

జి.ఆర్. కుర్మె

పునాదిరాయి

నేనొకప్పుడు గాయినోన్ని !
ఊరి జంతువుల మృతకళేబరాల్ని
వీపున మోసి ఊరవతలికి విసిరేసేవాన్ని
సమాజ శ్రేయస్సును అభిలషించినవాన్ని
'గస్తీనిషా' ఇనాం నవాబు నుండి పొందినవాన్ని !

నేను మరొకప్పుడు కొతాలోన్ని; తలారోన్ని
సంధ్య చీకట్లో 'గస్తీదీపా' న్నయి వెలిగినవాన్ని
ఊరి శవాలను భుజాన మోసిన బేతాళున్ని !

నేనింకా మస్కురోన్ని; సుంకరోన్ని !
శిస్తు వసూలు చేసేటోన్ని 'రోజునాంచ' మోసేటోన్ని
కుల వృక్షపు ఊడల్లో వేలాడే గబ్బిలాన్ని
బడుగు బతుకు చీకట్లో మెరిసే మిణుగురిని !

నేనిప్పటికీ సేతుసిందీని; నీరడీని !
ప్రభుత్వ యంత్రాంగంలో అంత్యజున్ని; అస్పృశ్యున్ని !
నా ఊరికోసం సర్కారు గూఢచారిని
వరి మొక్కల్ని నా చెమట చుక్కల్తో తడుపుతూన్న వాన్ని !

నేనెప్పటికీ నా ఊరి గుడిసెకు నిబ్బెడ గుంజనే !
నేనేనాటికీ ఈ గ్రామ వ్యవస్థకు పునాదిరాయినే !!

(జనవరి 1994, 'పునాదిరాయి' కవితా సంపుటి నుంచి)

ప్రసేన్

మాతృభాష మారువేషం

ఏ భాష ఏ యాస
ఏ గ్రాంథికం ఏ గ్రామ్యం
నాకీపుడు సందేహాల్లేనేలేవు !

నత్తినత్తిగా ఎలాస్టిక్ అక్షరాలతో నేను కొత్త
మాట తడబడుతున్నపుడు ఉచ్చారణలేని
పదాలు నిప్పుల స్నానం చేసాయి కదా మీ
భాష కోసం నా అర్థాన్ని బియ్యం గింజల
పలక మీద జంజెం కట్టిన ఉంగరంతో
రచించారు కదా!

నూనెలో లేని అక్షరాలు
ఏం పలికాయో తెలీదు
పెదబాలశిక్ష నాయాసలో ఎందుకు లేదో
మాతృభాష చుట్టపు చూపెందుకయిందో !
ఏమీ తెలీదు ...
ద్విత్వాలు దంత్యాలు తాలవ్యాలు లేవా
పలకలేను నిజమే. వత్తులూ పొల్లులూ
యాసలో విరిగిపోతాయి నిజమే. వాక్యం
తెగాల్సిన చోట తెగదు అవిరామచిహ్నాల
గాయాలను పులుముకుంటుంది నిజమే.

మార్కులు రాని మాతృభాష నాది
ఇప్పుడు ఏ అక్షరాన్ని దిద్దాలి
ఏ మాండలికాన్ని బట్టీవట్టాలి

ఏ సమాధానం అప్పజెప్పాలి
వాకు సందేహాల్లేవు!

సంస్కృతాన్ని తెలుగించిన కొత్త భాష వా
బాల్యం దేవతల పలుకుబడిని నేలజార్చిన
దౌర్జన్యం వా అక్షరాభ్యాసం నిశ్శబ్దంలోకి
వేళ్ళే అభావం స్వభావం

వొకప్పుడూ మెలికలు పడదు నిజమే
ఐదారేడు అక్షరాలు లుంగలు చుట్టుకుని
శబ్దాలుగా దొర్లుకొస్తాయి నిజమే
ఇది ఆధునిక మాండలికమూ
అర్థాన్ని మాత్రమే గొణిగే నిరక్షరమూ
సందేహమూ సమాధానమున్నూ
ఏ భాష మాట్లాడాలి ఏ యాస రాయాలి
ఏ ప్రాస పాడాలి
అమమాణాల్లేవు!
వా శ్రార్థం నా పిండాకూడు
స్పష్టంగా పలకడమూ జ్ఞాపకమే
తప్పుడు ఉచ్చారన
అరచేతి నెత్తుటి పూవుగా
మారడమూ జ్ఞాపకమే
గోడ ఖుర్చీ వీపు మీది వాత గీతలూ
బుగ్గ మీది పంతులోరి మొరటు సంతకమూ
దవడల మధ్య పగిలిన పలుకురాళ్ళ
పలకరింతలూ అన్నీ జ్ఞాపకమే
ఇపుడైతే నాకిక
అచ్చరం రూపంతో పనిలేదు
భావంతో కదా నా వివాదం

బోల్డెన్ని తప్పులు
గొనిగాను
రాసాను
పళికాను
ఇపుడు నాకెంతో
పాగరుగా వుంది ...

(మరాఠీ దళిత కవి అరుణ్ కాంబ్లేకి క్షమాపణలతో)

(సాహిత్య వేదిక, ఆంధ్రజ్యోతి)

అఫ్సర్

ధారవతి దుఃఖం

నువ్వు కారణాలు వెతుకుతున్నావు
నేను పోయిన ప్రాణాలు వెతుక్కుంటున్నాను
ఆయుధం చేతికి చిక్కినప్పుడు
నువ్వెప్పుడైనా వృధా చేశావా?
యుద్ధం కమ్ముకొచ్చినప్పుడు
నువ్వు ఏ పక్షమో నాకు తెలియదా?
ఇక ఈ చరిత్రని నేను
ఏకలవ్యుడి తెగిపోయిన బొటన వేలితో రాస్తున్నాను
ఇక్కడ నువ్వు చెప్పే నవాలక్ష కారణాలు
నీకు నిజమైతే కావచ్చు
నాకు మాత్రం అవి
హిమాలయాలకవ్వా ఎత్తయిన అబద్ధాలు
వేదశ్లోకాల మధ్య
అణిచి పెట్టిన శోకమే నాక్కావాలి
నీ ఉక్కు పాదాల కింద నలిగిపోయిన
వేనవేల నల్లదేహాల జాడ నాక్కావాలి
ఇప్పుడు
నల్ల నినాదంతోనే ఇక్కడ తెల్లారాలి.

వేనెవరైతేనేం
వొంటిరంగు తప్ప
నాగుండె చప్పుడు నీకు వినిపించనప్పుడు,
వొంగివొంగి దండాలు పెట్టడానికే తప్ప
నా దేహానికి వేరే దిక్కు లేనప్పుడు,

నా పూరేదైతేనేం,
నేనెప్పుడూ ఓ మారుమూల
నా చీకటి విషాదాన్ని గూడుకట్టుకున్నప్పుడు
నా కన్నీళ్ళతో
పచ్చబొట్టు పెట్టుకున్న భూమ్మీద
నాకే నూకలు చెల్లినప్పుడు,
ఇక్కడెలా తెల్లారితేనేం,
నా స్వేదంలో తడిసిన ఎండ
నీ ఆకాశాన్ని ఏడు రంగులుగా సింగారిస్తున్నప్పుడు

వేనెవరైతేనేం
కాళ్ళూ చేతులూ విరిచికట్టి
నన్ను తలకిందులుగా తగలబెట్టడానికి,
దేహాన్ని చుట్టకట్టి
నన్ను ఏ తుంగలోనో పారేయడానికి,
ప్రతి ఏడూ పంట కోసినట్టు
నా ప్రాణాల్ని నువ్వు కోసుకుపోడానికి
నా రక్తంతో తడిసిన కళ్ళతోనే
ఇంకా అబద్దాలు చెప్పకు
నా కంఠాన్ని తెగ్గోసే కత్తితోనే
ఇంకా నా వెన్ను తట్టకు

* * *

లోలోపల జాములోయల స్వప్నాల్లో
ఉక్కిరిబిక్కిరవుతున్న నా పిచ్చికవీ,
ఇంకా ఎంతకాలం ఈ తెల్లపద్యాల వెట్టి,
సుందర మందార ప్రతిబింబం కోసం
ఎందుకలా తడుముకుంటావ్,
వికృతమైన మొహాన్ని అద్దంలో పెట్టి
నడిరేయి వెన్నెల కనుబొమ్మల్ని

ఏ పదచిత్రంతో చెక్కాలా అనుకుంటావా?
విరిగిపోయిన దృశ్యాల మధ్య
విశాలమైన ఆకాశాల్ని వెతుక్కుంటావా?
వేళ్ళుతెగే కాళ్ళుజారే కీళ్ళు నడలిన అక్షరాల మధ్య
పూలూ చేలూ కనిపించవేం అనుకుంటావా?
కవీ, నాకు పూలంటే భయంగా ఉంది
అడుగు తీసి అడుగు వేస్తే
శవమే చేతికి తగుల్తున్న చోట
నాకు పచ్చని చేలంటే భయంగా ఉంది
అసలే భయమూ పుట్టించని
ఈ అందమైన ఆకాశాలంటే మరీ మరీ భయంగా ఉంది

మెహ్రానా ప్రేమకథలో
రాలిన కన్నీళ్ళన్నీ నా అక్షరాలే
నీ అహంకారం గోతాముల్లో
కుళ్ళిన దేహాలన్నీ నా అక్షరాలే
నిన్నటిదాకా నీ లాభాల పంటకోసి
గుప్పెడు మెతుకులిమ్మని తిరగబడిన
ఖాళీ కడుపుల కొడవళ్ళన్నీ నా అక్షరాలే

క్షమించు దొరా,
కవిత్వం నీ బాంచ కాదు
అది శిర సెత్తిన నాగలి
కవిత్వం నీ వెన్నెల్లో ఆడపిల్లకాదు
అది చీకట్లో నల్లపులి
అసలు మాట చెప్పమంటావా చివరికైనా?
నిన్ను ఎలాగైనా సుఖపెట్టడానికి
నాకవిత్వం
ఈ దేశపు రాజ్యాంగం కాదు!

(ఉదయం దినపత్రిక)

అడిగోపుల వెంకటరత్నం

ఇక కథ చూస్తావా

గుక్క పట్టి తిరిగిన బొంగరం
ములుకు విరిగి నేల కొరగడం
భూదేవిని బాధతో ముంచేసింది!
మొద్దుబారిన కర్రు
ముసలిదై మంచానపడడం
నేలతల్లిని నిలువునా కూల్చేసింది!
శుష్కశిథిల శరీరాలపై కట్టిన అదృశ్య వేదిక నెక్కి
వికృత రూపాలు పగలబడి నవ్వుతుంటాయి
అది రాక్షసుల కృత్యం కానే కాదు
మనిషిని మనిషి ముగ్ధ మనోహరంగా స్పృశిస్తూ
దగ్ధం చేసిన జాబితా స్వయాన మనిషిదే
స్వజాతిని భస్మీపటలం చేసిన దాఖలాల్లో
దానవులు లేరని నొక్కి చెప్పడానికి దేవతలే సాక్ష్యం !
ఏకలవ్యుల చుట్టూ
గురుదక్షిణ కోరుతూ గురువుల ముట్టడి
శిష్యులు ..... మేం శిష్యులం అనేంత వరకు
శిష్యులెవరో తెలియని గురువులు
అంగవైకల్యాల ఏకలవ్యుల మధ్య
ఒకడు అధిష్ఠించిన సింహాసనం అజేయం
గురువులు వర్ధిల్లాలి!
గురుదక్షిణ వర్ధిల్లాలి!!

వివస్త్రయైన ద్రౌపది రక్షణకై
ఒక్క కృష్ణుడూ సాయంరాని చరిత్ర
పరిపాలన ప్రేక్షక గ్యాలరీలో కూర్చోగా
ప్రదర్శన దుశ్శాసన పర్వమైంది!
మిత్రమా! ఇంత వరకు కథ విన్నావు
ముగింపు ముందు శుభం చెదిరి
ఆరంభం పడి ప్రారంభమైంది
ఇంకిన సూర్యరశ్మి పొంగడం మధ్య
ఇక కథ చూస్తావు!

(అగస్టు 1994, మట్టి మౌనం వహించదు కవితా సంకలనం నుంచి)

దెంచనాల శ్రీనివాస్

స్వదేహాలు

తేదోపాసనలో బాల్యం కరిగీ మంత్రోపాసనలో యౌవనం మరిగీ నీ
అర్చనలో అలసిన వృద్ధాప్యంలో అమ్మ గర్భ కారాగారం నుండి అంతిమ
దృశ్యం వరకూ నీ నామస్మరణలో మునిగీ ప్రహ్లాదుడినై హనుమంతుడినై
జీవితపు బొటనవ్రేళ్లు తెలియని ఎవడో నరుక్కుపోతున్నా ఏకలవ్యుడినై నిన్నే
కొలిచీ అగిన గుండె చెప్పిన నిజం అరవై తొమ్మిదేళ్ళు కొలిచిన భక్తుణ్ణి
పేగులు మాడ్చి మాడ్చి చంపింది నువ్వేనని తెల్సుకొని లంజల కొడకా గర్భ
గది నుండి బైటకు రారా మా ఆడాళ్లు బహిర్భూమికెళతారూ మానవ
రక్తదాహి గది గుడి చర్చి మసీదు మరేదైనా కనీసం బహిర్భూమికైనా
పనికొస్తుందా ఉక్కపోసి ఛస్తామా అని నేనరుస్తుంటే ఇంకా పరుగెడతారేంరా
గారడీ రథాలెంట పవళింపు పల్లకీలెంట రాళ్ళపెళ్లి రాగాలెంట శ్వేత
వస్త్రమ్మిది మందార మరకల్ని చూసి నా వూరు అయోధ్యో బెత్లెహేమో
మక్కానో గురుద్వారో చెప్పలేవని తెల్సీ ఒకే వూళ్లో వుండాల్సిన మానవ
జాతిని వూళ్లు వూళ్లుగా విడగొట్టిందెవరో తెల్సీ అమాయకుడు శంభూకుణ్ణి
చంపిన అమీన్‌రా.. కర్ఫ్యూలో నన్ను కాపాడలేడని తెల్సీ ఐదు రొట్టెలు
రెండు చేపలు ఐదువేల మందికి పంచిన మెజీషియన్‌జ.. ఎనభై ఐదు కోట్ల
మందికి పంచలేడని తెల్సీ ఆడది నీ భూమి దున్నుకుపోరా అన్న
మహిళాద్వేషిమా... నాన్న దెబ్బల్నుంచి అమ్మను ఆపలేడని తెల్సీ పదారు
వేలమందితో ఏక కాలంలో పోయిన పురాణ రజనీష్ నా పెళ్లాం మానాన్ని
కాపాడలేడని తెల్సీ నిను గన్నది మనిషేనని తెల్సుకొని చార్వాకుడినై బతికి
వేనుడినై చితిని జేరువరకు దొంగల కొడకా నువ్ లేవని లేవని అరుస్తున్నా

ముక్కూ ముఖీ మూస్కాని పద్మాననమ్మించి కదలరేం

మంకెన పువ్వెరుపు మరి దొండపండెరుపు లేపాల పెదవెరుపు చెలి
చెక్కిలెరుపు ఎర్ర కోటెరుపు గుండె పాటెరుపు భూగర్భమెరుపు
అరుణోదయమెరుపు అస్తమయమెరుపు అగ్ని ఎరుపు మనిషిలో ప్రవహించే
ద్రావకమెరుపు నను రాస్తున్న కవితెరుపు నే కాలాల్సిన చితి ఎరుపు గోడలు
కూల్చినా కదలని పునాది ఎరుపు పిడి ఊడినా మొక్కవోని పదునెరుపు
మనుషులెల్లిపోయారే తప్ప ఎరుపులెల్లి పోలేదుర ఎరుపంటే కృపాణం అది
ఒక్కటె నిజం కుక్కల కొడకా నువ్వొట్టి అబద్ధమన్నందుకు నన్నదృశ్యం
చేసిన రాజ్యంలో ఇంకా పూజలు చేస్తారేంరా ఎర్రజెండా ఎగరేసేముందు

(గురితప్పిన వద్యం నుంచి)

జి. ఆర్. కుర్మె

నా వాళ్లమధ్య నేను

జీవించడమంటే నా వాళ్లందరినీ
కళ్లకాటుకగా అద్దుకోవడమే
కులాలుగా వెలివేయబడ్డవాళ్ళూ
పాలాలుగా చేలుగా పెరండ్లుగా విడదీయబడ్డవాళ్ళూ
వృత్తిలో ప్రవృత్తిలో ఒకరినొకరు తీసిపోనివాళ్ళూ
తమ రక్తంను చెమట సుగంధంతో శుభ్రం చేస్కునేవాళ్ళూ
నీటినీ కన్నీటినీ కలిపి తాగేవాళ్లూ
తెల్లని చీకట్లో నల్లని వెన్నెల నిడలై కదలాడేవాళ్ళూ
ఇదిగో! నా కనుపాపల తెరలపై నుండి
యిప్పుడే నడచి వెళ్తున్నారు.
నేను నా వాళ్ళ మధ్య బతికున్నట్లుగా నిర్ధారించుకోవాలంటే
నా వాళ్ళ చెమటచుక్కలూ నా రక్తం బొట్లూ
ఒకే బ్లడ్ గ్రూప్‌గా తేలిపోవాలి కదా!
నా మూగ ఉరుముతో నేలపై పిడుగులై రాలిపడిన
నా వాళ్లు నాతో ఏకీభవించాలి కదా!
నేను వారి నోట్లో నాలుకైనప్పుడే కదా
నన్ను నా వాళ్లు గుర్తు పట్టింది.
నా ముద్దుగుమ్మను భుజాల మీదికెత్తి
నా వాళ్ళతో మోయించినప్పుడే కదా
నా ఆనవాలు తెలిసింది.
నేను పునాదిరాయిని వేసినప్పుడే కదా
నా వాళ్ళు నాపై నుండి నడచి వెళ్ళింది.
నేను శిలాఫలకాన్ని మోస్తునప్పుడే కదా
నా బాధ్యతల్ని వారు పసికట్టింది.

(అముద్రితం)

పి.యం.సుందరరావు

కదలిక

మీ మనసులో ఉడుకుతున్న మూడోకన్ను తెరుచుకుంది
మసులుతున్న కుండమీద మూకుడు తొలిగిపోయింది
ఇక ఎన్నటికీ మా చెమటను
మీ శవాలపై పైనలుగా ఏరుకోం
ఎద్దు చాకిరినే కాదు కొమ్ముల కుమ్మును చూస్తారు
ఇక మాబొచ్చెలు వగల గొట్టుకోం
ఎవరి మోచేతి నీళ్ళు తాగం
ఎంగిలి మెతుకుల కోసం కాట్లాడుకోం
చేతపెంచింది నోటికందేదాక తగాదే!
పునాదులు తవ్వేవాడికి
గోడలు కూల్చడం కష్టంకాదు
సమాధిచేసే వాడు చావుకు బెదిరిపోడు
ఇప్పుడు కత్తుల కసరత్తు మీపైనే
చాకిరేవు వీపులోంచి వెన్నెముకలు పొడుచుకొచ్చి
నిటారుగా నిలబడుతున్నాయి
మా నరాలు మీటి మీ గుండెల్లో దండోరాలు వినిపిస్తాం
మధ్యశిలువ శాంతమూర్తిని గాక
ఎడమ శిలువ కాఠిన్యాన్ని చూస్తారిక
శిలువలు మోయటమే కాదు
చీలలు నాటటం కూడా మాకు తెలుసు!

(అముద్రితం)

సొదా

కొక పర్సనల్ హోమెం

ఆదిమ కాలపు సముద్రం
రాతియుగపు చంద్రుడు
పురాతనమైన గాలి
తొలి పురిటి వాసన
తోకలు మొలిచిన మనుషులు
2. 77 యెకరాల స్మశాన భూమి
లేదా నా శరీరం మాదిరిగా నలిగిన వొక దేశం
మాంసపు ధూళి

యీ అంతటినీ నేను హత్తుకుంటాను
అంతటినీ నేను గట్టిగా హత్తుకుంటాను
యేం చేయను
homesick లాంటి దేశభక్తి
దీర్ఘ రోగం లాంటి దేశభక్తి

కానీ నాకు తోక వొద్దు
నాకు యీ తోక వొద్దు
వర్ణమాల రాసిన మనువా
లింగపూజ చేసిన మనువా
నాకీ తోక వొద్దు
నేను హిందువును కాను
నేను హిందువును కాను

యీ లోకను హత్తుకోలేను

నన్ను వొదులు

కత్తులు యెగిరే 13వ శతాబ్ది ఆకాశం కింద వున్నాను

నన్ను వొదులు వొదులు

వొదల్రా వేనిప్పుడే నుస్తీ చేసుకున్నా

యిదిగో నెత్తుటి కత్తి

(ఆదివారం ఆంధ్రజ్యోతి)

ఎస్. గోపి

మాతృభాష

ఉదయం అయినా సరే
మంచు కప్పిన మలుపు ప్రమాదమే
మార్యుడైతేనేమి
వాన కురిపించనప్పుడు
మాటిమాటికి మట్టిపేరు తెస్తావు
నీ అనుభవం మట్టిలో ఇంకి
ప్రాణమై పూస్తుందో లేదో
పెదవుల్లోంచి శవాలు రాలిపడి
అంతా నిశ్శబ్దదుర్గంధం వ్యాపిస్తుంది
వేనే జనం అయినప్పుడు
వా గురించి వాకే వివరిస్తావు
అన్ని భాషలూ నువ్వే మాట్లాడతావు
వా మాతృభాషతో సహా

నీ అక్షరాలు
అడవిలో గర్జకట్టిన
నెత్తురుకు పట్టిన చీమల్లా కనిపిస్తాయి
నీ అహం
వా పహనంపై బరువు మోపుతుంది
గుడ్డివాడు దేన్ని చూసి నవ్వుతాడో నీకు తెలియదు
దిగులుగాలిలో తలపట్టుక్కూచున్న తడివేళ్ల స్వగతాలు నీ కర్థంకావు

అర్ధరాత్రి తలుపు తట్టే వానగోడు వినిపించదు
నువ్వు నిర్దేశించే అరలు పారలే వాస్తవం నీకు
నువ్వు నిలబర్థ చోటునుంచే చూడమంటావు
పక్షుల కలవెప్పలు విప్పిన
ఆకాశాన్ని చూస్తావేమను
విశ్వాంతరాళ విచిత్రశబ్దాలు రికార్డు చేస్తాను
నేనే జనం అయితే
నాగురించి నాకే ప్రవచిస్తావు
నా మాతృభాషని
నీ నాలికతో లిఖిస్తావు
ఫరవాలేదు
నేను గాయపడి చచ్చిపోతున్నప్పుడు
నా ఆఖరిస్పందన
నీకెప్పటికీ అందదని తెలిసి నవ్వుకుంటాను

(ఆంధ్రజ్యోతి వారపత్రిక, దీపావళి ప్రత్యేక సంచిక 1994)

కల్లూరి ఆనందరాజు

వికసిత దళితం

మనుషుల్ని దేవుళ్ళను చెయ్యొద్దు
కానాను మహోత్సవాల్లో ద్రాక్షా రసాల్ని పారించిన
చేతి స్పర్శలిప్పుడు లేవు.

ఎన్ని పర్వతాల్ని కవ్వాలుగా చేసి చిలికినా
కామధేనువులు, కల్పవృక్షాలూ సముద్రం నుండి ఉబికి రావు
ఎడారి సైకత తీరాల్లో స్వైరిణులతో సమాగమాల్ని
ఏ అల్లాఉద్దీన్ అద్భుత దీపంతోనూ సృష్టించటం కుదరదు.

మనుష్యుల్ని పశువుల్లా చూడొద్దు-

వర్ణపు కళాకాంతులు ఇప్పుడు వెలవెలబోతున్నాయి.
అంతరాల్లోని అభిజాత్యాలు పనిలేక మూలన పడుతున్నాయి.

పరికిస్తే కనిపిస్తాయి;
కళ్ళకు గంతలు కడితే మౌనంగా తిరిగిన
గానుగెద్దులు నేడు రంకెలేయటం!
మూతికి చిక్కెం కడితే దుక్కి దున్నిన పశువులు
ఇప్పుడు కొమ్ము లెగరేయటం!
ఈ ఊసులన్నీ ఇప్పుడెందుకంటే-

మా జ్ఞాన నేత్రాలు మా దేహాలగుండా వీక్షించటం
మొదలెట్టిందిప్పుడిప్పుడే.
మేం నేర్చిన ఏలపాటలు, కవిల పాటలు అపొరుషేయాలై
పొరుషాల్ని రగిలిస్తున్నది ఇవాళ నుండే.
పేర్కొనరాని కొలంబు వాళ్ళంటూ ఉంటే
కామోననుకొన్నాం అప్పుడెప్పుడో!
అంతలోనే,
"అవర్ణుడా! శ్వపచుడా! ఛండాలా! అంత్యజుడా!
దివాకీర్తి! అంతేవాసీ! మాతంగా! పంచముడా!"
- అంటూ పిలుస్తూ ఉంటే
సహస్ర నామాలున్న నర్వేశ్వరులమనుకొన్నాం.
"చర్మకార్లమై, పాలేర్లమై, పాకీవాళ్ళమై, చేనేతగాళ్ళమై, వెట్టివాళ్ళమై
కాటికావర్లమై, హమాలీలమై, రిక్షావాళ్ళమై, భిక్షగాళ్ళమై,దొంగలమై"
- మేం పుట్టీ, పెరుగుతోంటే
దశావతారాలెత్తే నారాయణాంశులమయ్యామనుకొన్నాం
మా చేతులు శ్రమైక స్రవీభూతమైన జీవన గంగా జలాలకు
నాసికాత్రయంబకాలని సంతోషించాం
మా పాదాలు పర్వత 'బలి'య సానువుల్ని సాపుచేసే
వామన పాదాలని గర్వించాం.
కానీ! ఇంతవరకూ-
శ్రమైక జలాలు మమ్మల్ని దోచే అగస్త్య భ్రాతల
నోళ్ళలో ఇంకిపోతుంటే,
వామన పాదాలు సత్తువ చచ్చి వల్లకాట్లోకి వెళ్లబారుతుంటే,

ఇప్పుడు,

పునః చేతనులమై, ద్విజులమై

మా జ్ఞాన నేత్రాల్ని మా దేహాలగుండా ప్రక్షింపజేస్తూ,

అగ్నికణాల్ని ప్రోక్షిస్తున్నాం.

మా ఏలపాటల్ని, కపిల పాటల్ని ఆపారుషేయాల్ని చేసి

పౌరుష మంత్రోచ్చాటనం చేస్తున్నాం.

ఇప్పుడు చెబుతున్నాం గుర్తుంచుకోండి

మాకు తోలు వొల్చటం తెలుసు!

మాకు వెన్ను విరవటం తెలుసు!

మాకు కాటికి కాయం మోసి, కపాల మోక్షం ఇప్పించటమూ తెలుసు!

ఔను!

మేం

చర్మకార్లం

పాలేర్లం,

కాటికాపర్లం, ...

(18 - 6 - 93 ఆంధ్రజ్యోతి వారపత్రిక)

దారా సుబ్బారావు

నేను

శీకృత పైశాచిక హింసాకేళిలో
ఆనంద హేలగా విహరించి
ఇంతకాలం నాపై ఎక్కి ఊరేగిన
అహంభావ యిజంచేత
మలినుణ్ణి పాదాతికుణ్ణనిపించుకొని,
నా నరాల తీంద్రాన్ని భోజ్యంగా భక్షించిన
తరాల చరిత్రలో చీదరింపును
ముళ్ళకిరీటంగా ధరించిన వాణ్ణి.
కాళ్లకు చెప్పులు కుట్టిచ్చిన నేరానికి
ఉన్నోళ్ళకి వెట్టి చాకిరీ చేసిన పాపానికి
ముందు వెనుకల ముంత చీపుర్ల కట్టించుకొని
ఊరవతల అకలిమేఘాన్నయి వర్షించిన వాణ్ణి.
కాలం నిలువెల్ల గాయాల్ని పులిమినా
వహించి సహించి సహనం కోల్పోయి
రక్త సముద్రాన్నయి ఎగిసి పడుతున్న వాణ్ణి
బతుకును శాసించిన గతంపై ఉమ్మేసిన
నవీన ధర్మావిష్కృత మట్టిమనిషిని.

(అముద్రితం)

ఎ. దుర్గా ప్రసాద్

నీ ఉచ్ఛిష్టంలో నా దీపం వెలగదు

నా ఎండిన గొంతులోనె

ఎన్నెన్నో ఉదయాస్తమయాలు
ఆపుతావా నీ దశావతారాల తిల్లానా!
నీ ఉచ్ఛిష్టంలో నా దీపం వెలగదు..
నా గుడిసె బూడిదయింది నీ శాంతి వెన్నెల్లోనే!

త్రిశూలాలతో, తల్వార్లతో రక్తం మరకలు మిగిల్చిన
చెరసాలను మోస్తున్న చర్మకారుణ్ణి చెప్పున్నా
ఖండఖండాలైన నా అక్షరంపై
నా అవయవాలపై పడి ఏడ్చేపనిలేదు
మూసుకున్న నీ పంచేంద్రియాలను ఉప్పుపాతరెయ్యడానికి
పంచమ సాగరుణ్ణయి వస్తున్నాను.

చతికిలబడ్డ గాంధీని కాను
నీ 'గీత'లో కరిగిపోవడానికి
ఈ 'వర్ణ' మాలను తిప్పుతున్న రక్తదాహుడే
పాలిమేర్లలో నా గాయాన్ని మళ్ళీ మళ్ళీ చిదుముతున్నాడు
నాగరికతలు మలచిన నా చేతుల్లో ఆకలి మిగులుస్తున్నాడు

పగిలిన మూకుళ్ళు, శవాలమీద గుడ్డలు
ఎండు కట్టెల్లా కన్నీళ్లు, కుక్కల ఏడ్పులే మిగులుతున్నప్పుడు
నా వీరబాహుడా! రా!
ఇంకా శవాలకు కాపలా ఎందుకు?

(అముద్రితం)

సతీష్‌చందర్

నా సముద్రం నవ్వింది

అంత పెద్ద సముద్రానికి
నవ్వు
ఇంత చిన్నదా-
వెన్నెల్లో చేపపిల్ల తళుక్కుమన్నట్లు

వాడెవడో
తెల్లని ఎడారిగాడు
నల్లని వానచుక్కల్ని తాకనన్నాడు
పాలిపోయిన దూది మేఘాలు కాదు-
కండలు తిరిగిన కారు మబ్బులు మాత్రమే
మెరుపు ఖడ్గాన్ని చేతపట్టగలవు

నేలకిందకు
నా కాలికిందకు
యుగాల ఆకాశాన్ని
తరాల అహంకారాన్ని
తెచ్చిపెట్టిన మిత్రమా! సముద్రమా!
ఇదుగో
ఈ మూల తేలుతున్న
నాలుగు రంగుల నాటుపడవ
పాట్టచెక్కలయేట్లు
ఒకే ఒక్క నవ్వునవ్వావా!
నన్ను
నల్ల పరిగె పిల్లలా గెంతనివ్వవా

(5-6-1994 .సుప్రభాతం)

శంఖుక

అహో కులమా !

మొదిగోడు

ముతకగుడ్డ లేసుకుంటే,
పనికిమాలిన వెధవ,
కమ్మోడు అవే గుడ్డలు ధరిస్తే
సాధారణ జీవితానికి అలవాటుపడిన త్యాగశీలి !
అహో ! కులమా !
నీవెంత కిరాతకమైనదానివే ? !

బాపనోడు కులం లేదంటే
మహోన్నత సంఘసంస్కర్త, ఆదర్శజీవి
మాలోడు ఇదే అంటే,
ప్రమాదకరమైన పచ్చి కులతత్వవాది
ఓసి కులమా !
నీవెంత కసాయిదానివే ? !

వాగిరెడ్డి, పుల్లారెడ్డిలో
కులాలేవీ కనిపించటం లేదు
సత్యమూర్తి, పద్మారావుల్లో
కులవాసనలు గప్పుమంటున్నాయి
అహో ! కులమా !
నీవెంత విచిత్రమైన దానివే ! ?

(పాయేదేమీలేనివాళ్లం' కవితా సంకలనం నుంచి)

కో. వ్ర.

ఏకపక్ష సమాధానం

ప్రశ్నలేని సమాధానమెవ్వడూ
ఏకపక్షంగానే వుంటుంది
ప్రశ్నలేని సమాధానాలు మాకక్కర్లేదు
నేర్పితే - ప్రశ్నించే తెగువ నేర్పండి
కాచుకున్న దెబ్బకు కారణాలు అక్కర్లేదు
చూపితే - దెబ్బకు దెబ్బా తీసే దారి చూపండి
సార్లూ - ఇన్నాళ్ళూ -
నోళ్ళు ప్రశ్నించలేదని నరిపెట్టుకొన్నారేగాని
మా కళ్ళలోకి కళ్ళెట్టి చూసారా మీరెపుడైనా-?
ముఖం మీది దరహాసాలనే గాని
మా హృదయ ఘోషల్ని విన్నారా మీరెపుడైనా-?
బిడ్డ ఆకలి తల్లికి తెలియదనటం - అబద్ధం.

నిజమే -
చాకిరీ తప్ప - చైతన్యం లేని
అనుసరించటం తప్ప - ఎదిరించటం లేని
పడివుండటం తప్ప - ప్రశ్నించటం లేని
బతుకు నేపథ్యమేమాది -
కావునే - జెండా మీరై రెపరెపలాడుతూ వుంటే
'బొంగు' మేమై మన్నున కుమిలాం.
తెర ముందుటి మీ చిందులకు, నేపథ్యాన్నందిస్తూ
మా ముఖాలను చీకట్లోనే దాచుకున్నాం.
లక్షలాది ముందు మీరు మా దుఃఖాన్ని ప్రదర్శిస్తుంటే
మా దుఃఖపు 'లయ' ఇది ఔనో, కాదో తెలియక తికమకపడ్డాం.

సార్లూ - పళ్ళు ఊడకొట్టేందుకు
ఏ రాయయినా ఒకటేనని
ఇన్నాళ్ళకు తెలిసింది.
అనుభవం మాదై, వ్యక్తీకరణ మాది కాకుండా పోయింది
ఫరుగు మాదై 'పగ్గం' చేతుల్లో లేకుండా పోయింది
స్వపక్షంలోనూ శకుని మామలుంటారని,
ఇప్పుడిప్పుడే అర్థమవుతోంది
సార్లూ
ప్రశ్నలేని సమాధానమెప్పుడూ
స్వపక్షంగానే వుంటుంది.
కానీయండి - లెఖ్ఖలు తేల్చండి
పేరబెట్టుకొంటే, పొట్ట మురిగిపోతుంది
కానీయండిక లెఖ్ఖలు తేల్చండి
ఎవడి త్యాగం ఎవడికి భోగమయింది?
ఎవడి ఆచరణ ఎవడికి ఆదాయమయింది?
ఎవడి నేల చిందిన నెత్తుటి బొట్టు
ఎవడి కీర్తి కిరీటంలో కలికితురాయి అయింది?
ఒక్క నెత్తుటి బొట్టయినా వృథా పోకూడదు
ఒక్క కన్నీటి చుక్కయినా వృథా కాకూడదు
కానీయండిక లెఖ్ఖలు తేల్చండి
అవమానం కొత్తకాదు, అపజయమూ కొత్తకాదు
ద్రోహం కొత్తకాదు, విద్రోహమూ కొత్తకాదు
ఫల నోట్లో నుండి తప్పించుకోబోయి -
పులినోట్లో మాత్రం పడకండి
కానీయండిక లెఖ్ఖలు తేల్చండి
ఓడుపు చించుకొంటే కాళ్ళమీద పడుతుందని భయపడి
చించుకోకుంటే ఊళ్ల మీదే పడుతుంది
కందమూలకాలు కొత్తకాదు - కిందపడటాలూ కొత్తకాదు

పారిన నెత్తురు పువాదిగా లేచిన
పీఠాధిపత్యాన్ని పెకలించండి
ఎవడి శక్తి వాడికుంది - ఎవడి యుక్తి వాడికుంది
అధినాయకులూ లేరు - అధమాధములూ లేరు
హెచ్చుతగ్గుల్లేవు - ఉచ్చనీచాలు తప్ప
యుద్ధ రంగంలో నిలిచిన ప్రతి ఒక్కడూ వీరుడే
ఎలుకల మద్దిస్తం - పిల్లుల చేతిలో పెట్టకండి
మేకల పెద్దరికం - తోడేళ్ళ కొప్పజెప్పకండి
ఎవడి త్యాగాన్ని వాడి ఖాతాలోనే జమకట్టండి
కానీయండిక లెఖ్ఖలు తేల్చండి
ఆఖరి యుద్ధంలో అశక్తుడే తిరుగులేని శక్తి
తోలు కత్తి పట్టి గాల్లో యుద్ధాలు చేసేవాడు
వెలుగు కోసం మహాప్రస్థానమని కళ్ళు మూసుకు నడిచేవాడు
రక్తసంబంధాలకు మించిన
మానవ సంబంధాలను నెలకొల్పలేడు
బతుకు బతుకంతా యుద్ధరంగమే అయినపుడు
బతుకునుండి పారిపోని వాళ్ళను భీరుల కింద జమకట్టే వాడిని
ఒక కంట కనిపెట్టండి
చేయి అందిన మేర కర్ర తిప్పాల్సిందే
చూపు అందిన మేర నడక సాగాల్సిందే
అడ్డు గోడలు లేవు - పేకమేడలు తప్ప
యుద్ధరంగమిదేనని 'గిరి' గీచేవాడ్ని
ముద్దాయికిందే జమకట్టండి
తనలో జీవకణాలు నశించి - శవ లక్షణాలు సంతరించుకొన్నప్పుడు -
తాను మనిషిగా గుర్తింపు పొందేందుకోసం
మనుషులను శవాలకింద ప్రచారం చేసేవాడ్ని
శత్రువు కిందే తేల్చేయండి
కానీయండిక లెఖ్ఖలు తేల్చండి !

(3-4-94, ఆదివారం ఆంధ్రజ్యోతి)

ఆకుల గంగాధర్

దళిత భారతి

దళిత భారతిలో
కాటికి పోయేకులాలన్నీ
కుస్తీలు పడుతున్నాయి
కూటికిలేని శ్రామికునిశక్తి
ఆధునికం వైపుకు తీసుకుపోతుంటే
కోటికి పడగలెత్తేవాడు
కోతలెన్నో కూస్తుంటే..
జాతి జీవనాడులన్నీ కలాలుపట్టి
కులాల కుస్తి పోరాటంలో
పాలాలు దాటి తారురోడ్లు ఎక్కినయి
జాతిగా జాతులుగా
అణచబడిన అణగబడిన
అనాధ జీవన రేఖలయి ప్రశ్నిస్తూ
శోధిస్తు రోదిస్తున్న వారిని చూచి
ఒక్కటిగా చేస్తుంటే
సమానమని గుళ్ళోకాలు మోపనీయనివాడు
ముందువరునలోకి వస్తుండు
కూనిరాగం తీస్తుండు!
అయినా కారుతున్న ప్రజాయుద్ధ
రుధిర మంత బుద్ధగోచి గాల్లదే

వాడుతూటాలతో
శిలువ వేస్తాడు కావచ్చు
లేదా ఉరికొయ్యల మాలలు తొడగొచ్చు
అంతేకదా అంతేకదా చావుల అంతర్యం
చిత్రహింసల నిలయం
లాంగ్‌మార్చ్ లాంగ్‌మార్చ్ ఫ్లాగ్‌మార్చ్ ఆశయం
కానియ్ వానిపని కానియ్
ఏదోఒకటి ఎన్నాళ్ళయినా
సంకెళ్ళు తెగడం వరకు నీలో రగిలే
నాలోరగిలే త్యాగధనం....

('దళితభారతి' కవితాసంకలనం నుంచి)

ప్రసేన్

సెకండ్ కమింగ్

అయినా... బహుశా....

కానీ.... అంతేనేమో.....

సందేహాన్ని చంపేయడమే,
అనుమానాల్ని పక్కకు గెంటేయడమే
లెక్కంటూ తేలిస్తే జవాబు చివరి పేజల్లో కదా !
ఎన్ని శవాలు గడ్డివాములో
ఎన్ని కాళ్ళూచేతులూ తుంగలో
నిప్పుల్లో నెత్తుట్లో పొలాల్లో
ఎవ్వెన్ని వాడలు ?
నేనేకదా శవాల్లో .....
చెట్టిపుడు వేళ్ళచేతులతో
తన ఉనికిని వెతుక్కుంటోంది
మూసుకుంటున్న గోడల మధ్య
ఐదో గోడను అవిష్కరించాలి
ఎందుకు లొంగి పోయావని
పల్లం ఇపుడు ప్రవాహాన్ని ప్రశ్నిస్తోంది
రంగు రుచి వాసన వెనుక
దైవిక కుట్రను భగ్నం చేయాలి
వా తమ్ముడి కంచాన్నెవరూ కడగొద్దు
ఆ ఎంగిలే రుచిగా ఉందన్న కొత్త కథలు చెప్పొద్దు
వాడు నూకలు చల్లిండీ నిజమే
వలపన్నిందీ నిజమే

పిట్టలన్నీ వలతో సహా ఎగిరిపోవడమూ వాకు అంగీకారమే
ఎలక ఎవరన్నదే ప్రశ్న....
చిత్రగ్రీవుడి నిజాయితీ మీదే వా అపనమ్మకం
వేటగాడి మొహంలో
కౌటిల్యుడి పొలికలు స్పష్టంగానే ఉన్నాయి
వల వేయి కళ్ళతో వలవలా విలపిస్తోంది.
నా తమ్ముడి కంచాన్నెవరూ కడగొద్దు
ఆ ఎంగిలే శుచిగా ఉందన్న కొత్త నాటకం కట్టొద్దు
ఇపుడిక ఉపమానాలూ ఉపమేయాలూ
అలంకారాలూ స్క్రీన్‌ప్లేలూ లేవు
విషయం స్పష్టంగానే ఉంది
నేను నడిచే దారి శుభ్రమయేందుకు
నా మొలకు తాటాకు కట్టావు కదా
మా అమ్మ చనుబాలను నిర్దాక్షిణ్యంగా చిలికారే ?
నా తల్లి కన్నీళ్ళను వస్త్ర కాళితం పట్టారే ??
పాత మాటలను పాత అర్థాలతోనే మాట్లాడదాం
ఎంగిలి మెతుకులే
కొత్త ఒత్తులూ పాల్లులూ కొమ్ములూ
డిసెంబర్ ఆరే కదా మనందరి పుట్టిన రోజు
శంభూకుడి హంతకుడిపుడు హతుడే
ఏడు చేపల కథలో
అవు మేయని గడ్డిమోపుకూ
బంగారు పుట్టలోని చీమకూ ఉన్న దూరమే
శంకరాచార్యుడిని చండాలుడు అడిగే కొత్త ప్రశ్న
నా తమ్ముడపుడెపుడో వెలివేసిన దుఃఖం
మా అమ్మ ఊరవతలిదేవిడీ

ఎంగిలివిపుడు కొత్తగే అంటుకట్టొద్దు
దేహాన్ని అంట్లుగానే ఉండనివ్వండి
నా తమ్ముడి కంచాన్నెవరూ కడుగుతున్నట్టు నటించొద్దు
.....
.....
నేను నిజం చెప్పడం కోసం
అబద్ధం పాడుతున్నాను

('రసన'; ఉదయం)

శంబుక

మమ్మల్నొదిలేయండి

ప్రాణాలతోపాటు తుంగభద్ర కాలువలో, మేము
అనిర్వచనీయమైన దేదో పోగొట్టుకున్నాం
మా రెక్కలు ముక్కలు చేసుకొని త్రవ్వితీసిన కాల్వలో
మా చెమట బిందువుల ప్రవాహంతో
సస్యశ్యామలమైన వంటభూముల్లో
శవాలుగా మమేక మౌతామని,
మేముఊహించుకోలేక పోయాం.
మా రక్తంతో ఎర్రబారిన తుంగభద్ర కాలువ
ఉరకలతో సాగర కెరటాలతో సంలీనమౌతుంది.
మమ్మల్నొదిలేయండి, మాచావు మేంచస్తాం.
తాటాకు మంటల్లాంటి ఆరంభపు ఆర్భాటాలతో
పత్రికా ప్రకటనల్లో చేసే బ్రహ్మాండమైన ప్రతిఘటనా పోరాటాలతో
ఎండమావుల ఆశల ఆనందాల్ని రేకెత్తించి
మా శవాలను మీ రాజకీయాలకు ముడిసరుకుగా వాడుకోకండి !
మా శవాల మధ్యలో నిలబడి మాట్లాడకండి !
కారంచేడులో ప్రారంభమయిన మీ నడక
మరెన్నో కారంచేడులు దాటుకుంటూ, నేటికి
చుండూరు చేరుకుంది గదా ! ఈ మధ్యలో
ప్రతిఘటనలన్నారు, ప్రతీకారాలన్నారు. ఇంకేవేవో
పాలకవర్గ వాగ్దానాలను తలపింపజేసే
నిర్ణయ ప్రకటనల హోరెత్తించారు
అక్కడనుండి ఇక్కడకు, ఇక్కడనుండి ఎక్కడికో .... ?
మమ్మల్నొదిలేయండి, మాచావులెలాగో మేం చస్తాం.

మా శవాల్ని గాలించే శ్రద్ధాశక్తులు
శత్రువుని గాలించటంలో కనవర్చరేం ? మా చావులు
మీ రాజకీయపు బెత్తుగడల ప్రచారాల్లో భాగమై
మీ వ్యక్తిగత వాయకత్వ ఇమేజ్‌లు పెంచుకోవటానికి సోపానాలై
.... దయచేసి
మమ్ముల్నాదిలేయండి, మాచావులెలాగో మేంచస్తాం
వాడు చుండూరులు సృష్టిస్తూనే వుంటాడు
సృష్టించనీయండి, మా
బిడ్డలు "బారా" లకు మార్గాలు నిర్మిస్తున్నారు
మమ్ముల్నాదిలేయండి, సంద్రంలో కలిసి
అలల కెరటాలమౌతాం.
పెనుతుపానులై ప్రభంజనాన్ని సృష్టిస్తాం.

(చుండూరు మృతుల గాలింపు వార్తకు స్పందనగా)

(పోయేదేమీలేనివాళ్లం' కవితా సంకలనం నుంచి)

జె. గౌతమ్

వేచి చూడండి

మమ్మల్ని వదిలేయండి మేము నిర్దోషులం
ముళ్ళదారి నడిపించకండి పాదాలు కుళ్ళిపోతున్నాయి
మమ్మల్ని పరుగులెత్తించకండి ప్రాణాలు అలిసిపోతున్నాయి
ఎక్కడో సుధీర అగాధంలో ఉన్నామని తలచి
ఆప్తులుగా వచ్చాము
రమ్మని పిలిచి మేము రాగానే నిట్రూళ్ళకు కట్టేసి
నిలువెల్ల మోసం చేయకండి
అడవిలో సంపెంగవానన అది మాకిష్టమని వెళ్ళిన మా బిడ్డల
శవాల సువాసనలను గాలి ద్వారా పంపించకండి
కత్తులతో కోలాటమాడదామని చెప్పి
శత్రువుతో కరచాలనమ్ చేయకండి
పల్లకీలు మోసిమోసి బరువెక్కిన భుజాలను తట్టి
బ్రతుకు పోరు సలుపుదాము రమ్మని చెప్పి
మీరెక్కి కూర్చోకండి పల్లకీలో, మోయలేక చస్తున్నాం
మా తల్లీ చెల్లీ పేగుల్ని మడతపెట్టి మరీ వచ్చాము
వాళ్ళ పుట్టుకను వృధా చేయకండి వాళ్లకి పుత్రశోకాన్ని కానుకివ్వకండి
ఏటికి ఎదురీదుదామని ఎంచక్కా కబుర్లుచెప్పి
కల్లోల సుడిగుండంలోకి నెట్టేయకండి
అమాయకులం మేము అంతా మీ మాటలే
సిద్ధాంతాలు మీకు తప్ప మాకేం తెలుసు ?
మాకు కళ్ళున్నా పెకిలించి మరీ పీకేసి
నడి చీకటిలో వదిలేసి మరీ వెళ్ళారు
సంబర పడకండి మా కళ్ళు భద్రం ! మరీ భద్రం
వెలుగు మాదే. చీకటే మీది

కృత్రిమ కాంతితో పేకాటలాడుకోండి
హృదయాన్ని మత్తులో ముంచుకోండి
వాయనా ! ఎందుకయ్యా మమ్మల్ని మెనం చేసారు
మేమేమి పాపం చేసామయ్యా ?
మమ్మల్ని ఎండలో నిలబెట్టారు
సంవత్సరాల ప్రయాణాన్ని ప్రళయంగా తయారుచేసి
ఎక్కిన మెట్ల మీద నుంచి రెట్టింపు మరీ వెనక్కు నెట్టేసారు
దిక్సూచివైపు పోనిచ్చే సరంగులని నమ్మాం
సముద్రంతో చేతులు కలిపి నావనే వదిలేసారు
మీరు దూకిన చోట గుల్లలు తప్ప ముత్యాలు దొరకవు
తెరచాప మావద్దే వుంది సుడిగుండాల్ని తట్టుకోగలదు
మిమ్మల్ని ఎత్తిన చేతులతో తెడ్డు నడుపుకోగలం
అనుభవం పాఠాలు నేర్చుకున్నాం
ఒకవేళ మీరు మళ్ళీ వస్తే మా వెనకాలే రండి
మేము ముందుంటాం వేచి చూడండి
"ఉత్త చేతుల మీద నిర్మిస్తాం ఈ దేశాన్ని"

(మే 1992, ఏదురీత)

కంబుక

దళిత గర్జన

నేను భూమి మీద పడకముందే
నా తల్లి గర్భంలోనే
అస్పృశ్యుడుగా పెరిగి
హీనకుల ముద్రతో ఈ పవిత్ర భరత భూమి పైపడి కళ్ళు తెరిచాను.
నేనెవరినో నా తల్లి
గర్భంలోనే నిర్ణయం అయిపోయింది
నా గుడిసె-నా పరిసరాలు
నా కులానికి ప్రతీకలుగా నిలిచాయి,
ఊరిబయట వల్లకాటి సమీపంలో
విసిరేసినట్లున్న నా గుడిసె
నా కులానికి సంకేతం
నా కులమే నా గుడిసెకు ప్రతిరూపం

కామ్రేడ్ ! మనువు నన్ను
శూద్రుడిన్నాడు - ఛండాలుడిన్నాడు
అస్పృశ్యుడిన్నాడు - అంత్యజుడిన్నాడు
నేను చదువుకోకుండా వుండటమే
నేను అగ్రకులాలకు చాకిరీ చేయటమే
వర్ణధర్మమన్నాడు, దేవుని ఆజ్ఞ అన్నాడు
వేదాలలో ఉపనిషత్తులలో
స్మృతుల్లో, శ్రమల్లో
అరణ్యకాలలో, బ్రాహ్మణాలలో
పురాణాలలో, ఇతిహాసాలలో, గీతల్లో
వర్ణ ధర్మాల పేరుతో

పూర్వజన్మ సుకృతాలవెంతో
తలరాతల వంకతో వందల ఏళ్ళ నుండి
వా బ్రతుకును శాసించి
నా మేధస్సుకు మేకులు గొట్టి
అగ్రకులాలకు శాశ్వతంగా నా చేత
ఊడిగం చేయించటానికి వ్యూహం పన్నాడు.

నిన్నడిగేది ఒక్కటే కామ్రేడ్ !
వర్ణధర్మం పేరుతో వాడు నన్ను ఈనడిస్తే
వర్గపోరాటం పేరుతో
నీవు నన్ను విస్మరిస్తున్నావు
తలరాతల పేరుతో వాడు
నన్ను కట్టిపడవేస్తే,
ఉపరితలం పేరుతో నీవు
నానోరు నొక్కుతున్నావు
సంస్కృత శ్లోకాలతో వాడు
మార్క్సిస్టు పడిగట్టు పదాలతో నీవు
నన్ను గందరగోళంలోకి నెట్టారు
నిన్ను అడిగేది ఒక్కటే కామ్రేడ్ !
నీవు ఈతశాస్త్రమే చదివావు
నేను ప్రవాహపు ఎదురీతలో వున్నాను.
ముల్లుగుచ్చుకున్న బాధితునిగా,
దానినొప్పిని భరిస్తున్నాను నేను
ముల్లుగుచ్చుకోని నీకు దాని
ఒప్పితీవ్రతేమిటో తెలియదు
కులాల అవమానాల అగ్నిలో
దగ్ధమవుతున్న వాడికే
దాని బాధేమిటో తెలుస్తుంది.

దృశ్య, పఠనా విశ్లేషణ నీది
అనుభవాల అవేదన నాది
నిన్ను అడిగేది ఒక్కటే కామ్రేడ్ !
కుల ధర్మాల కుటిల వన్నాగాల్లో
నన్ను బందీని చేసి, బానినగా మార్చి
అగ్రకులాలకు సేవచేయించాడు వాడు,
నాయకత్వ పరిరక్షణా జిత్తుల్లో
నన్ను ప్రతిభలేనివానిగా ముద్రవేసి
పార్టీ క్రమశిక్షణా బంధంలో
నన్ను పార్టీ మూగ సేవకునిగా మార్చి
నీ స్థానాన్ని నీవు పదిల పర్చుకుంటూ
నా స్థానంలో నన్ను వుంచుతూ వస్తున్నావ్
వాడి దృష్టిలో పాపినైతే
నీ దృష్టిలో ప్రతిభలేని వాడినయ్యాను
వాడికి కులం ఆయుధం అయితే,
నీకు మార్క్సిజం
ఆయుధం-కవచం రెండూ అయ్యాయి
వాడి విలాస జీవితానికి పునాది నేనైనట్టే
నీ ప్రతిభకు గూడా పునాదిని నేనే కామ్రేడ్ !
ఒక రూపంలో వాడు అగ్రకుల పెతందారీ అయితే
మరొకరూపంలో నీవు నాయకత్వ పెత్తందారీవయ్యావ్
నిన్ను అడిగేది ఒక్కటే కామ్రేడ్ !
నీవంటున్నట్టు నేను ఊపరి తలాన్నీ కాదు, పునాదినీ కాదు
మీ అగ్రకుల పెత్తందారీ నాయకత్వాల్ని
కుప్పకూల్చే పీడిత కులస్తుడిని
మీ పెత్తందారీ నాటకాల
ఆటల్ని కట్టించే బాధితకులస్తుడిని
ఆటవిక, ఆధునిక మనువుల్ని
పారద్రోలేందుకు సిద్ధమయిన

ప్రతిభలేని పామర పేదకులస్తుడిని
నిన్ను కోరేది ఒక్కటే కామ్రేడ్ !
వాడు చూపే స్వర్గం వద్దు
నీవు చెప్పే విముక్తీ వద్దు
నాయకత్వ ఎంజాయ్‌లో నీవు
చేసే త్యాగాలు అవసరం లేదు
నేను కోరేదిదే కామ్రేడ్
ముందు మీ పెత్తనాల నుండి విముక్తి కావాలి
భూస్వామి తన ఆస్తుల నొదులుకోనట్టే
మీరూ మీ నాయకత్వాల్ని వదులుకోలేరని
మాకు బాగాతెలుసు కామ్రేడ్ !
ఏడు దశాబ్దాల అనుభవంలో
మాకు బాగా తెల్సును కామ్రేడ్ !
దోపిడీని తుదముట్టిస్తానికి
పోరాటం అనివార్యమైనట్టే
మా "ప్రభువులు"గా మిమ్ముల్ని
మీ నాయకత్వం పీఠాల నుండి త్రోసివేయటానికి
బలవన్మార్గమే మాకు శరణ్యం

కామ్రేడ్ !
నిన్ను ఇప్పుడు కామ్రేడ్ అంటున్నందుకు
చిరాగ్గా, బాధగా వుందిగదూ?
మీ అగ్రకుల నాయకత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకు
నేను కులతత్వ వాదినయ్యాను గదూ?
అగ్రకుల కామ్రేడ్ !
కులబాధితునిగా, నేను
కులాలు వుండాలని ఏకోశానా భావించటం లేదు
సాకా అవసరం లేదు.
కులపరంగా సమాజం నీకిస్తున్న
అగ్రకుల గౌరవ పీఠాలు, హుందాతనం ప్రత్యేక గౌరవాలవల్ల

దీని ఉనికి, తత్వం నీకు అవసరం వుండవచ్చు
కులం ద్వారా సాంఘిక ఔన్నత్యాన్ని పొందుతున్న నీకు
కులం అవసరం వుంటుంది గానీ
దీనివల్ల సాంఘిక హైన్యతను అనుభవిస్తున్న నాకు
కులంతో పనిలేదు కామ్రేడ్ !
కులం లేనట్లు నటించటంలో కమ్యూనిస్టుగా నీవు
గిన్నిస్ బుక్‌లో కెక్కటానికి అర్హుడవు
డెబ్భైఏళ్ళ నుండి నీవు రాస్తూ వస్తున్న
ప్రణాళికలు - డాక్యుమెంట్లు
నీ నటనకు చక్కటి నిదర్శనలు
అగ్రకుల కామ్రేడ్ ! నీకు చెప్పేదొకటే,
అవును మేము కులవాదులమే,
నీవు ఏపేర్లు పెట్టుకున్నా, ఏ రంగు పులిమినా
అగ్రకుల దుర్మార్గుల ఆట కట్టించటానికి
కులమే మాకు అయుధం
సమాజంలో కులమే లేదనే
మార్క్సిస్టు మిధ్యావాదివి నీవు.
భారతీయ సమాజంలో
కులాలు కనిపించవు నీకు
అగ్రకుల కామ్రేడ్ ! నిన్ను
హెచ్చరించేదొక్కటే.
నీవు ఎన్ని ముద్రలేసుకున్నా
మేము పీడిత కులస్తులం. పీడిత కులవాదులం
అగ్రకుల చీకటి రాజ్యాన్ని
పారద్రోలే దళిత విమోచనా వెలుగులం
సమసమాజ నిర్మాణ రణధీరులం
పీడిత, తాడిత ఉద్యమ రధసారధులం
పోరుబాట వారసులం
నవయుగ నిర్మాతలం.

('పోయేదేమి లేని వాళ్లం' కవితా సంకలనం నుంచి)

వరదయ్య

ఇద్దరం కలిసే

వస్తావా
పేచీయేలేదు
రావా
ఏం ఫరవాలేదు
నువ్వొచ్చినా రాకపోయినా
నేవాగేదిలేదు
మాడు పగుల్తున్న ఎండల్లో
మొహమాటాలొద్దు
కోర్టులోకి దిగిం తరువాత
కబడ్డీ ఆడాల్సిందే
నీది పదోమెట్టు
వాది కింది మెట్టు
నీ చూపంతా శిఖరం మీద
వాది పదోమెట్టు మీద
కంచెదాటినోడివి నువ్వు
నీకు అందరూ కావాలి
కంచెలో చిక్కుకున్నోణ్ణి నేను
నాకు నేను కావాల ముందు
నావోడు కావాల

ఇల్లు కావాల్సింది నాకా నీకా
మిట్టపల్లాలు తెలిసింది నాకా నీకా
కప్పుమీద నువ్వెక్కి
ఆకులందించమంటావాన్ను
అదేమంటే

నాకు తెలీదంటావా
నాకు తెలీక అడుగుతా
నాకూడు నువ్వెందేదెందని
నాపాలం నువ్వు దున్నేదెందని
నా లెక్కల్ని నువు తేల్చేదెందని
నా బతుకును నువు బతికేదెందని

నాకు చేతుల్లేవా
నాకు తెలీదా
చెప్పులు కుట్టినోణ్ణి నడవలేనా
గడ్డంగొరిగినోణ్ణి గంజలు తియ్యలేనా
తాడెక్కినోణ్ణి మట్టలిరవలేనా

ఎప్పుడన్నా కత్తిబట్టుకొని ఈతచెట్టెక్కేనా
ఎప్పుడన్నా తుమ్మపాదల్లో ముళ్ళు నరుక్చిచ్చావా
మోకాలు మీద నుంచి బస్తాను భుజం మీదకి వేసావా.

ఎప్పుడన్నా కందనకాయ కడిగావా
రూపముండీ మాయమై బతికావా
కళ్ళుండీ గుడ్డిబతుకు బతికావా
నీ అరికాళ్ళలో గాయాలమచ్చలు చూపించు
నీ వంటిమీద ఒక్క చర్నాకోలువాత చూపించు
నీ ముఖంమీద కూర్చున్న ముదురుతనం చూపించు

నా తరుపున నువు కోతకోసి
నా తరుపున నువు బేరంచేసి
నా తరపున నువ్వే తినవని రూలేంది
ఏలు కోసివ్వడానికి
ఈరోజు
నేను పిచ్చి ఏకలవ్యుణ్ణనుకున్నావా

తలవంచి
తపస్సు చేసుకోటానికి
నేను శంభూకుణ్ణనుకున్నావా

దొంగ బాణం దెబ్బతో
కిందపడి తన్నుకోటాన్కి
నేను వాలినననుకున్నావా
మనువు మక్కెలిరిచేవాణ్ణి నేను
రంగుల్ని ఉరితీసేవాణ్ణి
నన్ను కుంటోణ్ణి చేసిన,
ఈ దేవుళ్ళచర్మం ఒలిచేవాణ్ణి

రా దమ్ముంటే కిందికొచ్చి నాతోనడు
పగ్గాల్నీ బెత్తాల్ని ఒదిలి
పచ్చని నవ్వుతో రా
ఇద్దరం కలిసే
ఎక్కుదారి ఈ శిఖరం.

(సంతకాలు, 1994)

శంబుక

పోయేదేమీ లేనోళ్ళం

మీకు పోయేదేమీ లేదని
ఎవరిగూర్చి అయితే అన్నాడో
ఆ ఏమీ లేనోళ్ళం మేం
వాడు,
మాకు నాయకుడిగా
మా అపద్భాందవుడిగా
మాకోసమే జీవిస్తున్న వాడిగా
మా సేవలోనే తలమునకలౌతున్న వాడిగా
ప్రజాస్వామ్యం పేరుతో
ఓటుల పేరుతో
మమ్ముల్ని బడ్జెట్టుల భ్రమల్లో ముంచెత్తుతూ
లోనుల ఆశల సుడిగుండంలో
గిరగిరా త్రిప్పుతూ
మమ్ముల్ని మత్తులో ముంచెత్తి
నిరంతరం మా రక్తాన్ని
పబ్లిక్‌గా జుర్రుతున్నాడు
ప్రజాస్వామ్యం పేరుతో
ప్రజాసేవ ముసుగులో
మమ్ముల్ని కూటికీ, గుడ్డకూ, గూటికీ
దూరం చేసి, దగా చేసి
మా ఎముకలోని చివర మూల్గును పీల్చుతున్నాడు
వీడు,

విముక్తి పేరుతో, సమసమాజం పేరుతో
ఆరు దశాబ్దాల పైగా
మాచేత ఎర్ర జెండాలు మోపిస్తూ
తన పెత్తనాన్ని సంరక్షించుకుంటూ
తన పదవుల్ని కాపాడుకుంటూ
ఎర్రెర్రటి కార్యాలయాలలో
పోరాటరహిత ఆర్భాటాలతో
అప్పుడప్పుడూ పార్టీ సభలనే
జాతరలు నిర్వహిస్తూ
ఫ్యానుల కుర్చీల క్రింద బందీయై
ఎన్నికల జోరులో అన్నిటికీ పాల్పడుతూ
మాదగ్గరకు రావటమే మరిచి
మమ్ముల్ని తన చుట్టూ తిప్పుకుంటూ
పోలీసులతో ముందుగానే మంతనాలాడి
శత్రువు "భేష్" అనే రీతిలో
మా ఎండిన డొక్కల కళేబరాలతో
ధర్నాలు, పికెటింగులు, ఊరేగింపులు
బహు పసందుగా జేపిస్తున్నాడు
అందుకే పీడికి
శత్రు పక్షం మిత్ర పక్షమయింది
ఎర్రజెండా వ్యాపారం చేస్తున్న
ఈ ఎర్ర బూర్జువా
వాము పక్షీయుడో, రాము పక్షీయుడోగాని
మా వ్యతిరేక పక్షీయుడని మాత్రం
మేం గుర్తించాం.

అదుగో, ఇంకొకడు
పోరాటం అంటూ అరాటపడుతున్నాడు

ఆర్థిక పోరాటమే అన్నిటినీ మారుస్తుందంటూ
మా ఆత్మగౌరవాన్ని అపహాస్యం చేస్తున్నాడు
వ్యూహాలు, ఎత్తుగడలు పేరుతో
మా సాంఘిక హైన్య స్థితిని కొట్టివేస్తూ
వందల ఏళ్ళ నుండి మమ్ము
అగ్ర కులోన్మాదులు వెంటాడి
వేటాడి చంపటాన్ని
సమస్యకాదని బుకాయిస్తున్నాడు
మమ్ము ఉపరితల వాదాల అంచుకెక్కించి
అమాంతం క్రిందికి నెట్టుతున్నాడు
పునాదుల వాదాల పొరల క్రిందకు త్రోసి
సమాధి చేయాలని చూస్తున్నాడు.
మన్నే శేషయ్య, దుడ్డు ఆలీసమ్మ
దోనేపూడి కమలాకర్, కంచికచర్ల అర్లప్పల
చావుల్లో, ఆర్తనాదాల్లో
కనపడుతున్న వర్ణ దురహంకారాన్ని కాదని
కనపడని వర్గ దౌర్జన్యాన్ని చూపిస్తున్నాడు
"ఇదేమని" ప్రశ్నించే మాకు
కులతత్వం అంటగట్టుతూ
గతి తార్కిక భౌతిక వాదాల
పునాదుల పదఘట్టన క్రింద
మా సాంఘిక గౌరవాన్ని
పూడ్చేయ ప్రయత్నిస్తున్నాడు.
లక్షలాది పల్లెల జీవితాల్నీ
ఆ పల్లెల్లో వున్న కులవైరుధ్యాలనీ
విప్లవ కేకలతో విస్మరిస్తున్నాడు
ఊరిలో వెట్టంతా చేస్తూ

ఊరిబయట జీవించే రెండు కాళ్ళ
"సాంఘిక" వశువుల హైన్యాన్ని
జనరలైజ్ చేయ సిద్ధాంతీకరిస్తున్నాడు

ఇడుగో, ఇంకొకడు
కులం పేరుతో ముందుకొస్తూ
దళితుడి రూపంలో దళారిపని చేస్తూ
మమ్మల్ని తాకట్టు బెట్టచూస్తున్నాడు,
రూపంలో మిత్రుడిగా నటిస్తూ
సారంలో శతృపాత్ర పోషిస్తున్నాడు
మా ప్రతిఘటనా పోరాటజ్వాలపై
నీళ్ళు కుమ్మరించ యత్నిస్తున్నాడు
శతృవుపై ఎక్కు పెట్టిన మాగురిని
ఎక్కిరిస్తూ విచ్ఛిన్నం చేస్తున్నాడు
శతృవుపై ఎక్కు పెట్టిన మాగురిని
ఎక్కిరిస్తూ విచ్ఛిన్నం చేస్తున్నాడు
భూమి పుత్రులమైన మాకు
పిరికిపాలు పోస్తూ, మమ్మల్ని
అశక్తుల్ని చేయ పూనుకుంటున్నాడు.
ఈ బూర్జువా చట్టాల పడగనీడలో మాకు
ఆశ్రయం కల్పించ చూస్తున్నాడు.
నీళ్ళను "నీళ్ళు" గా గుర్తించేసరికి
మాకు అరవైఏళ్ళు పట్టింది.
మేము పోయేదేమీ లేనోళ్ళం
కడుపులు కాలుతున్నోళ్ళం
గుండెలు మండుతున్నోళ్ళం
పోరులో ముందుండే వాళ్ళం
మమ్మల్ని ఇంతకాలం

పరాధీనులుగా, ఫాలోవర్స్‌గా
మమ్మల్ని మేము కాకుండా చేశారు
వీళ్ళు ఉద్ధారకులుగా
మేము ఉద్ధరించబడేవాళ్ళంగా
పూడ్చలేనంత అగాథాన్ని సృష్టించారు
మేము మోసపోయాం
జీవితకాలం మోసగించబడ్డాం
ఎండిన పుల్లలు మండుతాయ్
ఎండిన దొక్కలు తిరగబడతయ్
ఈ సాంఘిక-ఆర్థిక అసమానతలపై
సాయుధంగా తిరగబడతాం
మాకు మేము మార్గదర్శకులమౌతాం
మేము కారల్‌మార్క్స్ చెప్పిన
పోయేదేమీలేనివాళ్ళం.

(పోయేదేమీలేని వాళ్లం కవితా సంకలనం నుంచి)

ఉదయ్

నిజాన్ని పాతరేసిన ఇజం

ఇల్లు అలికి ముగ్గులేద్దామనే లోపే
నీవు పాడికాళ్లతో వచ్చి కచ్చావచ్చడిగా చేయటం
ఇప్పటి వరకూ మట్టి కుండలలోనే గంజి త్రాగిన వాళ్లం
ఈరోజు వెండి పళ్ళెంలో అకలి తీర్చుకుంటానని అంటుంటే
భూమి కంపించినట్లు అవ్వ ముఖంలో ఏడ్పునవ్వులు మెలితిరిగినాయి

అక్కా, చెల్లెళ్లు
నా చొక్కా వేసుకుని నా ప్రక్కనే నడుస్తుంటే
మీరు మొగుళ్ల పేర్ల సమర్థనతో బురదలలో చిందులేస్తే
చివరకు మా కుండలోని నీళ్లతోనే శుద్ధి చేసుకోగలరు
నేను పెంచి పోషించుకున్న శరీరం నుండి
ఒక్కొడు ఒక్కో భాగాన్ని పెరికి వేస్తుంటే
ఎంత కచ్చిగా కసి పెరుగుతుందో
చిన్నప్పట్నుంచి గిరగిర కర్రత్రిప్పటం వేర్చుకున్న వాళ్లం
అకస్మాత్తుగా నీవు కర్రను తీసి గోతిలో పాతిపెడితే
అసహనాన్ని పిడికిట్లో దాయలేకపోతున్న వాళ్లం
శత్రువు గుండెల్లో దళిత పిల్లిలా నీవు సంచరిస్తే
నేను దళిత సింహంగానే సంచరిస్తాను
ఎత్తుగడల పంథా, భౌతిక పరిస్థితుల
పదుగు పేకలతోనే గుడ్డను తయారు చేయగలిగిన వాళ్లం
నిజాలను పాతరేసిన నీ 'ఇజాన్ని' పొరలు పొరలుగా తొలుస్తూ
వెలుగువిచ్చిన కళ్ళల్లో చీకటి వెంటాడకుండా వుండటానికి
నేను సాయుధంగానే సెంట్రీ చేస్తూ వుంటాను.

(అముద్రితం)

శంబుక

ఎర్రదొంగలు

చికాగోలోని "హే" మార్కెట్టులో
ఎనిమిది గంటల పనిదినం కోసం
కార్మికులంతా రణధీరులై
సాగించిన నమ్మె సమరంలో
రక్తాన్ని చిందించి
అరుణ వర్ణ పతాకానికి ప్రతీకలయ్యారు
ఈ అమరవీరుల రక్తంలో తడిసి
పైకెగసిన ఎర్రజెండా, ఇక్కడ
పెట్టుబడిదారీ వర్గాలతో చేతులు కలిపి
ఓట్ల దేబిరింపు వేటలో
బూర్జువా పార్టీల జెండాల నరనన
జీబులూ కార్లపై అలంకరించబడి
రెపరెపలాడుతోంది
అమెరికా ఎర్రసిల్కు బట్టతో
అందంగా తయారుచేయబడి
ఖరీదైన తెల్లటి స్టీల్ పైపులకు తగిలించబడి
డాబాల శిఖరాలపై మందహాసంగా ఎగురుతోంది
కార్మికవర్గ చేతిలో నిలవాల్సిన ఎర్రజెండా
బూర్జువాలు, పెటీ బూర్జువాలు
లాక్కొని స్వంతం చేసుకున్నారు
అందుకే, పోరాట దీక్షాదినాలు
వేడుకల సంబరాలయ్యాయి
పోరాటానికీ త్యాగానికీ

సంకేతమైన ఎర్రజెండా,
కార్మిక వర్గానికీ, విప్లవానికీ
ప్రతీకైన ఎర్రజెండా
దోపిడీ పార్టీలకు "కుడి," "ఎడమ" ల
రక్షణ కవచంగా మారిపోయింది, కాబట్టే
ఎర్ర బూర్జువాలు విప్లవాలు వల్లిస్తున్నారు
"మేడే" కార్యక్రమాల్ని
ఫ్యాక్టరీ యజమానులే చేస్తున్నారు
లాఠీంగులు నిర్వహించే బ్రోకర్లు
బారులు నడిపే బడుద్ధాయిలు,
ఆస్తిహక్కు రద్దుకోసం పోరుచేయాలని
పెదాలపై వల్లిస్తూ
ఆస్తుల్ని పోగేసుకుంటున్న
మార్క్సిస్టు వ్యాపారులు
సమాజంలో కౌటిల్య కులాలేవీ లేవంటూ
"వర్గం వర్గం" అంటూ కొంగజపం చేస్తున్న
మార్క్సిస్టు అద్వైతులు
తన కొడుకులూ, కూతుళ్ళకు
తన కులపోళ్ళను మాత్రమే ఏరిఏరి
పెళ్ళిళ్ళు చేస్తున్న మార్క్సిస్టు మనువులు
ఇంటిగుమ్మంలో మార్క్స్, లెనిన్‌ల ఫోటోలు తగిలించి
ఇంటిలోపల దేవుని ఫోటోలు తగిలించే
హిందూ కమ్యూనిస్టులు
ఎర్రజెండా నాయకులుగా
వెలిగి పోతున్నారు, ఎదిగి పోతున్నారు
దోపిడీశక్తులకు సింహస్వప్నమైన ఎర్రజెండాను
వాలుగు సీట్లకోసం కక్కుర్తిపడి

బేరసారాలకి అర్థంబెడుతున్నారు
ఈ ఎర్రజెండాబట్టి
ఎంతమంది "బుక్కాపకీర్లు" లక్షాధికారులయ్యేరో
ఈ ఎర్రజెండా పట్టి ఎంతమంది దళారులు
కంపెనీ యజమానులతో లాలూచీపడి
కార్మికుల బొచ్చల్లో మట్టిగొట్టారో?
ఈ ఎర్రజెండాపట్టి ఎంతమంది వెధవులు
పదవుల నధిరోహించారో?!
ఈ ఎర్రదొంగల వనిపట్టకుండా
ఎర్రజెండా ఎన్నటికీ
విజయ జెండా కాలేదు, కాబోదు.

('పాయేదేమీలేనివాళ్లం' కవితా సంకలనం నుంచి)

కృపా:

ఆహ్వానం!

నా ప్రియతమా
వెలుతురు కిటికీపై వాలిన స్వేచ్ఛా విహంగమా
గబ్బిలం పాడిన ఆరని అగ్ని కణాల కన్నీటి సందేశం విన్నావా
శ్మశానవాటిక చీకటి వెలుగుల మంటల పాటలు విన్నావా
లక్షోపలక్షల దక్షిణాఫ్రికాలై దళిత పల్లెలు కురిపిస్తున్న
భేతాళ ప్రశ్నలకి జవాబులు వెతికావా
చీకటి పల్లెల నడుమ పొద్దుపొడుపై నిలిచిన మహాసభ ఇదిగో
ఖండికలై పడుతున్న లక్ష్యరహిత పాదముద్రల మీదుగా
కొత్తబాటలేస్తున్న ఊరేగింపిదిగో
వెక్కిళ్ళ వొంటరి శోకాలన్నీ
ఆత్మగౌరవ, ఆత్మరక్షణ నినాదాలై సాగిన సమూహ ఆగ్రహమిదిగో
హైందవ సర్పం వేయి పడగలతో చిమ్మిన కుహనా విలువల విషాన్ని వొదుల్చుకుని
నూతన మానవ లోకాన్ని నిర్మిస్తున్న దళిత శక్తితో చేయి కలపరావా?

(17. జూలై 1994, ఆదివారం ఆంధ్రజ్యోతి)

నలంద్ర

దళిత్ మానిఫెస్టో

నన్ను
నీ దేవుని గుళ్లోకి రావద్దన్నావు
సరే, ఎలాగయితేనేం
నేను నాస్తికుణ్ణవటమే బాగయింది
నన్ను
చదువుకోవద్దన్నావ్
చదివితే నాలుక కోసేయమన్నావ్
వింటే చెవుల్లో
వేడి వేడి సీసపు లోహం పోయమన్నావు
సరే, ఎలాగయితేనేం
నువ్వెంతటి మూర్ఖునివో
నీవెంతటి విశాల హృదయునివో
నాకు తెలిసిపోవటమే బాగయింది
నన్ను
చచ్చిన శవాల
దహన సంస్కారాలే చూసుకోమన్నావు
సరే, ఎలాగైతేనేం
మీ ప్రాణాలని కూడా ఎలా పాతేయాలో
నాకు తెలవడమే బాగయింది
నా అడదాన్ని - నాలో సగాన్ని
వళ్లమ్ముకొనే బతకమన్నావు
సరే, ఎలాగైతేనేం
Cultured Bastards మధ్య నుండి దూరం అయి
నా వర్గం వాళ్లని కలవడానికి

నా కవకాశం లభించడమే బాగయింది
నన్ను
ఎప్పుడూ ఊరి చివరనే వుండమన్నావ్
నరే, ఎలాగయితేనేం
నేను అడవిలో వుండడమే బాగయింది
ఒకడేమో నన్ను అంటరాని వాడంటే
మరొకడేమో హరిజనుడు
యింకో గాడిద కొడుకేమో
'నీచుడు' అని పిలవడం అలవాటే
ఎవడు ఎలాపిలిస్తే నాకేం
పీళ్ల విలువల మీద
తుప్పున ఉమ్ముస్తున్నప్పుడు
ఒక కామ్రేడ్ కంటికి
పూసిన అశ్రుబిందువు నయినప్పుడు
నాకు తగిలిన గాయాల్లో మృతవీరుల
ఆశయాల్ని ఊహించుకుంటున్నప్పుడు
అవును
ఎవడు మాత్రం ఎలా పిలిస్తే నాకేం?

(అరుణతార మానపత్రిక, జూలై-ఆగస్ట్. 1981.)

అఫ్సర్

నల్ల నినాదం

నీకో తలకావాలని ప్రకటించబడింది
వొక మొండి దేహాన్ని
నా చేతుల్లోపెట్టి-
నేనంటే మొండెం తెగిన
మనిషినని చాటింపు వేయబడింది

నేను
చేతుల్ని లోహాలుగా మార్చి
రాళ్ళని కంకర కొడ్తున్నాను
చర్మాన్ని సాపుచేసి
బలిసిన కాళ్ళకి కవచాన్నవుతున్నాను
గొడుగునై వానతాళ్ళనుంచి
అన్ని దేహాల్నీ కాపాడుకొస్తున్నాను
నేను
నేను తప్ప అన్నీ అయ్యా
అందరికీ
వొక అవయవంగా అమరిపోతున్నాను

ఏళ్ళకి
నా కన్నీళ్ళ విత్తనాలలో
విరగ్గాసిన తిండి కావాలి
నా చెమటలో తడిసి ముద్దయిన
అందమైన వస్త్రం కావాలి
ఉపరితలం మీంచి పునాది చూడని
ఈ కళ్ళకి
నా తలమాత్రం ఆనడంలేదు

నా లోలోపల
కదిలే ప్రపంచాల అలజడి వినడంలేదు
నన్నూ నా చెమటనీ
నన్నూ నా నెత్తుటి శ్రమనీ
చివరికి నా నుంచి నన్నే పరాయీకరించడంలో
ఇంతకంటే అగ్రవిద్య
ఇంకెవ్వరికీ తెలీదంటాను

చరిత్ర పుటలన్నీ
నా చెమట బిందువుల్తో రాస్తున్నవాళ్లే
నన్ను మాత్రం మొండెం తెగిన విగ్రహాన్ని చేస్తున్నారు
పరీక్ష నాళికల్లో
నా రక్తాన్ని ధారగా పోస్తున్నవాళ్ళే
నన్ను మాత్రం తలకీ మొలకీ కాకుండా చేస్తున్నారు
నా సర్వస్వాన్నీ తనలోకి వొంపుకొని
నా శిరస్సుని మాత్రం
వాళ్ళ పాదాల కింద
సాష్టాంగ నమస్కారాలు చేయిస్తున్నారు
వొట్టి తలల వెనుక కూర్చున్న
తలారుల వ్యూహాలన్నీ నాకు తెలుసు
నెత్తురంటని కళ్ళతో
చెమట తాకని చేతుల్తో
తెల్లరేళ్ళు రాస్తున్న చరిత్రల గురించి నన్నడక్కు
మలుపులో వున్నవాణ్ని
గల చరిత్రకి తలవంచమని చెప్పకు
దారిని మలుస్తున్నవాణ్ని
దారి తప్పుతున్నానని విదిలించకు
నేను నా శిరస్సుతోనే
ఈ శరీరంపై సంచరిస్తానని నినదిస్తాను

('సంతకాలు' కవితా సంచిక 4 జూన్ 1994)

జె. గౌతమ్

అలుు ఆగిపోయాయి

సముద్రాంతరం
నిరంతరం రాజుకొంటున్న కొలిమి
సరంగుల్లేని అలలు ఘనీభవించాయి

* * *

వేసవి
అడవి మోడైన దృశ్యం
ఏ పాలపిట్టా రెక్కవిప్పదు
ఎడారిలో హరితం వర్షించనట్టే
గ్రీష్మంలో ఇంద్రధనుస్సూ మొలవదు

* * *

స్వప్న శిఖరాగ్రాన్ని స్పృశించే అమరత్వం
వృధా అధిరోహణం
ఈ వినీల గగనంలో ఒరిగిపోతున్న సూర్యుణ్ణి
నెమరేసుకుంటున్న నక్షత్రాల సమూహం
కనుపాపలా విస్తరిస్తున్న 'నెలవంక'

* * *

దళిత ఆంధోళితాకాలం
ఈ ప్రభంజనా వీణమీటి
ప్రవాహ తరంగాలపై స్వారీ చేద్దాం

(అముద్రితం)

పి.సి. రాములు

ద్రోహుల కుట్రను భగ్నం చేద్దాం ... పద

ఇన్నాళ్ళూ మనం-
వాళ్ళ పాఠాల్ని వల్లెవేసేవాళ్ళంగానే ... వాళ్ళ నటనకి ప్రేక్షకులం గానే ...
వాళ్ళ ఊకదంపుడు పునన్యాసాలకి చెవులు రిక్కించిన శ్రోతలం గానే ...
వాళ్ళ కులీనత, గొప్పతనాల గురించి చెవులు కోసుకునే చండాలురం గానే ...
జెండాలు మోసేవాళ్ళంగానే... జైకొట్టేవాళ్ళంగానే... నియంత్రించబడ్డాం...
మన మిప్పుడు పాఠాన్నెత్తుకుంటే -
సాంద్రత లేదనీ, సాధన పూర్తికానిదే పరిపూర్ణత సిద్ధించదనీ
బెత్తాలను ఝళిపించే అవతారాలెన్నో
ఇన్నాళ్ళూ - నేలమాళిగలో మగ్గిన సంఘ విదళితుల భాస్వర సమర స్వరం
వాళ్ళ కపటత్వాన్ని ఎండగడుతూంటే ... వాళ్ళ రంగుల్ని కడిగేస్తుంటే
వాళ్ళ ముసుగుల్ని బలిచేస్తుంటే ... వాళ్ళ బూటక ప్రేమకి తెర దించుతుంటే
వాళ్ళ భద్రతకి పగుళ్ళు ఏర్పడుతున్నాయని బుజ్జగింపుల బుసలు కొడుతుంటారు
మనల్ని మభ్యపెట్టటమే, జోకొట్టటమే పనిగా కలిగినవాళ్ళు
మనల్ని వెన్నుతట్టినట్లు నటించి వెన్నుపోటు పొడిచేవాళ్ళు
ఎల్లలు చెరిపేయడమే జీవన సిద్ధాంతమని ప్రవచిస్తూ
వాళ్ళ చుట్టూ నిర్మించుకున్న గుప్త వృత్తాలను దాటి బయటపడలేరు.
పాపం వాళ్ళ స్వచ్ఛమైన వృత్తంలోనే మన ప్రేమ చిగురించాలి... వికసించాలి...
లయించాలి.

వర్గద్వేషం లేందే వర్గప్రేమ వుండదని తెలియక కాదు
దేన్నీ ధ్వంసించకుండా దేన్నీ కొత్తగా నిర్మించలేమని ఎరుగక కాదు. -
ఇంతకీ ధ్వనించే మన స్వరం ... చిగురించే మన ప్రేమ వాళ్ళ కనువుగా లేదనే.
మన బాధ గురించి, మన దుఃఖం గురించి, మన నెత్తుటి శ్వాస గురించి

మన వంటికి అద్దిన మాసిపోని అద్దకం గురించి ... వాళ్ళే మాట్లాడాలి... వాళ్ళే నినిపించాలి ...

"మనం మనంగా గొంతెత్తితే - గురుదక్షిణ కొచ్చే
ద్రోహాచార్యుల గుండెకు ఆరెను ఎక్కుపెట్టాలిక
పెగిలే స్వరానికి బంగారు బీగాలను తగిలించే
కూటనీతిని భగ్నం చేయాలిక ... పద... ముందుకు సాగుదాం ...!

- (ఆదివారం ఆంధ్రజ్యోతి)

జి.ఆర్.కుర్మె

వాళ్ళి గుర్తించడం మానుకో

నువ్వు వాణ్ణి కులీనుడిగా నిలిపినన్నాళ్ళు
వాడు నిన్ను కులహీనుణ్ణి చేస్తూనే ఉంటాడు

నువ్వు ఆత్మన్యూనతాభావంతో ఉన్నన్ని రోజులు
వాడు అధిక్యతా భావంతో మెలుగుతూనే ఉంటాడు

నువ్వు వాణ్ణి అర్థిస్తున్నన్ని రోజులు
వాడు నీపై అధికారాన్ని చెలాయిస్తూనే ఉంటాడు.

నువ్వు వాణ్ణి గౌరవిస్తున్నన్నాళ్ళు
వాడు నిన్ను ఛీదరిస్తూనే ఉంటాడు

నువ్వు వాణ్ణి యజమానిలా చూసినన్నాళ్ళు
వాడు నిన్ను బానిసను చేస్తూనే ఉంటాడు

నువ్వు అణకువతో ఉన్నన్నాళ్ళు
వాడు మెళుకువను ప్రదర్శిస్తూనే ఉంటాడు

నువ్వు వాణ్ణి ఆరాధిస్తున్నన్నాళ్ళు
వాడు నిన్ను అణగద్రొక్కుతూనే వుంటాడు.

నువ్వు సంకోచమైనప్పుడల్లా
వాడు వ్యాకోచిస్తూనే ఉంటాడు

నువ్వు అడిగే స్థాయికి ఎదిగావనుకో
వాడు తోక ముడుచుకుంటాడు

నువ్వు అధిగమించే స్థితికి చేరావనుకో
వాడిక అయిపు లేకుండా పోతాడు

నువ్వు మేధావిగా రూపొందేదాకా
వాడు తన మెదడు బూజు దులుపుకోడు

నువ్వు నాయకత్వాన్ని చేవట్టేదాకా
వాడు నిన్ను గుర్తించ నిరాకరిస్తాడు

వాడు నిన్ను గుర్తించనందుకు నువ్వేమీ బాధపడకు
వాణ్ణి గుర్తించడం మానుకో చాలు!
వాని గుర్తింపు కనుమరుగౌతుంది !!

(పునాదిరాయి- కవితా సంపుటి, 1994 జనవరి)

వరదయ్య

చిక్కనయ్యే పాట

నా వాకిట్లో కళ్లాపిని నన్నే చల్లుకోనివ్వండి
నా రోడ్డు మీద నన్నే కంకర పోసుకోనివ్వండి
నా పూల దండను నన్నే గుచ్చుకోనివ్వండి
నా కన్నీళ్ల పాళీతో నా చరిత్రను నన్నే రాసుకోనివ్వండి

శవంగా గాలి పీలుస్తూ శవాన్ని మోసినవాడ్ని
నా బతుకు శుతిని మింగిన కొండ చిలువల మధ్య
తడిమెరుపులతో నడుస్తున్న చిరకాలపు బాటసారిని
కడబుట్టిన చూపుల మంటల్లో కాసేపు నన్ను తిరగనివ్వండి
నా నరాల్లోని తీతువు పిట్టని నరిగా విననివ్వండి
గుండెను పిడికిట్లో పట్టుకుని నడవనివ్వండి

నా నడక ఆగిన చోట చిగురు చెట్టు ఉంటుందో లేదో మరి
పెచ్చరిల్లుతున్న తుపానులో చేతులు అడ్డం పెట్టి
దీపాన్ని ఆరిపోకుండా ఉంచగలనో లేదో మరి

ఎదురుదెబ్బ తగిలి బొటనవేలు పగిలినప్పుడే గదా
నా తోవల దూరం తెలిసేది
నాలుగు వంకర కూతల తరవాతే కదా పాట చిక్కనయ్యేది
ముళ్లకిరీటాన్ని మోసినవాడే కదా
తిరిగి తిరిగి పుట్టగలిగేది

ఎన్నో తరాల నెత్తురు చెవుల్లో వలుకుతుంటే
కలల్ని కత్తుల్లా వాడ మీదికి విసురుతున్నవాడ్ని నేను
నన్నందరికీ కలల్ని పంచనీండి
వస్తే మీరూ రండి నా వెంట

(అముద్రితం)

కో. ప్ర.

రాచపుండు

శ్రమ సరుకై
ఉత్పత్తి అదాయమై
శ్రమ జవి నుండి శ్రమ ఫలితం
వేరుచేయబడింది
వెలకట్టబడింది
పని విభజన అవసరమై
కులవిభజన 'అనివార్య'మైంది
ఊరూ-వాడా
ఉత్తర-దక్షిణమంత వ్యత్యాసమైంది
నింగీ-నేలా అంత వేరయింది
బొమ్మా-బొరుసూ అంత లేదా అయిం
చీకటీ-వెలుగూ అంత భేదమైంది
ఏకం చేయాలన్నదెవడు
ఎలుగెత్తి చాటిందెవడు
అవును! నేనిపుడు కులం గురించే మాట్లాడుతున్నాను
'మడి' లేదు - గుడి లేదు
గుడిలో లింగమూ లేదు
దేవతా, దెయ్యమూ లేదు
ఉన్నదంతా
కామకూ-కష్టానికీ మధ్య
కత్తులు దులిపే కయ్యమే
నీ రంకు రామాయణమైంది
బొంకు భారతమైంది

వ్యూహం దైవమై
ఎత్తుగడ మనువై
మా తనువంతా నెత్తుటి చిత్తడయింది
అవమానాల సుడిగుండమైంది
మునుగు లాగిందెవడు
మర్మం తెలిపిందెవడు
చూపును విశాల పరుచుకొని
కుల దురహంకారాన్ని
కూకటివేళ్ళతో పెకలించాలని
కంకణం కట్టుకొందెవడు
కత్తుల కోలాటమాడుతుందెవడు
రాజులు లేనినాడు
రాజ్యాలు లేనినాడు
స్వంత అస్తి ఊసే లేనినాడు
కులమా! నీ చిరునామా ఎక్కడ
కులం నీరై కారంచేడయింది
కులం ఓటై పాదిరికుప్పమైంది
కులం అణచివేతై చుండూరయ్యింది
కులం కామమై ముత్తవ్వయ్యింది
కులం మనిషై మనుషుల్ని దోచింది
కులం దైవమై దేశాన్ని ముంచింది
రంగు మార్చుకుని రామజన్మభూమై
రంగం మీది కొచ్చింది
పరిధీ, పరిణామం పెరిగి
జాతి అయ్యింది
జాతీయ దురహంకారమైంది
ఎల్లలులేని దోపిడీ అయింది
ఎనలేని దౌర్జన్యమైంది

ఎదురొడ్డి నిలిచిందెవడు
యుద్ధం ప్రకటించిందెవడు
నేరానికి శిక్ష నేరాన్ని బట్టిగాక
కులాన్ని బట్టి ఎందుకైంది
కామానికి పనికొచ్చిన నా తల్లి
కాపురానికెందుకు చెల్లనిదైంది
ఒకే నీరు నీ దప్పిక తీర్చి
నా అంగిలెందుకు ఎండగొట్టింది
ఒకే ఊరు నిను అక్కున జేర్చుకుని
నన్ను అంటరానివాడని ఎందుకంది
ఒకే పనికి ఫలితం కష్టాన్నిబట్టిగాక
కులాన్నిబట్టి ఎందుకు నిర్ణయించబడింది
ఒకే అర్థానికి భాష
కులాన్ని బట్టి ఎందుకు మారింది
ఒకే నేరానికి శిక్ష
కులాన్నిబట్టి ఎందుకయింది
పేగులుండచుట్టుకుపోయే గతం నాది
నరాలు చిట్లే నరకం నాది
అక్కున జేర్చుకొందెవడు
ఓదార్చిందెవడు
కులం నీకు ఆర్థికమై
ఆయుధమై, అధికారమై
నీ ఉత్పత్తి
వెలలేని ముడిసరుకెలా అయింది
నీ అదాయానికి హామీ ఎలా అయింది
అదే కులం - నా కంట్లో కారప్పొడై
అరికాల్లో కరతుమ్ములయి
సద్దిబువ్వలో లొద్ది పురుగై

నా బతుకులో బుద్ధపింజెరై
ఎందుకు పారాడుతుంది
చెట్టూ, చేమకు లేని కులం
గొడ్డూ, గోదాకు లేని కులం
పశువులకు లేని కులం
పశువుల పంచితానికి లేని కులం
మృగాలకు లేని కులం
మనుషుల కెందుకంటుకొంది
అగ్రకుల దురహంకారమా
బదులు పలుకు
కానున్నోడికి కూలోడినై
కులమున్నోడికి అంటరానోడినై
అతలాకుతలమైంది నేను
అడుగంటిపోయింది నేను
గోడదెబ్బా - చెంపదెబ్బా రెండూ తగిలి
గోడు గోడు మంటూ
గుండెలు బాదుకొంది నేను
గుదిబండలు మోస్తుంది నేను
మీ కయ్యల్లో పంటై పండించి
కవళానికి ఎండి
మీ కాళ్ళకు చెప్పునై అమరి
నా అరికాళ్ళు బొబ్బలెక్కించుకొని
మీ వొంటి నిండాగుర్తకప్పి
వివస్త్రనై ఊరేగుతూ
దేవుడా! ఏ జన్మలో చేసుకొన్న పాపంర
వాయనా ఇదని
దిక్కులాలకించింది నేను

దేబిరించింది నేను
దారీ-తెన్నూ లేక
దద్దమ్మనై తలాడించింది నేను
స్వయంపోషక గ్రామీణ వ్యవస్థకు
నిను మకుటం లేని మహరాజునుచేసి
మాడి నచ్చింది నేను
నీ కీర్తి దిగంతాలకు ఎగబాకించి
పాతాళానికి దిగబడింది నేను
ఏకలవ్యుని త్యాగం వాది
శ్రీరామచంద్రుని కపటం నీది
మీ బిడ్డలకు బొడ్డుకోసి, భూమ్మీదకు తెచ్చి
ఉచ్చా, పియ్య ఎత్తేసి, వొంటికి నీళ్ళు బోసి
ఉగ్గబట్టి ఏడుస్తుంటే
నా వొంటి నరాలు మీటి
జోల పాడి ఏడుపాపింది నేను
మీ చంటి బిడ్డలను నా చేతుల మీదుగా
చెట్టంత ఎదిగిచ్చింది నేను
సత్తువయ్యింది నేను
నీ తల్లి చస్తే చావు కబురు మోసింది నేను
పాడె కట్టింది నేను
'కర్వె' కాష్ఠాన కాల్చి కడతేర్చింది నేను
నా ఊర్లో నా పేరు అలబరి
నా దేశంలో నా పేరు కూలి
నేననాదిగా అలబరోడ్ని
పునాదిలేని బానిసని
తరతరాల అవమానాల
ఆవేదన నాది, ఆవేశం నాది
ఆక్రోశం నాది

నే మాటాడితే నాలుక కోసి
వింటే చెవిలో సీసం పోసి
చూస్తే కళ్ళు పొడిచి
నన్ను వెలివేసిందెవడు
నా బతుకుకు వెలకట్టిందెవడు
నన్ను బడికి దూరం చేసి
మెదడుకు దడికట్టి
'మడి'కి బందీ చేసిందెవడు
నా తెలివితేటల్ని దోసి
కడుపునింపే కాయకష్టాన్ని
జ్ఞానం కాదు పొమ్మన్నదెవడు
గుర్రాలకు గుగ్గిళ్ళు పోసి
ఎద్దులకు పచ్చగడ్డేసి
కుక్కలకు కూడొండి పెట్టి
కూడుపెట్టే కూలోడి కడుపు మాడ్చిందెవడు
మొలకు ముంత కట్టి
ముడ్డికి తాటాకు కట్టి
చేతికి చీపురిచ్చి
ఛీ ... ఛీ .... అవల, అవల,
దూరం, దూరం - అంటూ
మదమెక్కి పలికిందెవడు
రంగు భేదం చూపి
రక్తాలు కక్కిస్తున్నదెవడు
జాతుల సంపద దోచుకొనేందుకు
దోబూచు లాడుతున్నదెవడు
నా దేశపు జాతుల పోరాటాల్ని
రక్తపుటేరుల్లో ముంచి
అంతర్జాతీయ జాతుల ఉద్యమాలకు

నంఘీభావం తెలుపుతున్నదెవడు
సామ్రాజ్యవాదంలో
గొంతులోతు కూరుకుపోయి
గోతులు తీస్తున్నదెవడు
న్యాయమైన జాతుల విడిపోయే హక్కును
విద్రోహంగా చిత్రిస్తున్నదెవడు
విషం చిమ్ముతున్నదెవడు
చుండూరుకు కారణభూతుడై
'బారా'ను తప్పుబడుతున్న దెవడు
కన్నతల్లి కడుపులోనే
కులం అంటురోగాన్ని
మా కంటగట్టటం ఎవడి కుట్ర
కల్లాకపటం తెలియని చిరుప్రాయంలో
కులం శిలువను మా భుజాలకెత్తటం
ఎవడి ద్రోహం
ఏలెడంతలేని రెడ్డి కొడుకు
ఎనభై ఏళ్ళ మా తాతను
'ఒరే ఎంగిటిగా ఇట్రారా'
అని పిలవటం వెనుక
ఎవడి వత్తాసుంది
'మాదిగ పొండోడూ, మాల కొండడూ
చాకలి కిష్టడూ' అంటూ
కులంతో మనిషిని పోల్చి
కులంలో మనిషిని కుదించి
మా వ్యక్తిత్వాన్ని కూల్చటం వెనుక
మూలమేమిటి
రెడ్డి భూస్వామై, భూస్వామి రెడ్డయి
దొర కమ్మై, కమ్మ దొరై,

రెండు తలల విషసర్పమవటంలోని
మతలబేమిటి
అమ్మా! అమ్మా! ఆలీసమ్మా!
ఎక్కడ తల్లీ నువ్వెక్కడ
కరకు కత్తుల కారంచేడు కమ్మ దొరల్ని
కరకర కొయ్యాలని నినదించిన
నీ కంఠ మెక్కడ
నువ్వేసిన పాలికేకతో
గొంతు కలిపి పిలుస్తున్నాను
ఎక్కడ తల్లీ! నువ్వెక్కడ
పేగుతెంచి, రక్తాన్ని పంచిన నా తల్లీ
నా బాకీ అణాపైసల్‌తో సహా తీరేదెప్పుడు
నీ కని తీరేదెన్నడు
శ్రమ నిష్ఫలమై, తీరని అవమానమై
అవమానం ఆలోచనై
ఆలోచన అయుధమై, అచరణై
అరుగు కదిల్చిందెవడు
నేలనా తల్లి అని
మానవుడు నా నేస్తమనీ ప్రకటించిందెవడు
కులాన్ని అర్థం చేసుకుని
అవగాహన పెంచుకొందెవడు
కులం వర్గంలో అంతర్భాగమని
తెలుసుకొందెవడు
తెగేసి చెప్పిందెవడు
గాయాలు రెండూ-మందొకటే అయినట్టు
కులం వర్గానికీ కలిపి
పరిష్కార మొక్కటేనని
ప్రకటించిందెవడు

కారంచేడుకు కరీంనగరే
ఏకైక మార్గమని
నిజాన్ని పలికిందెవడు
నినదించిందెవడు
అమ్మా ఆలీసమ్మ అశకు బాసై
బాసకు శ్వాసై
సాయుధ మయిందెవడు
సాగిపోతున్నదెవడు
దారితప్పిన కుల చైతన్యానికి
చుక్కాని అయ్యిందెవడు
చూపై గమ్యాన్ని చూపిందెవడు
అది నువ్వు కాదు
నీ తొత్తూ కాదు
అది సత్యమన్న
సారంగపాణి
సహదేవుడు
సముద్రుడు
మనిషికి పుట్టిన నన్ను
మనిషిగా పుట్టిన నన్ను
మనిషిగా బతకాలనుకొన్న నన్ను
దేవుడి బిడ్డను చేసి
ద్రోహానికి వొడి గట్టినవాడు
జాతిపిత అయిన దేశంలో
నా ఆర్తనాదం
రఘుపతి రాఘవ రాజారాం అయింది
నా గుండెకోత కన్నీటి సంద్రమైంది

కులం పునాది నీ కుట్రలో వుంది
కుతంత్రంలో వుంది
అసత్యంలో వుంది
అధికార దాహంలో వుంది
దిగపడనివాడికి కులంలోతు మోకాట్లోతే
దిగపడ్డవాడికి అగాధం
అంటరాని కులపోడిన్న
మూర్ఖబిళ్ళ మెడకు తగిలించుకొని
కులాన్నర్థం పెట్టుకుని
కుట్ర పన్నుతున్నదెవడు
కపట నాటకమాడుతున్నదెవడు
కుల చైతన్యానికి
మసిబూసి మారేడుకాయ జేసి
మతలబు చేస్తున్నదెవడు
'పాడిందేపాడరా పాసిపళ్ళ దాసరీ' అన్నట్టు
వున్న కులానికి పునాది మరచి
రాని పరిష్కారానికై రాగాలు దీస్తున్నదెవడు
రంకె లేస్తున్నదెవడు
ఎండమావిలో నీళ్ళకోసం దేవులాడినట్టు
కుల సమస్యకు పరిష్కారాన్ని
కోర్టుల్లో వెతుకుతున్నదెవడు
కళ్ళకు గంతలు కడుతున్న దెవడు
తలనుండి మొండేన్ని వేరుచేసినట్టు
వర్గంనుండి కులాన్ని వేరు చేస్తున్నదెవడు
మొండెమే శరీరమన్నట్టు
కులమే వర్గమంటున్నదెవడు
వాస్తవాలను వక్రీకరిస్తున్నదెవడు
వంచిస్తున్నదెవడు

కారంచేడులో గాల్లో యుద్ధంచేసి
చుండూరులో శిఖండై తేలిపోయిందెవడు
వాడు మీ ధనికవర్గ కుతంత్రాలకు పుట్టిన
అక్రమ సంతానం
రూపం మాది
రుచులు మీవి
తీగలాగితే డొంకంతా కదిలినట్లు
కులం విల్లును
వర్గం ధనుస్సు మించి ఎక్కుపెడితే
నీ కుర్చీ కదిలింది
రంగూ, రుచీ, రూపం లేని కులం
చిరునామా తెలియని కులం
మా చిరునామాలను నిర్ణయించటం
ఇకపై చెల్లదని
ఈ బద్మాష్ వ్యవస్థ భస్మానికై
బరిగీసి నిల్చి బందూకెత్తిన
బాలన్ రాజన్ నాగేశన్నల
నెత్తురు తడిసిన జెండానెత్తి
కంచికచర్ల కోటేశన్న
ఆర్తనాదానికి బాణీమార్చి
ఖూనీకోరుల రాజ్యం మీదికి
కూలిదండై కదలబారిన
బడుగు జీవుల బతుకుల్లో రగిలే
కల్లోలానికి కళ్ళు తెరిచిన
కరీంనగర్ నా వెన్ను
దండకారణ్యం నా దన్ను

(9-8-92 అరుణతార)

జూలూరి గౌరీ శంకర్

పాదముద్ర

కోడికంటే ముందే లేచిన
కాళ్లూచేతులూ
సరాసరి గొడ్ల కొట్టంలోకే నడిచాయి
పశువుల పెంటా
ఉచ్చా, రొచ్చూ తీసి తీసి
చేతి వేళ్లమధ్య పుండ్ల సలుపుడు
సహించి, వహించి
కట్టుగొయ్యల ముందు
పశువుల కాళ్లమధ్యే వాళ్లబతుకు నలిగిపోయింది
గాట్లో పేడదీసి
దొడ్లని వూడ్చీ వూడ్చీ
గొడ్లని కడిగీ కడిగీ
శ్రమకి అలవాటై
పశువులాగా మనిషి తిరగాలి
ఇది వలయం
ఇది ప్రళయం
ఇదే వృత్తం ఇదే నిత్యం
ఏ ఊరు పొలిమేరలు చూసినా
ఏ వేకువ చీకటిని అడిగినా
సూర్యకిరణం కన్నాముందే
శ్రామికుల హస్తాన్ని దర్శించానని చెపుతుంది
కోడికంటే ముందే
కాళ్లూ చేతులూ కూసి
కుడితి గాబులో మెతుకులు దేవిన్తరువాత
వాళ్ల చేతులు రెండూ

సద్దిమూట ముందు విప్పుకుంటాయి
ఆకలి మనిషిని బంధిస్తుంది
శ్రమకి పీటముడి వేస్తుంది ఆకలి

సద్దిబువ్వముందు కూర్చున్నాక
సూర్యకిరణాల్లాంటి చేతివేళ్లు
అన్నం మెతుకుల్ని పొడుస్తుంటాయి
అవి
శ్రమకు తప్ప
అన్నింటికి వెలేసిన చేతులు
శ్రమనించి తప్ప
అన్నింటి నుంచి దూరం చేయబడ్డ చేతులు
ఒక్క శ్రమను తప్ప
అన్నిటిని కోల్పోయిన చేతులు
ముద్దకీ మూతికీ ఆకలి చిక్కం కడుతుందా
చేతులు శ్రమను విప్పుకుని
చిక్కాన్ని చీల్చుకుని ముందుకు వస్తాయా?!

దేహానికి సగం బట్టేకదా కట్టింది
బతుకు ఊరు బయటకు కదా ఈడ్చింది
పచ్చటి పంటచేలో దిష్టిబొమ్మలా నిలబెట్టబడి
కన్నీటి వూటల్లో బతుకుమోట లాగీ లాగీ
శరీరదరులంటి పారే చెమటను
మాగాణాలకు పంపుతూ
ఆకలి పేగులతో
మేడిని బిగబట్టిన చేతులు అవి
వాళ్లు బల్లపరుపుగా పరచుకోబట్టే
వాళ్లమీద
ఊర్లు, నగరాలు, నాగరికతలు

నిలబడి తలెత్తగలిగాయి
వాళ్ళేం చేయగలరు?
చరిత్రహీనులు వాళ్ళేం చేసుకోగలరు
శరీరాన్ని మీకిచ్చి
శరీర రక్తాన్ని మీకిచ్చి
నెత్తుటి శ్రమనూ మీకే ఇచ్చి
దేహం నుంచి వెలివేయబడ్డ దేహాలతో
రంగు నుంచి
రూపు నుంచి
దూరంగా వెట్టబడ్డవాళ్ళు
అసలు వాళ్ళేం చేయగలరు
ఒంటికి నదులు పడుతున్నా
తుడిచేస్తువ్నారుగానీ
వాళ్ల ఒంటికి మీరద్దిన వర్ణాన్ని
ఇప్పటికీ తుడుచుకోలేక పోతున్నారు
చరిత్రసాక్షిగా వాళ్లరంగు నలుపుకదా!
వాళ్లు మాత్రం ఏం చేయగలరు
చరిత్ర నిర్మాతలు మనుషులు కావలసినచోట
వర్ణాలు అవుతుంటే
వాళ్లకి ఎవరు మాత్రం ఏంచేయగలరు
రంగులబోన్లూ
వర్ణపంజరాలు దొరికేచోట! ఎవరేం చేయగలరు
మనిషి
తనను తాను పాగుచేసుకున్నాడు కనుకనే
మనిషి లోంచి
నాగరికతలు పుట్టాయి
చెమటచిత్తడులు వంటగా
ఎండపొర్లే ఉప్పునీరు

వానకు నానిన బావులు
నదులూ
సముద్రాలూ
అన్నీ, అంతా
మానవుడి నుంచే
అంతా మనిషి దేహం నుంచే
అయినా ఇక్కడ
కొందరు కొందర్ని మనుషులుగా గుర్తించరు
మనిషి మనిషిగా చూడబడకుండా
అంతా నజావుగానే సాగుతుంటుంది
మనిషి చేతి చుట్టూ తిరిగిన మట్టే కదా
ఈ కుండ -
మనిషి పాదధూళే కదా తాజ్‌మహల్
మనిషి నరాల దారాలేగా ఈ కనిపించే నగరాలు
ఒతుకు ఉలి మీద చెమట బిందువును చెక్కిన మహాశిల్పి మానవుడు
ఇప్పటి దాకా
మోకాళ్లనుంచి పుట్టిపెరిగే కదూ
మనుషులు వర్ణాలని మోస్తున్నారు
అసలు ఏ వర్ణానికైనా
జన్మస్థానమొక్కటే
మనుషులు మనుషులుగా పుట్టక
మనువులై పుడితేనే ప్రమాదం
కొందర్ని పాదాలనించి పుట్టించే ప్రమాదం
మనిషి మనువైనప్పుడే జరిగింది
మనువుల ప్రకారం మన్వంతరాల దృష్ట్యా
కొందరు పాదాలనుంచి పుట్టడమే నిజమైతే
మర్మాంగంకన్నా పాదం పవిత్రమైందే
అందుకే

నిలబడి తలెత్తగలిగాయి
వాళ్ళేం చేయగలరు?
చరిత్రహీనులు వాళ్ళేం చేసుకోగలరు
శరీరాన్ని మీకిచ్చి
శరీర రక్తాన్ని మీకిచ్చి
నెత్తుటి శ్రమనూ మీకే ఇచ్చి
దేహం నుంచి వెలివేయబడ్డ దేహాలతో
రంగు నుంచి
రూపు నుంచి
దూరంగా నెట్టబడ్డవాళ్ళు
అసలు వాళ్ళేం చేయగలరు
ఒంటికి నదులు పడుతున్నా
తుడిచేస్తున్నారుగానీ
వాళ్ల ఒంటికి మీరద్దిన వర్ణాన్ని
ఇప్పటికీ తుడుచుకోలేక పోతున్నారు
చరిత్రసాక్షిగా వాళ్లరంగు నలుపుకదా!
వాళ్లు మాత్రం ఏం చేయగలరు
చరిత్ర నిర్మాతలు మనుషులు కావలసినచోట
వర్ణాలు అవుతుంటే
వాళ్లకి ఎవరు మాత్రం ఏంచేయగలరు
రంగులబోన్లూ
వర్ణపంజరాలు దొరికేచోట! ఎవరేం చేయగలరు
మనిషి
తనను తాను సాగుచేసుకున్నాడు కనుకనే
మనిషి లోంచి
నాగరికతలు పుట్టాయి
చెమటచిత్తడులు వంటగా
ఎండపొర్లే ఉప్పునీరు

వానకు నానిన బావులు
నదులూ
సముద్రాలూ
అన్నీ, అంతా
మానవుడి నుంచే
అంతా మనిషి దేహం నుంచే
అయినా ఇక్కడ
కొందరు కొందర్ని మనుషులుగా గుర్తించరు
మనిషి మనిషిగా చూడబడకుండా
అంతా నజూవుగానే సాగుతుంటుంది
మనిషి చేతి చుట్టూ తిరిగిన మట్టే కదా
ఈ కుండ -
మనిషి పాదధూళే కదా తాజ్‌మహల్
మనిషి నరాల దారాలేగా ఈ కనిపించే నగరాలు
బతుకు ఉలి మీద చెమట బిందువును చెక్కిన మహాశిల్పి మానవుడు
ఇప్పటి దాకా
మోకాళ్లనుంచి పుట్టిపెరిగే కదూ
మనుషులు వర్ణాలని మోస్తున్నారు
అసలు ఏ వర్ణానికైనా
జన్మస్థానమొక్కటే
మనుషులు మనుషులుగా పుట్టక
మనువులై పుడితేనే ప్రమాదం
కొందర్ని పాదాలనించి పుట్టించే ప్రమాదం
మనిషి మనువైనప్పుడే జరిగింది
మనువుల ప్రకారం మన్వంతరాల దృష్ట్యా
కొందరు పాదాలనుంచి పుట్టడమే నిజమైతే
మర్మాంగంకన్నా పాదం పవిత్రమైందే
అందుకే

మనువులందర్నీ మనుషులు కండని శపిస్తున్నాను

నేనెవర్ని? నీ వెవరువు?? వీళ్లెవరు???
వాడెవరు!? అదెవర్ని!?
వాళ్లు
వాళ్లే
వాళ్లు వర్ణవ్యవస్థకు అల్లంత దూరంలో ఉంటేనేం
నీ దొడ్లో పశువుల పెంటయితేనేం
కాటికాపర్లు అయితేనేం
సిరలూ, ధమనులూ
చీమూ, నెత్తురున్న మనుషులు
చర్మంతో సంగీతం వినిపించారు
శరీరాన్ని పాదరక్షల్ని చేశారు
వాళ్లది నిర్వచనం లేని ప్రపంచం
వాళ్ల చేతుల లోంచి
జల జల చెమటలు చిట్లే
మాలవాడల మీంచి
మాదిగ గుడిసెల లోంచి
చేతులకు చేతులు పాలాల మీద రాలితేనే
గట్లు పుష్పించాయి
చెట్లు పుష్పించాయి
పాలాలు పంటలతో పరిమళించాయి

ఇప్పటిదాకా
నిజాల మీద నడక
చీలుతున్న చర్మపు దారిమీంచి నడక
ఎక్కుపెట్టిన సూదిలోంచి నడక
దించిన తల ఎత్తకుండా నడక
కుళ్ల బొడుస్తున్న వీపుల మీద

నోరువిప్పని గాయం మచ్చలు
మానాలమీద అవమానాలు సహించి
మారని మచ్చల జడత్వంతో జోడికట్టినా
నేడిక
గొంతులు గాయాలుగా పగులుతున్నాయి
మాటలు
ధిక్కరించే స్వరాలుగా చిట్లుతున్నాయి

వంచబడ్డ శిరస్సు నడుస్తూ
అరుస్తూ
సహిస్తూ
పిలుస్తూ
దొరా
బాంచన్ దొరా
కాల్మొక్తాల మీంచి
కొత్తదారులు పుడుతున్నాయ్
కొత్త అడుగులేస్తున్నారు
శతాబ్దాల సాంస్కృతిక న్యూనతల్లోంచి
వర్ణసముద్రంలోంచి
కెరటాలుగా పొంగుతున్నారు
ఇంతకాలం వాళ్లేం చేశారు?!
ఇన్నాళ్లు వాళ్ల కెవరేం చేశారు?!
వాళ్ల తలల్ని అగాధాల్లోకి వంచారు
వాళ్లు అగాధాల్లోకే చూశారు
భూమి లోంచి ఆకాశాన్ని నిమిరారు
ఇప్పుడు భూమ్యాకాశాల వారధిగా
నిలబడుతున్నారు

ఇక్కడ రాజ్యం
వరాహమై నటించింది
కొన్ని హక్కుల్ని కడగొట్టుబిడ్డలకిచ్చింది
స్మృతులూ, శాస్త్రాలూ పఠించి
ఏకలవ్యుల్ని సృష్టించింది
అదే రాజ్యం
ద్రోణుడై, గురుస్థానమై
గురుదక్షిణ కుత్రై
హక్కుల వేళ్లునరికే చట్టమైంది

ఇప్పుడిక్కడ ప్రత్యేకంగా ఏం మిగిలింది
వాళ్లదంటూ ఏం వుందిక్కడ ఒక్క కులంతప్ప
వెలితప్ప వెట్టితప్ప
అప్పుడప్పుడూ
వాళ్లకి బోనసులుగా
అక్కడో ఇక్కడో కొన్ని గ్రామాలకు గ్రామాలు
శంభూకుల తలలై రాల్తుంటాయ్
ఇక్కడ
ఏ నదినడిగినా
ఏ ఏటినడిగినా
వాళ్ల శవాల్ని ఒడ్డుకు తోస్తుంటుంది
ఏ చెరకుతోటలు వెతికినా
తలలూ
తెగిపడ్డప్రాణాలూ
కోల్పోయిన మానాలూ
బెల్లం అచ్చుల్లాగా బయటకొస్తాయ్
ఏ గుడిసెనడిగినా పొగొట్టుకున్న శిలాన్ని
తాటి ఆకుల్తో కప్పుకుంటుంది

ఊరు బయట చేసిన హత్యలన్నీ
ఇప్పుడు రచ్చబండ మీద కొస్తున్నయ్
ఎన్ని శతాబ్దాలుగా
రాక్షసపాదం వాళ్లని తొక్కిపెట్టిందో
రాజ్యాధికారం అణచివేసిందో
ఇప్పుడు చరిత్రనే ప్రశ్నిస్తున్నారు
చరిత్రా!
ఇన్నాళ్లూ నీ పుక్కిట్లో నివునెట్లాదాచావ్
పిడికెడు బియ్యంలో గుమ్మడికాయనెలా కప్పెట్టావ్
అసమానతనీ
అమానుషత్వాన్నీ
నువ్వెలా సహించావ్ నలుపు తెలుపుల చరిత్రా?
నేరమెప్పుడూ న్యాయంకాదన్నది నిజమైతే
ఇంకా నీకుంటి సంజాయిషీ
వాళ్లకెందుకు వినిపిస్తావ్ పంచరంగుల చరిత్రా!

ఇంతకీ వాళ్లేం చేశారో తెలుసా!
వంచిన నడుం వంచినట్లు
దిగినకాళ్లు బురదలో మునిగినట్లే
మాటలు దుక్కులయి
దుక్కిన విత్తిన గింజలై
మొలకెత్తిన మొక్కలై
మొక్కలు పాడిన పాటలై
పండే పంటలయ్యారు
పైటిబువ్వ తినేలోపల
చీకటి పడేలోపల
ఈ దుక్కిని సాలూ, ఇరవాళ్లూ దున్నారు
ఈ దుక్కి అరనెక్కినా పదునెక్కినా

పంట చేతికొచ్చినా
ఊరవతలవాళ్లు ఉండబట్టేకదా
అయినా ఇప్పుడు
వాళ్లకి ఎవరేంచేస్తారు
అంటరానితనాన్ని చట్టంగా కాదు
ఈదేశపు జెండాగా ఎగరెయ్యండి
ఇంతకాలం
ఎక్కడికెక్కడికో
అగాధంలోకి వాళ్లని ఈడ్చుకు పోయినప్పుడు
భూమి బీటలువారిందో
అగ్నిపర్వతాలు బద్దలయ్యాయో
బడబానలం శ్వాసించిందో
తెలీదు కాని
ఇప్పుడు ధిక్కారస్వరాలు
ఊరవతల నినదిస్తున్నాయ్

అయినా -
ఎవణ్ణివాడు మట్టిని చేసుకున్నాక
ఎవడ్నివాడు సాగుచేసుకున్నాక
ఎవడ్నివాడు శ్రమశక్తిగా మలచుకొని
మట్టికాళ్లమీద నిలుచున్నాక
ఒకడిపై మరొకడికి అధికారం లేదు
హక్కులేదు

కలాలన్నీ
వాడికథలని విప్పిరాయాలికనించి
కళ్లన్నీ
వాడిస్వప్నాలని కనాలికనించి

అసలు దేన్నీ ఊహించలేం మనం
దృశ్యాన్నీ, అదృశ్యాన్నీ
అన్నలు పోల్చుకోలేం మనం
కనిపించే దృశ్యం మనిషెప్పుడవుతుందో
ప్రాణం పోసుకునే ధైర్యకవచమవుతుందో
ఎప్పుడూ ఊహించం
చెల్లాచెదురైన దృశ్యం
తన గాయాల్ని ఏరుకుని, అల్లుకుని
తన రూపాన్ని గుర్తుపడుతుంది
తన గాయాన్ని నిమురుకొని
దెబ్బకొట్టిన చేతిని పసిగడుతోంది
గాయం ఇప్పుడు విస్తరిస్తోంది
అసలు ఇప్పుడిక గాయమే దృశ్యం
ఏ దృశ్యం
తన రక్తాన్ని భూమికిచ్చిందో
అక్కడి నుంచే జీవితం మొదలవుతుంది
చరిత్రా! నీకో కొత్త గొంతునిస్తానని
చచ్చిన గుడిసెలోంచి బతికొచ్చిన ఆలీసమ్మ
సాక్ష్యం చెబుతానంటే
న్యాయస్థానాలు కంపించాయి
న్యాయదేవత ధర్మకాటా తిరగబడి
నేరాలు బయటపడ్డాయ్
అంతా సద్దుమణిగి
ఆలీసమ్మ ఆత్మగా పాతిపెట్టబడ్డప్పుడు
కారం చల్లిన ఊళ్లన్నీ
గుండెలు బిగించాయి
అప్పుడే కుక్కలకు బిస్కట్లు పంచారు

బాధితులకు ఎక్స్‌గ్రేషియాలు ఇచ్చారు
అధినేతలు
వలవలా విలవిలా
శరణార్థ శిబిరాల ముందు వాలిపోయారు
కానీ, సజీవ చరిత్రా!!
నాలుగుకాళ్లమీద నిలబడ్డ కుర్చీని
వాళ్లెప్పుడూ నమ్ముకోలేదు
వాళ్లకీ తెలుసు
ఆ కుర్చీ ఆ ధర్మాన్ని కాపాడుకునేందుకే కూర్చుంటుందని
కుర్చీలు చెప్పే మాటల్నీ
చేసే వాగ్దానాల్నీ
వెనుక నించి పొంచి బాణంతో కొట్టిన
ఉత్తమ పురుషుడు చేసిన హత్యను
కళ్లారా చూశాక
పాలకుల్ని, రక్షకుల్ని, ఎవరు నమ్మారు?
అందుకే గదా
పశువుల మూగతనంలోంచి
ఊరు బయట మూలుగులోంచి
దూడచర్మం, ఎద్దుకొమ్ము సంస్కృతిలోంచి
అక్షరాలు స్వేచ్ఛగా బయటకొచ్చాయ్
ఉక్కు పాదాలను తొలుచుకుంటూ
సంకెళ్లను చీల్చుకుంటూ
అక్షరాలిక్కడ బయట పడుతున్నాయ్
బయటపడ్డ అక్షరాలే
మహావాక్య నిర్మాణానికి సిద్ధమై నించున్నాయ్
ఏకలవ్యుడి తెగిపడ్డవేలు
కార్చిన ప్రతినెత్తుటి చుక్కా
గురికాడై అక్షరం ముందు నిలబడింది

తెగిపోయిన వేళ్ల సాక్షిగా
గురువుల్ని వెంటాడి శిక్షించాలి
శంభూకుడి మొండెం వాళ్ల పతాకం కావాలి
అందర్నీ ఏకం చేస్తున్న కంఠమొకటి
కొత్తపాటకు రాగాన్ని మీటాలి
వాళ్ల బ్రతుకును చావుగా చేసిన
ఈ వ్యవస్థ శవపేటికను మోనుకుపోవాలి
ఈ సారి
కోడి కూయక ముందే
కాళ్లూ చేతులూ
స్వేచ్ఛగా ఉదయించే కిరణాలవుతాయి.

(డిశంబర్ 1993,'పాదముద్ర' పుస్తకం నుంచి)



అటు మార్క్సిస్టులూ ఇటు దళితవాదులూ పట్టించుకోని విషయాల్ని దళితకవులు పట్టించుకున్నారు. ఆర్థికేతర, వర్గేతర అంశాల్ని మన మార్క్సిస్టులు ఖాతరు చేయనట్లే కులమతేతర అంశాల్ని దళితవాదులు ఖాతరు చేయడంలేదు. కానీ దళితకవులు మాత్రం ఈ వ్యవస్థ వర్గ, కుల స్వభావాన్ని అర్థంచేసుకోగలిగారు. దళితవాదమంటే దేశీయ మార్క్సిజం అనీ, అంటే దేశీయంగా అభివృద్ధి అయిన పూలే అంబేడ్కర్‌ల సిద్ధాంతాల్ని assimilate చేసుకున్న మార్క్సిజమనీ, అదేసరయిన మార్క్సిజమనీ ఎక్కువ మంది దళితకవులు అర్థంచేసుకున్నారనేదానికి ఈ పుస్తకం మంచి ఉదాహరణ. దీనికి కారణం మార్క్సిజం - అంబేడ్కరిజంలు పునాదిగా గల తాత్విక అవగాహనే అని అర్థమవుతుంది. ఈ అవగాహనే ఆరోగ్యకరమయినదవుతుంది. ఈ దేశాన్ని ముందుకు నడిపించేదవుతుంది. అందుకే దళితకవిత్వం ఇప్పుడు వస్తున్న అన్ని కవితా ధోరణులకంటే ఆధునికతని కలిగి ఉందనడంలో సందేహంలేదు. స్థానికీకరించిన సమస్య ద్వారా సాధారణ స్ఫూర్తిని వ్యక్తంచేస్తున్న కవిత్వం దళిత కవిత్వం.